తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 29.08.2025 | సంపుటి : 12 సంచిక : 40 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ఉత్తరతెలంగాణను ముంచెత్తిన వరదలు



- కుంభవృష్టితో కామారెడ్డి, మెదక్ జిల్లాలు కకావికలం
- వరదప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ ఏరియల్ సర్వే

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

భారీ వర్షాలతో పోటెత్తినవరదలతో స్వరం జలమయమైన కామారెడ్డి పట్టణం



కామారెడ్డిలో నీట మునిగిన రైలు పట్టాలు



- అల్పపీడనంతో అతలాకుతలం • రంగంలోకి ఆర్మీ, ఎన్డీఆర్ఎస్
- కల్వర్లుకు గండ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు, రాకపోకలకు అంతరాయం
- అనేక చోట్ల మునిగిన పంటలు • చెరువులను తలపిస్తున్న ఊళ్లు
- కామరెడ్డి పట్టణాన్ని ఖాళీ చేసిన ప్రజలు • డ్రోన్లతో ఆహారం అందచేత
- ముమ్మరంగా సహాయక చర్యలు • విద్యాసంస్థలకు సెలవులు ప్రకటన
- ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా
- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం • మరో రెండ్రోజుల పాటు వర్షాలు
- ఏపీలోనూ కుండపోత వర్షాలు • ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

**హైదరాబాద్(జనంసాక్షి):** అల్పపీడనం అతలాకుతలం చేసింది. అల్పపీడన ప్రభావంతో కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురియడంతో భారీ నష్టం జరిగింది. చెరువుల, కాలువులు పొంగిపొర్లాయి. కల్వర్లు, రోడ్లు తెగాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాలు భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన

మిగతా 2లో..

## గోదావరి జలాల తరలింపులో శ్రీపాద కీలకం

**కూలిపోయిన ప్రాజెక్టుకు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా ఉంటుంది : సీఎం రేవంత్ రెడ్డి**

**మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలో నీటి నిల్వ అసాధ్యం**

- భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- పాతబడ్డ ఇళ్లల్లో ప్రజలను ఖాళీ చేయించాలి
- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి
- వాగులు, కాజ్‌వేల వద్ద రాకపోకల పరిశీలన
- మెదక్,కామారెడ్డిల్లో వరదల పరిస్థితిపై సీఎం ఆరా

పెద్దపల్లి(జనంసాక్షి):గోదావరి జలాలను తెలంగాణలో ఎక్కడికి తరలించాలన్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు కీలకమైనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో కలిసి వరదప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు.

మరిన్ని వార్తలు 2లో, లోపలి పేజీల్లో..

## 2 వేల మందిని కాపాడాం

10 మంది మృతి చెందినట్లు సమాచారముంది: డీజీపీ జితేందర్

## వరదలపై కేసీఆర్ ఆందోళన

సహాయక చర్యలకు సహకరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

2లో..

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి



**రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు కృషి**

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వోద్యోగాలు కల్పించాం : సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- క్రీడా పోటీలు, సబ్ కమిటీల ఏర్పాటుపై సమావేశంలో తీర్మానాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు

మిగతా 2లో..

## అమెరికాలో మన విద్యార్థులపై మరో పిడుగు



- వీసా నిబంధనలు సవరిస్తున్న అగ్రరాజ్యం
- ఇకపై అమెరికాలో నాలుగేళ్ల వరకే!
- వీసాలపై ఎన్నాళ్లయినా అమెరికాలో ఉంటామంటే కుదరదని చెప్పిన హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికాలో చదువుకునేందుకు ప్రయత్నిస్తున్న, ఇప్పటికే అక్కడే ఉంటున్న విదేశీ విద్యార్థులు మీద ట్రంప్ సర్కార్ మరో పిడుగు వేసింది. ఇప్పటికే వీసాల జారీకి సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినంగా అమలు చేస్తోన్న అమెరికా, తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తోంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతిని ధులకు జారీ చేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను తీసుకురానుంది. అంటే ఇ కపై విదేశీ విద్యార్థులు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా వీసా నిబంధనల్లో మార్పులు తీసుకొస్తోంది.ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అగ్రరాజ్యంలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' సదుపాయం ఉంది. అంటే వారు ఎంత కాలం చదవాలనుకుంటున్నా లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలని అనుకుంత కాలం అమెరికాలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూంల్యాండ్ సెక్యూరిటీ విభాగం

మిగతా 2లో..

## చైనా పర్యటనకు మోదీ



- 31న జిన్‌పింగ్‌తో భేటీ
- ఎస్‌సీఓ సదస్సులో పాల్గొననున్న ప్రధాని
- చైనా, భారత్ సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం

**బీజింగ్(జనంసాక్షి):**నాలుగు రోజులు విదేశీ పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం సాయంత్రం బయలుదేరనున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు సాగే పర్యటనలో రెండు రోజులు జపాన్‌లో, మరో రెండు రోజులు చైనాలో పర్యటిస్తారు. చైనా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ, ఆగస్టు 31నే ఆదేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. లద్దాఖ్ సరిహద్దుల్లో ఇరుదేశాల మధ్య దెబ్బతిన్న దౌత్య సంబంధాలను బలోపేతం చేసేందుకు ఈ సమావేశం కీలకం కానుంది. అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ మోదీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.ఆగస్టు 29, 30 తేదీల్లో జపాన్‌లో పర్యటించే ప్రధాని మోదీ, భారత్- జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. పలువురు ఉన్నతస్థాయి వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులను కలుస్తారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం కృషిచేస్తున్న జపాన్‌లో ప్రధాని పర్యటన ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగశాఖ కార్యదర్శి

మిగతా 2లో..

## ప్రజలు అవస్థలు పడుతుంటే.. మూసీ సుందరీకరణపై సమీక్షలా?

రాజన్నసిరిసిల్ల జిల్లాలో వరద ప్రాంతాలను పరిశీలించిన కేటీఆర్

2లో..



## పేలుళ్ల అనుమతులకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలి

హైకోర్టు

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్‌లోని న్యాయవిహార్ సమీపంలో పేలుళ్లకు ఎవరు అనుమతి ఇచ్చారని తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్ ప్రశ్నించారు. ఈ మేరకు దాఖలైన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల అనుమతితో పేలుళ్లు నిర్వహించారని గనులశాఖ తరఫు న్యాయవాది తెలపగా.. బ్లాస్టింగ్ తీవ్రత, రాళ్లు ఎంతదూరం పడతాయనే అంశాలపై పోలీసులకు అవగాహన ఉంటుందా అని సీజే ప్రశ్నించారు. సిటీ పోలీస్ యాక్ట్ కింద అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారని..

మిగతా 2లో..

## త్వరలో మరిన్ని ఆధారాలు బయటపెడతా..

**ఎన్నికల సంఘం, భాజపా కుమ్మక్కయ్యాయి**

**తమ ఓట్లు దొంగిలిస్తే బిహార్ ప్రజలు సహించబోరు**

**'ఓటర్ అధికార్ యాత్ర'లో రాహుల్ గాంధీ**



**పట్నా(జనంసాక్షి):**'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ భాజపా, ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ ఓట్లను దొంగిలిస్తే బిహార్ ప్రజలు సహించబోరన్నారు. ఓటర్ల జాబితా నుంచి రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆక్షేపించారు. అందులో ఎక్కువమంది బడుగు బలహీనవర్గాల వారే ఉన్నారని అన్నారు. సీతామఢీలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 'ఓట్ చోరీ' గురించి రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని అన్నారు. "ఎన్నికల సంఘం, భాజపా కుమ్మక్కై ఓట్లను దొంగిలించాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలో ఇదే పంథా కొనసాగించారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, ఇక్కడి

మిగతా 2లో..

## విషాదం నింపిన పుట్టినరోజు వేడుక

కూలిన భవనం.. 15 మంది మృతి

## ఎన్నికల ముందు బిహార్‌లో హైఅలర్ట్

రాష్ట్రంలోకి చొరబడిన జైషే ఉగ్రవాదులు

## ఉత్తరాదిని వణికిస్తున్న వర్షాలు


50కి.మీ మేర ట్రాఫిక్ జామ్

## ట్రంప్ టారిఫ్‌లకు జీఎస్టీ సంస్కరణలతో చెక్!

వివరాలు 2వ పేజీల్లో..

## ఆగని బాంబుల వర్షం

**ఉక్రెయిన్‌పై 598 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా**



కీవ్(జనంసాక్షి):ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ఆగడం లేదు. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఓ వైపు అమెరికా ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఫలితం పెద్దగా కనిపించడం లేదు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై గురువారం రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 598 డ్రోన్లు, 31 తేలికపాటి క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా.. 48 మందికి గాయాలైనట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మృతుల్లో 2, 14, 17 ఏళ్ల వయసున్న ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది .మూడేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరు దేశాల అధ్యక్షులతోనూ మంతనాలు సాగిస్తున్నారు. ఇరుదేశాల మధ్య శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్న క్రమంలో ఇటీవల రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదే. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. తాజా ఘటనను ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. చర్చలకు రాకుండా రష్యా బాలిస్టిక్ క్షిపణులను వినియోగిస్తోందని మండిపడ్డారు. " శాంతిని కోరుకునే యావత్ ప్రపంచం తాజా ఘటనపై స్పందించాలి. గతంలో చాలా మంది శాంతి మంత్రం జపించారు. ఇప్పుడు

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
29.08.2025

## అమెరికాలో మన విద్యార్థులపై మరో పిడుగు

సిద్ధమైంది. అంతేకాకుండా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది.'విదేశీ విద్యార్థులు, ఇతర వీసాదారులు అమెరికాలో నిరవధికంగా నివసించేలా చాలా కాలంగా అమెరికాలోని గత ప్రభుత్వాలు అవకాశం ఇచ్చాయి. దీని వల్ల భద్రతాపరమైన ఇబ్బందులతో పాటు అమెరికన్లకు ప్రయోజనాలపై భారీగానే దెబ్బపడింది. అందుకే దీనికి ముగింపు పలికేలా కొత్త నిబంధనలను తీసుకొస్తున్నాం. కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి ప్రతిపాదించాం. దీనివల్ల ఫెడరల్ ప్రభుత్వంపై భారం తగ్గనుంది' అని హెూంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ నోటీసుల్లో తెలిపింది.

## వరదలపై కేసీఆర్ ఆందోళన

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తం కావడం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ నుండి ఖమ్మం దాకా పలు జిల్లాల్లో వరదలతో నివాసాలు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలకు అధినేత ఫోన్లు చేసి ఈమేరకు అప్రమత్తం చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తమవంతుగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ దిశగా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అధినేత కేసీఆర్ సూచించారు.

## 2 వేల మందిని కాపాడాం

హైదరాబాద్: ఉత్తర తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తాయి. భారీ వర్షాల వల్ల 10 మంది వరకు చనిపోయి ఉండొచ్చని అనుకుంటున్నామని, మరణాలపై ఇంకా స్పష్టత రాలేదని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్టు డీజీపీ వివరించారు. సహాయక చర్యల కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఉత్తరాదిని వణికిస్తున్న వర్షాలు..


ఉత్తరాదిని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రోడ్లు మూసుకుపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.చండీగఢ్‌- కులూమనాలి జాతీయ రహదారి పలుచోట్ల బ్లాక్ అయ్యింది. దీంతో వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు 50 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించిపోయినట్లు చెప్పారు. దేశ రాజధాని దిల్లీకి ఈ మార్గంలోనే ఎక్కువగా పండ్లు, కూరగాయలు రవాణా అవుతాయి. దాదాపు ఆ ట్రక్కులన్నీ ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో ప్రయాణికులను నిలిపివేసి.. నిత్యావసర వస్తువుల రవాణాకు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణ ప్రయాణికులు గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. అధికారులు కలగజేసుకొని వారికి సర్దిచెప్పి ట్రాఫిక్‌ను చక్కదిద్దుతున్నారు. మండి- కులూ మధ్యనే దాదాపు 12 చోట్ల కొండ చరియలు విరిగిపడినట్లు అధికారులు చెబుతున్నారు. బియాస్ నదీ ఉద్ధృతంగా ప్రవహించడం వల్ల కులూ-మనాలి మధ్య పలుచోట్ల రహదారి కోతకు గురైనట్లు ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్ అశోక్‌చౌహాన్ తెలిపారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. తాజా పరిస్థితులను దృష్టిలోఉంచుకొని విహార యాత్రలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

## ప్రజలు అవస్థలు పడుతుంటే.. మూసీ సుందరీకరణపై సమీక్షలా?

రాజన్నసిరిసిల్ల(జనంసాక్షి): వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డికి పట్టింపులేనట్లుగా ఉందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.సిరిసిల్లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "వరదలు ముంచెత్తుతుంటే.. మూసీ సుందరీకరణ, ఒలింపిక్స్ క్రీడల గురించి సీఎం సమీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం పని చేయకపోయినా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలి. రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలి"అని డిమాండ్ చేశారు.

## విషాదం నింపిన పుట్టినరోజు వేడుక

### కూలిన భవనం.. 15 మంది మృతి



**ముంబై(జనంసాక్షి):**మహారాష్ట్రలో తీవ్ర విషా దం చోటుచేసుకుంది. పాల్ఘర్ జిల్లాలోని విరార్ ప్రాంతంలో ఓ భవనం కూలడంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. ఈ ఘటనలో భవనం యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. విరార్ ప్రాంతంలో చట్టపరమైన నిబంధనలు పాటించకుండా నిర్మించిన నాలుగు అంతస్తుల భవనం పక్కనే ఉన్న నివాసంపై కూలిపోయింది మొత్తం 50 ఫ్లాట్లు ఉండగా.. 12 నివాసాలున్న ఒక పక్కభాగమంతా కూలింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో నాలుగో అంతస్తులో ఒక చిన్నారి తొలి పుట్టినరోజు జరుగుతోంది. ఈ ఘటనలో ఆ చిన్నారితో పాటు తల్లిదండ్రులు, అతిథులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. తల్లీబిడ్డా మృతి చెందగా.. తండ్రి జాడ తెలియాల్సిఉంది. ఇప్పటివరకు 15 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇంకా సహాయచర్యలు కొనసాగుతున్నాయని స్థానిక అధికారులు మీడియాకు వెల్లడించారు. గాయపడిన వారికి సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. "పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న వారంతా సంతోషంగా నృత్యం చేస్తున్నారు. అప్పుడే పేకమేడలా భవనమంతా కూలిపోయింది దాంతో హాహాకారాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారిపోయింది" అని ప్రత్యక్ష సాక్షి ఒకరు వెల్లడించారు. కూలడానికి ముందు భవనానికి ఎలాంటి పగుళ్లు కనిపించలేదని చెప్పారు. భవన యజమాని, అధికారుల నిర్లక్ష్యంపై వెంటనే విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అన్ని కుటుంబాలు ఆ భవనంలో ఉండటానికి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. అదృష్టవశాత్తూ పక్కన ఉన్న భవనం ఖాళీగా ఉందని ఎన్డీఆర్ఎఫ్ అధికారి వివేకానంద కదమ్ అన్నారు. ముందుజాగ్రత్తలో భాగంగా శిథిలావస్థలో ఉన్న భవనాల్లోని నివాసితులను ఖాళీ చేయించినట్లు చెప్పారు. కూలిన భవనం అక్రమంగా నిర్మించిందని స్థానిక మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

# ఉత్తరతెలంగాణను ముంచెత్తిన వరదలు





భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు చెరువులను తలపించాయి. దాదాపు పంటలన్నీ దెబ్బతిన్నాయి. కామారెడ్డి -భిక్కనూర్ మార్గంలో రైలు పట్టాల కింద వరద పోటెత్తడంతో భారీ గండిపడింది. దీంతో అధికారులు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వాగు పొంగడంతో కార్లు వరద ప్రవాహంలో కొట్టు-కుపోయాయి. హౌసింగ్ బోర్డు కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కామారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు- విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. మెదక్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణశాఖ పేర్కొంది. భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించ నున్నారు. మరోవైపు భారీ వర్షాల దృష్ట్యా తెలంగాణ వర్సిటీ- పరిధిలో పరీక్షలు వాయిదా పడ్డాయి. శుక్రవారం యథాతథంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు- వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికంగా వరద రావడంతో పోచారం ప్రాజెక్టు కట్ట కోతకు గురి అయింది. బుధవారం రాత్రి వరద నీరు అధికంగా రావడంతో అలుగు సమీపంలో కట్ట కోతకు గురి అయిందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దానితో ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదని నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలను వేయిస్తామని పేర్కొన్నారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ ఎడ్లకట్ట వాగు సమీపంలో వరదలో చిక్కుకొని కారుతో సహ తండ్రీకొడుకులు వాగులో కొట్టుకుపోయారు. దోమకొండకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మేక చిన్న హరిశంకర్, ఆయన కుమారుడు మహేశ్ తమ కారులో.. గోడకూలి మృత్యువాత పడ్డ తన మేనల్లుడి అంత్యక్రియల కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారుపై కూర్చొని సాయం చేయాలంటూ సైగలు, అరుపులు చేశారు. ఇది గమనించిన సంగమేశ్వర్ గ్రామస్థులు జేసీబీ సాయంతో కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. ప్రవాహంలో కొట్టు-కుపోతూ చివరకు చెట్టు-ను పట్టు-కొని అలాగే ఉండిపోయారు. దాదాపు 9 గంటల నరకయాతన అనుభవించిన అనంతరం వరద ఉద్ధృతి తగ్గడంతో వ్యవసాయ భూముల నుంచి పాక్కుంటూ బయటకు వచ్చారు. వారు సురక్షితంగా బయటపడటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. కామారెడ్డి-ఎల్లారెడ్డి మార్గంలో లక్ష్మాపూర్ గ్రామం వద్ద రోడ్డు కోతకు గురైంది. రాజంపేట మండల కేంద్రంలో వర్షానికి గోడ కూలి యువ వైద్యుడు మృతి చెందాడు. రాజంపేటకు చెందిన వినయ్ (28) గుండారం పల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. భారీ వర్షానికి రాజంపేటలోని దేవుని చెరువు కట్ట తెగి వినయ్ ఇంట్లోకి వరద నీరు చేరింది. నీటిని బయటకు మళ్లించేందుకు గడ్డపారతో గోడకు రంధ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ గోడ కూలి మీద పడటంతో వైద్యుడు వినయ్ అక్కడిక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజంపేట మండలంలోని 3 తండాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బీబీపేట మండలంలో 9 మంది యువకులు చెరువు కట్టపై ఇరుక్కు పోయారు. కామారెడ్డి జిల్లా తిమ్మారెడ్డిలోని కల్యాణి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై బొగ్గు గుడిసె సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న ఆరుగురు కార్మికులు వరదలో చిక్కుకున్నారు. ఈ వరద కారణంగా కామారెడ్డి-భిక్కనూర్ సమీపంలో రైలు పట్టాల కింద గండిపడింది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.ఉమ్మడి ఆదిలాబాద్‌లోని బుధవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాల నేపథ్యంలో గురువారం ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు లోతట్లు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారికోసం డ్రోన్ సహాయంతో ఆహార పదార్థాల చేరవేత చేపట్టారు. అల్పపీడన ప్రభావంతో మెదక్ జిల్లాలో భారీ వర్షాలు దంచికొట్టాయి. దీంతో వరద ఉద్ధృతికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. 30 మంది జవానులు రాజాపేటకు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. పాపన్నపేట మండలం ఎల్లాపూర్ వంతెన వద్ద మంజీరా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నది ప్రవాహదాటికి వంతెన పైకి వరద నీరు చేరింది. వరద కారణంగా మంబోజిపల్లి నుంచి ఎల్లాపూర్ వైపు అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

విద్యాసంస్థలకు సెలవులు ప్రకటన

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు- విద్యాసం స్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయకు రాకూడదని అధికారులు సూచించారు. వర్ష ప్రభావం కారణంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఆగస్టు 29, 30 వరకు సెలవులు ప్రకటించినట్లు- ప్రభుత్వం తెలిపింది. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సెలవులను మరో రెండు రోజులు పొడిగించింది.

కాకతీయ పరిధిలో పరీక్షలు వాయిదా

పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

## గోదావరి జలాల తరలింపులో శ్రీపాద కీలకం

కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వచ్చిన వరదలతో పలువురు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం శ్రీపాద ఎల్లంల్లిని పరిశీలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. స్ట్రాటజిక్ లోకేషన్‌తో కట్టిన ప్రాజెక్టు శ్రీపాద ఎల్లంపల్లి అని.. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా ఉందన్నారు. నిపుణులు కట్టిన ప్రాజెక్టు కాబట్టే ఎల్లంపల్లి దశాబ్దాలుగా నిలబడిందని పేర్కొన్నారు. మేడిగడ్డ పనికిరాకుండా పోయింది. మేడిగడ్డ రిపేరు చేయకుండా.. అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు .. ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారు. మేడారం, అన్నారం, సుందిళ్ల.. మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలి. 3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగేతే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయి. మేం.. 80వేల పుస్తకాలు చదవలేదు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావిని సలహా అడుగుతున్నాం ఏం చేద్దామని. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ- సూచనల ప్రకారం వెళ్తాం. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తాం అని సీఎం స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం.. పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతకుముందు కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలపై సమీక్షించారు సీఎం రేవంత్‌రెడ్డి. అనంతరం మెదక్, పెద్దపల్లి జిల్లాలో సీఎం బృందం ఏరియల్ సర్వే చేసింది. అనంతరం వరదలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని ఉద్ఘాటించారు. కాళేశ్వరం ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, మామ అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవని విమర్శించారు. అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యమని ఎద్దేవా చేశారు. నీళ్లు నింపితే గ్రామాలే కొట్టుకపోతాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల ప్రాజెక్ట్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక వైఫల్యం ఉందని తెలిపారు. డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపం ఉందని పేర్కొన్నారు.

## ఎన్నికల ముందు బిహార్‌లో హైఅలర్ట్

పట్నా(జనంసాక్షి): మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఉగ్ర కలకలం రేగింది. రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది.దీంతో బిహార్ పోలీసు హెడ్ క్వార్టర్స్ గురువారం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ జారీ చేసింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదుగా బిహార్ చేరుకున్నట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదులను హస్నైన్ అలీ (రావల్పిండి), ఆదిల్ హుస్సేన్ (ఉమర్‌కోట్), మహ్మద్ ఉస్మాన్ (బహవల్‌పూర్)గా గుర్తించారు. వీరంతా పాక్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహ్మద్ ముఠా సభ్యులని పోలీసులు వెల్లడించారు. ఆగస్టు రెండోవారంలో వీరు కాఠ్‌మాండూ చేరుకుని, గతవారం బిహార్ లోకి చొరబడ్డారని నిఘా వర్గాలు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే వీరి ఫొటోలు, ఇతర వివరాలను సరిహద్దు జిల్లాల పోలీసులకు పంపించారు. ఈ ప్రాంతాల్లో నిఘా పెంచాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కన్పిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం ఈ రాష్ట్రంలోనే పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. నేపాల్‌తో సరిహద్దు ఉన్న జిల్లాలతో పాటు సీమాంచల్ ప్రాంతంలో భద్రతను పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను పెంచారు.ఈ ఏడాది మే నెలలోనూ బిహార్‌లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిఘా వర్గాలు గుర్తించాయి. కేవలం 20 రోజుల వ్యవధిలోనే 18 మంది కొత్తవారు రాష్ట్రానికి వచ్చినట్లు తెలియడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. కొందరిని అరెస్టు చేయగా.. నిందితుల్లో ఒకడు ఖలిస్థానీ అనుకూలుడని తెలిసింది. ఈ రాష్ట్రం 729 కిలోమీటర్ల మేర నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటోంది. దీంతో అక్రమ చొరబాట్లకు హాట్‌స్పాట్‌గా మారుతోంది.

## మరిన్ని ఆధారాలు బయటపెడతా

ప్రజలు దీన్ని సహించరు." అని అన్నారు. యాత్రలో భాగంగా స్థానిక సీతాదేవి ఆలయాన్ని రాహుల్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 17న ప్రారంభమైన యాత్ర.. 16 రోజుల పాటు 1,300కి.మీ మేర సాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి

ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ధాని ఫౌండేషన్ వీతా ధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యత పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు... బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని.. అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు...హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు...క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని...అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు.

## చైనా పర్యటనకు మోదీ

విక్రమ్ మిస్రి చెప్పారు. ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబర్ 1న చైనాలో పర్యటించనున్న ప్రధాని తియాన్జిన్‌లో జరిగే షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసే బాంక్వెట్ విందులో పాల్గొంటారు. సరిహద్దుల్లో గల్వాన్ ఘటన తర్వాత తొలిసారి చైనా పర్యటనకు వెళుతున్న ప్రధాని పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరపుతారు.ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య ఒప్పందాలు జరుగుతాయని విదేశాంగశాఖ వెల్లడించింది.ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే ఈ రెండు రోజుల ఎస్?సీఓ సదస్సులో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా 20కిపైగా ప్రపంచ నాయకులు పాల్గొననున్నారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో గ్లోబల్ సౌత్ దేశాల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తోంది. మోదీ, పుతిన్‌తో పాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సీఓ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఎస్?సీఓ స్థాపన తర్వాత ఇదే అతి పెద్ద సదస్సు కానుందని ఇటీవల చైనా ప్రకటించింది.తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది.ఇక 2024లో రష్యాలో జరిగిన బ్రిక్స్? సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్?పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్?తో ప్రధాని మోదీ కలిసి ఒక వేదికపై చివరిసారిగా కనిపించారు. ఆ సయమంలో ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా దేశాల నేతలు రష్యాకు దూరంగా ఉన్నారు. ఇటీవల భారత్-చైనా-రష్యా మధ్య త్రైపాక్షిక చర్చలు త్వరలో జరగాలని మాస్కో ఆశిస్తున్నట్లు దిల్లీలోని రష్యా దౌత్యవేత్తలు సంకేతాలు ఇచ్చారు.

## పేలుళ్ల అనుమతులకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలి

నగరంలో భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. పేలుళ్ల అనుమతులకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు ఉండాలని జస్టిస్ ఏకే సింగ్ అభిప్రాయపడ్డారు. ఇళ్ల నిర్మాణంలో భాగంగా భారీ పేలుళ్లు నిర్వహిస్తున్నారని సీజే ధర్మాసనానికి ఓ న్యాయమూర్తి లేఖ రాశారు. భారీ పేలుళ్లతో రాత్రివేళ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. గుట్టలను యథేచ్ఛగా తొలగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. ఆ లేఖను ధర్మాసనం గతేడాది సెప్టెంబర్‌లో సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. తాజాగా మరోసారి విచారణ సందర్భంగా అనుమతితోనే పేలుళ్లు నిర్వహించారని.. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బ్లాస్టింగ్‌కు అనుమతి ఉందని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ఆయన సమయం కోరారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది.

## ఆగని బాంబుల వర్షం..

మాత్రం మిన్నకుండిపోతున్నారు." అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కీవ్ నగరంలోని దాదాపు 20 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 100 భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. మరోవైపు 563 డ్రోన్లను, 26 క్షిపణులను విజయవంతంగా నేల కూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ వెల్లడించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు సహా, మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ కూడా ప్రస్తావించారు. 'యుద్ధాన్ని ముగించేందుకు ఇచ్చిన అన్ని గడువులను రష్యా ఇప్పటికే అతిక్రమించింది. ఇరుదేశాల మధ్య శాంతి కుదిర్చేందుకు చేసిన దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి' అని అన్నారు. జెలెన్‌స్కీతో ప్రత్యక్షంగా శాంతి చర్చలు జరిపేందుకు అమెరికా చేసిన ప్రతిపాదనను పుతిన్ తిరస్కరించడంపై ఇటీవల ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రత్యక్ష చర్చలకు షెడ్యూల్ ఖరారు కాకపోతే రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని గత శుక్రవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు గురువారం రాత్రి ఉక్రెయిన్‌కు చెందిన 102 డ్రోన్లను నేల కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యాలోని నైరుతి భాగమే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగుతున్నట్లు పేర్కొంది. క్రాస్‌నోడార్ ప్రాంతంలోని అఫిప్‌స్కీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమర రీజియన్‌లోని మరో చమురు శుద్ధి కేంద్రం పైనా ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసినట్లు

# గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి




చర్ల (జనం సాక్షి) : చత్తీస్‌ఘడ్ మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్కౌంటర్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. నారాయణపూర్ (చత్తీస్గడ్), గడ్చిరోలి (మహారాష్ట్ర) సరిహద్దు అడవుల్లో ఘట్టాదళం ,కంపెనీ నెంబర్ 10, గడ్చిరోలి డివిజన్ కు చెందిన కీలక మావోయిస్టులు సమావేశంలో ఉన్నారని జిల్లా యాంటీ నక్సల్స్ యూనిట్ కు సమాచారం అందింది. దీంతో అ దనపు ఎస్పి (ఆపరేషన్స్)ఎం రమేష్ నేతృత్వంలో 19 సిబి60, సిఆర్పిఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్ కోపర్సి అడవులకు తరలించారు. అక్కడ అడవుల్లో మావోయిస్టులు, బలగాలకు మధ్య దాదాపు 8 గంటల పాటు ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఘటన ప్రాంతంలో ఒక మహిళ మావోయిస్టు మృతదేహంతో సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇక్కడ అడవుల్లో ఒక ఇన్సాస్, రెండు ఎస్ ఎల్ ఆర్, ఒక 30 రైసులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ వర్షాలు నేపథ్యంలో తప్పించుకుపోయిన మావోయిస్టుల కోసం ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని డీఐజీ అంకిత్ గోయల్ తెలిపారు.



### బీజాపూర్ జిల్లాలో 30 మంది మావోయిస్టుల లొంగుబాటు..

చర్ల(జనం సాక్షి)చత్తీస్గడ్ లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం పోలీసు ఉన్నతాధికారుల ఎదుట 30 మంది మావోయిస్టులు లొంగి పోయారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట వీరు లొంగి పోయారు. లొంగిపోయిన వారిపై ప్రభుత్వం తరపున రూ .81 లక్షల రివార్డ్ ఉన్నట్లు ఆయన తెలిపారు. లొంగిపోయిన వారిలో డివి సీఎం ( డివిజినల్ కమిటీ మెంబర్), ఏ సీఎం (ఏరియా కమిటీ మెంబర్), కంపెనీ స్థాయి సభ్యులు, డీఏ కేఎంఎస్, మిలీషియా సభ్యులు ఉన్నారు. ఈ లొంగుబాటు వెనక ప్రభుత్వ పునరావాస విధానం పెద్ద పాత్ర పోషించిందని ఎస్పీ వెల్లడించారు.

# విద్యుత్ అమరవీరుల స్థూపానికి వామపక్ష నేతల నివాళి




హైదరాబాద్ (జనంసాక్షి) : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా సమస్యల విధానాలపై పోరాటం చేయాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ప్రతిఘటించాలని కోరారు. రాజ్యాంగాన్ని, లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. విద్యుత్ అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల నేతలు గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న షహీద్‌చౌక్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి జోహార్ జోహార్, ప్రపంచబ్యాంకు విధానాలు నశించాలి. విద్యుత్ అమరవీరులకు జోహార్ జోహార్, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాడదాం, వర్ధిల్లాలి ప్రజాపోరాటాలు, ప్రయివేటీకరణ విధానాలు నశించాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

### విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం : జాన్‌వెస్లీ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తున్నదని విమర్శించారు. అంబానీ, అదానీలకు విద్యుత్‌రంగాన్ని ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని చెప్పారు. సామాన్యులు విద్యుత్‌ను వాడుకోలేని పరిస్థితి ఉండబోదని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నదని విమర్శించారు. మతోన్మాదం పేరుతో ప్రజలను విభజిస్తున్నదని చెప్పారు. విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ : పశ్యపద్మ

మోడీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ విమర్శించారు. అందులో భాగంగానే గతేడాది విద్యుత్ సంస్కరణలకు పూనుకుందని చెప్పారు. విద్యుత్ భారాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, ఎండీ అబ్బాస్, మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లలో ఎప్పుడూ ఇంతటి వర్షం చూడలేదు

- సిద్దిపేటలో భారీ వర్షంతో కాలనీల్లోకి నీరు
- ముంపుప్రాంతాల్లో హరీష్ రావు పర్యటన

సిద్దిపేట,ఆగస్టు 28(జనంసాక్షి) : 20 సంవత్సరాలలో సిద్దిపేటలో ఇలాంటి వర్షం ఎప్పుడు పడలేదని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో కురిసిన వర్షాలకు కోమటి చెరువు నాల వరద ఉధృతికి గురైన ముంపు ప్రాంతాలు శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయి లో పర్యటించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను, మున్సిపల్ అధికారులను హరీష్ రావు ఆదేశించారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. తొగుట మండలంలో 20 సెంటీమీటర్ల వర్షం పడి ప్రజలు ఇబ్బంది పడ్డారని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెన్షన్ పెంచాల్సిందే..

- పెన్షన్ పైసలను ఎగగొట్టి రేవంత్ సర్కార్ దగా చేసింది
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 28 (జనంసాక్షి) : కాళ్లులేనోళ్ల, చేతులు లేనోళ్ల, కండ్లు లేనోళ్ల పెన్షన్ పైసలను ఎగగొట్టి రేవంత్ సర్కార్ దగా చేసిందని, ఇచ్చిన హామీని అమలు చేయడం చేతకాకపోతే రాజీ నామా చెయ్యాలని, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 09లోపు పెన్షన్ పెంచాల్సిందేనని, పెన్షన్ పెంచకపోతే లక్షలాది మందితో చలో హైదరాబాద్ పెన్షన్ దారుల గర్జన నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ అన్నారు. వికలాంగుల చేయూత పెన్షన్ దారుల నియోజకవర్గ స్థాయి సన్నాహక సదస్సును సిరిపురం గార్డెన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విహెచ్ పిఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమ రాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ డిసెంబర్లోనే పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ పింఛన్లు పెంచకుండా వారి పెన్షన్ డబ్బులను పక్కదారి పట్టించి ద్రోహం చేశారని మండిపడ్డారు. ఇప్పటి కైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీల మౌనం వీడాలని గుర్తు చేశారు. సెప్టెంబర్ 3 లోపు గనుక స్పందించకపోతే ఛలో హైదరాబాద్, పరేడ్ గ్రౌండ్ లో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభతో కుప్ప కూల్చుతామని, పింఛన్దారుల శక్తి ఏందో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయ కులు నల్లమిల్ల నాగరాజు, చాడ ఏలియా, గాదె శ్రీధర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్, గుర్రం అశోక్, మంద శ్రీనివాస్, గోవింద్ ఇస్సాక్, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలపై మంత్రి జూపల్లి సమీక్ష



నిర్మల్ బ్యూరో, ఆగస్టు27(,జనంసాక్షి) : వర్షాలు ఎక్కువగా కురుస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లను మంత్రి జూపల్లి కృష్ణారావు అప్రమత్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడారు. ఎక్కడెక్కడ వర్షాలు అధికంగా కురుస్తున్నాయి? జిల్లాల్లో వరద పరిస్థితులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ఒకవేళ అధిక వర్షాలు పడితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మరోవైపు రైతులకు యూరియా సరఫరా ఎలా చేస్తున్నారు? కొరత ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ , ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపుల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

## శ్రమ దోపిడీ విముక్తి కోసం గత పోరాటాల వారసత్వాన్ని కొనసాగించండి

సికాస కార్యదర్శి అశోక్ పిలుపు

రామగుండం (జనంసాక్షి) : సింగరేణిలో 60 వేల మంది కాంట్రాక్టు కార్మికులు అతి తక్కువ వేతనానికి ఎక్కువ గంటలు పని చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని, శ్రమదోపిడీ విముక్తి కోసం గత పోరాటాల వారసత్వాన్ని కొనసాగించాలని సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తూ ఎలాంటి హక్కులు పొందలేక పర్మినెంట్ కార్మికుల కంటే అత్యధిక దోపిడీకి గురవుతున్నారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడికి ఫలితంగానే సింగరేణి అధిక లాభాలను గడిస్తోందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ అండదండలతో పర్మినెంటు కార్మికుల శ్రమదోపిడీ చేస్తూ, యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు సమాన పనికి సమాన వేతనం సాధింపు దిశగా పోరాటాలు చేపడుతూ లాభాల్లో 30 వేల రూపాయలకు తక్కువ కాకుండా లాభాల వాటాను డిమాండ్ చేస్తూ, విధి నిర్వహణలో ప్రమాదాలు సంభవిస్తే కంపెనీ చికిత్సతో పాటు చికిత్స కాలం పూర్తి వేతనం చెల్లించాలని తదితర ప్రధాన హక్కులతో పాటు కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంటు చేయాలనే డిమాండ్‌తో గత పోరాటాల స్ఫూర్తితో కాంట్రాక్టు కార్మికులు పోరాటాలకు సిద్ధపడాలని ఈ పోరాటాలకు విప్లవ సంఘాలు ఐక్య కూటమిగా ఏర్పడి హక్కులు సాధించే వరకు క్రియాశీల పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణికి వచ్చిన పూర్తి లాభాలను ప్రకటించి, 40 శాతం లాభాల వాటా ప్రకటించాలనే కనీస పద్ధతిని పాటించకుండా ప్రతి సంవత్సరం 1 శాతం, అరకొరగా 2 శాతాన్ని ఇస్తూ యాజమాన్యం, ప్రభుత్వాలు తమ ఘనతగా ప్రకటించుకోవడం, దీనిని ఇదేదో గొప్ప విజయంగా చెప్పుకుంటున్న ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ బ్రోకర్ లీడర్లు ఇప్పటికైనా తమ దళారి విధానాన్ని మానుకొని కాంట్రా క్టు కార్మికులకు రూ.30 వేలకు తగ్గకుండా, పర్మినెంటు కార్మికులకు 40 శాతం లాభాల వాటాను ఇప్పించాలని, అందుకు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాన్ని ఒప్పించి, కార్మికుల హక్కులు, డిమాండ్ లను అమలు చేపించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మిక వ్యతిరేక చర్యలను మానుకోవాలని, లేనట్లయితే కార్మికులే ఆ సంఘాల నాయకులకు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

# భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను తక్షణమే వాయిదా వేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి
- ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, దాసోజు శ్రవణ్ కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను భారత రాష్ట్ర సమితి కోరింది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు, ఎమ్మెల్సీలు ఎల్. రమణ, డాక్టర్ శ్రవణ్ దాసోజు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు గురువారం ఒక లేఖను సమర్పించారు. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయని బీఆర్ఎస్ నేతలు తమ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరదలతో లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగా యని, వేలాది పశువులు మృత్యు వాత పడ్డాయని, రోడ్లు, నీటి పారుదల వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు తమ ప్రాణాలను, ఆస్తులను, పశువులను, పంటలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారని, వాళ్లెవరూ కూడా ఓటర్ జాబితాలో తమ వివరాలను తెలుసుకునే అవకాశం లేదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున, వారికి ఎన్నికల విధులు అప్పగించడం సరికాదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఓటర్ల జాబితా సవరణకు ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు కేవలం ఐదు రోజుల గడువు ఇవ్వడం సరికాదని బీఆర్ఎస్ తెలిపింది. చాలా పంచాయతీ కార్యాలయాలు నీట మునిగి ఉన్నాయని, జాబితాల పరిశీలన కష్టమని వివరించింది. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు స్థానిక సంస్థల ఓటర్ల జాబితా రూపకల్పన, ప్రచురణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను బీఆర్ఎస్ పార్టీ కోరింది. వరద పరిస్థితిని సమీక్షించిన అనంతరం, జిల్లా కలెక్టర్లతో సంప్రదించి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. ఓటర్లు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొనేలా పారదర్శకమైన వాతావరణంలో ఈ ప్రక్రియను భవిష్యత్తులో చేపట్టాలని సూచించింది.



## నిండుకుండలా మానేరు జలాశయం

- మిడ్‌మానేరులోకి భారీగా వరదనీరు

కరీంనగర్, ఆగస్టు 28(జనంసాక్షి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# కాగజ్‌నగర్ పట్టణవాసులకు శాపంగా మారిన సిర్పూర్ పేపర్ మిల్లు

- విచ్చలవిడిగా కాలుష్యం విడుదల
- స్థానిక ఉద్యోగులకు మండిచేయి
- పట్టించుకోని పాలకులు



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 28 (జనం సాక్షి) : పరిశ్రమలు ఏర్పాటు జరిగితే స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అక్కడి ప్రజలకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రజలు కోరుకుంటారు. కానీ ఇందుకు భిన్నంగా ఇక్కడ పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం లోని కాగజ్ నగర్ పట్టణంలో కొనసాగుతున్న సిర్పూర్ పేపర్ మిల్లు (జెకె పేపర్ మిల్లు) లో పరిస్థితి వేరే తీరుగా ఉందని, స్థానిక పేపర్ మిల్లులో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, పట్టణ ప్రజలు, రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014 సంవత్సరం సెప్టెంబర్ లో పేపర్ మిల్లు నష్టాల పేరిట మూతపడింది. అనంతరం అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ , అప్పటి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చొరవతో 2018 సంవత్సరం మార్చి నెలలో తిరిగి మిల్లు పునః ప్రారంభం జరిగింది.కానీ అప్పటినుంచి మిల్లులో గల పర్మనెంట్ ఉద్యోగులను చాలామందిని తిరిగి వీధిలోకి యాజమాన్యం తీసుకోలేదు. అప్పటినుంచి పేపర్ మిల్లు గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు సైతం నిర్వహించలేదు. అంతేకాదు కార్మికుల హక్కులను సైతం కాలరాస్తుందని పలువురు బహిరంగగా విమర్శిస్తున్నారు. ఎవరేమన్నా తమకేంటి.. అన్న చందంగా పేపర్ మిల్లు యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆవేద చెందుతున్నారు. ఈ ఆగస్టు నెలలో నిరుద్యోజేఏసీ నాయకులు పొన్న రమేష్ ఆధ్వర్యంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ యువకులు పట్టణంలో శాంతియుత ఆందోళన చేశారు. వారిని పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత 2024 మే నెలలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు పేపర్ మిల్లు లో విచ్చలవిడిగా విడుదల చేస్తున్న వాయు, జల రసాయన కాలుష్యాలపై ఫిర్యాదు చేశారు. కానీ పేపర్ మిల్లు వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. విచ్చలవిడిగా గాల్లోకి వాయు కాలుష్యం దుమ్ము ,ధూళి పొగ విడుదల చేస్తూ కాగజ్ నగర్ పట్టణ వాసులకు నరకాన్ని చూపిస్తుందని సిపిఎం పార్టీ నాయకులు ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. పేపర్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో మున్సిపల్ కమిషనర్ కు సిపిఎం పార్టీ తరపున ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మధ్యనే సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు జీవో నెంబర్ 49 ని రద్దు చేయాలని దీక్ష చేస్తున్నప్పుడు కొంతమంది నాయకులు పేపర్ మిల్లు నిరంకుశ వైఖరి పై ఎమ్మెల్యేకు వివరించారు. పేపర్ మిల్లులో కార్మికులకు స్వేచ్ఛ లేదని, కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, వేరే రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్, జార?ండ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకొని స్థానిక నిరుద్యోగ యువతకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేస్తుందని వారు ఎమ్మెల్యే వాపోయారు.

## ఖమ్మంలో పొంగుతున్న వాగులు


ఖమ్మం, ఆగస్టు 28 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా కొణిజర్లలో భారీ వర్షం కురిసింది. ఈ ప్రభావంతో పగిడేరు, నిమ్మవాగు, జన్నారం ఏరు, రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల, మల్లుపల్లి మధ్య రోడ్డు పైనుంచి పగిడేరు ప్రవహిస్తుండటంతో కొణిజర్ల, ఏన్కూరు మండలాల రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల, పెద్దమునగాల, పెద్దగోపతి, గుబ్బగుర్తి చెరువులు అలుగు పారుతున్నాయి. వాగుల ఉధృతితో ఆ పరిసర ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. తీవ్రంగా నష్టపోయినట్లు- రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలో 120 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు- అధికారులు వెల్లడించారు.

## జిల్లాలో విద్యాసంస్థలకు రెండ్రోజులు సెలవులు

కామారెడ్డి, ఆగస్టు 28 (జనంసాక్షి) : జిల్లాలో కురుస్తున్న అతి భారీ వర్షాలు మూలంగా మరో రెండు రోజులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమవ్వగా.. ఇవాళ కూడా ఆ జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉంటే.. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 62-87 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఈ రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ క్రమంలో విద్యాసంస్థలరు సెలవుప్రకటించారు.

అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు

# భారతీయ వ్యవసాయానికి ఉరితాళ్లు!



**భారతదేశం అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం డబ్ల్యూటీవో నిబంధనలకు లోబడి మనం వ్యవహరిస్తే భారతీయ వ్యవసాయ రైతులకు తీవ్రమైన నష్టం వాటిలో ప్రమాదం లేకపోలేదు. ఎందుకంటే అమెరికాలో రైతులకు 61,286 డాలర్ల ప్రభుత్వ సబ్సిడీ లభిస్తే భారతీయ రైతుకు లభించేది కేవలం 282 డాలర్లు! రాయితీల చలవతో అమెరికా నుంచి గోధుమ పాల ఉత్పత్తులు చౌకగా భారతీయ మార్కెట్ లోనికి వచ్చిన నేపథ్యంలో మన రైతుల జీవనాధారం దెబ్బతింటుందని చెప్పవచ్చు.**

భారత దేశ ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది అమెరికాలో విరివిగా పండిస్తున్న జన్యు మార్పిడి సోయా మొక్కజొన్నలు మన దేశంలోనికి దిగుమతి అయ్యే అవకాశం ఉంది. దీనితో భారతీయ ఆహార భద్రతకు పెను ప్రమాదం పొంచి ఉంది. అయితే అమెరికాతో వాణిగ్య ఒప్పందం వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసే స్థాయిలో మనం లేకపోవడం వల్ల విదేశాల నుండి ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం దీనితో భారతీయ ఆహార ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని చెప్పవచ్చు. అమెరికాలో ఇస్తున్న రైతుల రాయితీ వల్ల అక్కడి రైతులు విరివిగా పంటలు పండించడానికి అవకాశం ఏర్పడింది, దీనితో దిగుమతి అధికంగా రావడం మిగులు ఉత్పత్తి భారతదేశంపై రుద్దడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. భారతీయ సాంప్రదాయక వ్యవసాయ విధానం భారతీయ రైతు కష్టపడే తత్వం ఏ మాత్రం రైతుకు లాభదాయకంగా లేదని చెప్పాలి. అమెరికాలో ఇతర దేశాలలో ఆధునిక యంత్ర పరికరాలతో వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టడం వల్ల అక్కడి రైతులు పెద్దగా కష్టపడడం కనపడదు. కానీ భారతీయ రైతు ఎండనక వాననక ఆరుగాలం కష్టపడి పండించిన పంట అడ్డికి అమ్ముకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అమెరికా ఉత్పత్తులను అడ్డుకోకపోతే ముఖ్యంగా వాటిపై సుంకాలు అధికం చేసి అడ్డుకోవలసిన పరిస్థితులు దాపరిస్తున్నాయి. ఇది గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారతీయ రైతు తమ వ్యవసాయ ఉత్పత్తులను పెంచే దిశగా అధిక దిగుబడులు సాధించే దిశగా పంట పొలాల్లో రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా చల్లుతున్నారు. ఎరువులు దిగుమతుల కోసం కేంద్రం పెద్ద మొత్తంలో విదేశీ మార్గ ద్రవ్యాన్ని ఖర్చు చేస్తుంది. సాగుదారుల అవసరాని చేసుకొని చాలా చోట్ల నాసిరకం ఎరువుల దందా యదేచ్ఛగా కొనసాగుతుంది. దానివల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి సంబంధించి చాలా సంఘటనలు వెలుగు చూడడం లేదన్న వాస్తవం. నాసిరకం పెరుగులపై గత ఆర్థిక సంవత్సరం అయ్యా రాష్ట్రాల్లో నమోదైన కేసుల సంఖ్య.మహారాష్ట్ర 1436, మధ్యప్రదేశ 849, తమిళనాడు 536, ఉత్తరప్రదేశ్ 411, రాజస్థాన్ 392, ఆంధ్రప్రదేశ్ 364, హర్యానా 226, కేరళ 180, పంజాబ్ 164, చతిస్గడ్ 152 బీహార్ 34( ఇది కేంద్ర ప్రభుత్వం అధికారికంగా లోకసభలో వెల్లడించిన వివరాలు).

అమెరికాలో దాదాపు 25 లక్షల మంది వ్యవసాయంపై ఆధారపడితే, భారత్లో అలాంటివారు కోట్ల సంఖ్యలో ఉన్నారు. మన దేశంలో మొత్తం ఉపాధిలో 41 శాతం వ్యవ సాయ రంగంలోనే ఉత్పన్నమవు తుంటే, అమెరికాలో అది కేవలం ఒక్క శాతమే. అమెరికా జీడీపీలో వ్యవ సాయ రంగం వాటా 0.92 శాతం కాగా, మన దగ్గర అది 14.6శాతం. అమెరికాలో సగటు భూకమత విస్తీర్ణం 180 హెక్టారైతే, మన దేశంలోనేమో అది కేవలం 1.08 హెక్టార్లే, కాబట్టి, అమెరికాతో ఒప్పందం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించక తప్పదు. ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలు సైతం భారత్కు నష్టం కలిగించేవిగానే ఉంటున్నాయి. 1995 నుంచి అమల్లోకి వచ్చిన వ్యవసాయ ఒప్పందమే దీనికి ఉదాహరణ ఇది ఒక్కో దేశం రైతులకిచ్చే మొత్తం సబ్సిడినే చూస్తోంది తప్పితే, ఎంత మంది సాగుదారులు ఉన్నారనేది పరిగణనలోకి తీసుకోవడం లేదు. అమెరికాలో రైతులు చాలా తక్కువమంది కాబట్టి, వారికి అత్యధిక సబ్సిడీ లభిస్తోంది. భారత్లో అన్నదాతలు తక్కువ రాయితీతో సరి పెట్టుకోవాల్సి వస్తోంది. సాధారణంగా ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే వ్యవసాయ సర కులపై భారత్ 38శాతం సుంకం విధిస్తోంది. కొన్నింటిపై 65శాతం సుంకం వసూలు చేస్తోంది. ఇదంతా మన రైతుల ఆదాయాలనూ ప్రయోజనాలనూ కాపాడటానికే అధిక సబ్సిడీ మీద ఉత్పత్తి అవుతున్న అమెరికా పంటలను... ముఖ్యంగా గోధుమ, మొక్కజొన్న వంటి ఆహార 'ధాన్యాలను భారత్లోకి అనుమతిస్తే మన ఆహార పంటలకు ముప్పు వాటిల్లుతుంది. ప్రపంచ మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు అగ్ర రాజ్యం మన దేశంలోకి తన వ్యవసాయ సరకులను చాలా తక్కువ ధరకే పెద్దయెత్తున గుమ్మరించవచ్చు ఇలాంటి డంపింగ్ వల్ల మనం నష్టపోతాం.

### మారిన ఆహారపు అలవాట్లు!

మారుతున్న కాలాన్ని బట్టి మనదేశంలో ప్రజలు ఆహార అలవాటుల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. రోజువారి తలసరి ప్రోటీన్ అవసరాలను తీర్చడంలో తృణధాన్యాల వాటా బాగా తగ్గిపోయింది. మరోవైపు అదే సమయంలో పప్పు ధాన్యాల వినియోగం పల్లెల్లో స్వల్పంగా పెరిగింది. పట్టణాల్లో ఒక శాతం మేర పడిపోయింది, గుడ్డు చేపలు మాంసం వినియోగం రెండు చోట్ల పెరిగింది. 2009-10,2023- 24 మధ్య దేశీయంగా ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు (శాతాల్లో)

**గ్రామీణ ప్రాంతాలలో: పట్టణ ప్రాంతాలలో:**

2009 -10, 2023- 24.

1. తృణధాన్యాలు 60.2 45.9, పట్టణ ప్రాంతాల్లో 51.3, 38.7
2. పప్పు ధాన్యాలు 8.3, 8.7, 10.1, 9.1.
3. పాలు పాలు ఉత్పత్తులు 9.4, 11.0, 12.5, 12.9
4. గుడ్లు చేపలు మాంసం 5.9, 12.4, 7.6 11.1
5. ఇతర ఆహార పదార్థాలు 16.3, 22.0, 18.5, 25.3.

(న్యూట్రిన్ ఇంటెక్ ఇన్ ఇండియా నివేదిక).

రైతులు భారీగా నష్టపోయి, మళ్లీ పంటలు వేయడానికి వెన తారు. ఫలితంగా దేశ ఆహార భద్రత దెబ్బతింటుంది. ఇండియా శీతలీకరించిన రొయ్యలు, బాస్మతి బియ్యం, మసాలా ద్రవ్యాలతో ప్రాసెస్ చేసిన ఆహార పంటలు, విలువ జోడించిన ఆహారోత్ప అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి ప్రధానంగా పిస్తా, అక్రోట్ పప్పులు దిగుమతి అవుతున్నాయి.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి. మరోమారు చర్చల నిమిత్తం మన ప్రతినిధి బృందం త్వరలోనే వాషింగ్టన్ వెళ్లనుంది.

తాము ఎగుమతిచేసే వ్యవసాయ సరకులు, పాడి ఉత్పత్తులపై సుంకాలను భారీగా తగ్గించాలని ట్రంప్ సర్కారు పట్టుపట్టడంతో ఈ ఒప్పందం ఆలస్యమవుతూ వచ్చింది. అయితే, ఆగస్టు ఒకటి నుంచి ట్రంప్ ప్రతిపాదిత 'ప్రతీకార సుంకాలు' అమల్లోకి రానున్న క్రమంలో ఒప్పందం విషయంలో ఉత్కంఠ నెలకొంది.రెండు దేశాల్లో వ్యవసాయ డుల మధ్య తీవ్ర వ్యత్యాసం ఉం దని నీతిఆయోగ్ మార్చిలో వెలు చిన పరిశోధనా పత్రం వెల్లడించి భారత్లో సోయా సగటు హెక్టారుకు ఒక టన్ను కాగా.. 'కాలో అది 1.4 టన్నులు. భాద మొక్కజొన్న దిగుబడి హెక్టా 3. 5టన్నులైతే అమెరికాలో టన్నులు, మన దేశంలో వ్యవస్థ ఉత్పాదకత ఎన్నో రెట్లు పెద ఉందని వ్యాఖ్యానించిన నీతి ఆయో తరువాత ఆ పత్రాన్ని ఉపసందా చింది. ఈ చర్యను కాంగ్రెస్ విమర్శించింది. సేద్య రంగంలో సంస్కరణలు తీసుకురావా ఇందుకు రాష్ట్రాలను పురిగొలా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంబ, 2020-వ్యవసాయ చట్టాలకు రైతుల ఎదురైన ప్రతిఘటనతో ఆ ప్రభా లకు తెరపడింది.

ప్రపంచంలో వంట నూనె అత్యధికంగా కొంటున్నది భా శమే. అమెరికా దగ్గర అత్యధిక మాణంలో సోయా నూనె నిల్వణ అది జన్యుమార్పిడి పంట తీసింది. భారత్లో పత్తి తప్ప జన్యుమార్పిడి(జీఎం) పంటనూ చేయడం లేదు. అలాంటప్పుడ నూనెను ఎలా దిగుమతి చేసు మనే విమర్శ వినిపిస్తోంది. నీతిఆయోగ్ పత్రం అమెరికా జీఎం మొక్కజొన్న, సోయాబీన్లను సుంకాలు లేకుండా చేసుకోవాలని సూచించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో పాడి, సేద్య రంగాల ప్రయే లను పణంగా పెట్టేది లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతాల స్పష్టం చేశారు. జంతు మాంసం, తదితర ఉత్పత్తులతో తయ సిన దాణాను అమెరికాలో పాడి పశువులకు వేస్తారు. ఇది దేశంలో అన్ని వర్గాలకూ ఆమోదనీయం కాదు. పైగా జన్యుము పంటలతో ఆరోగ్యానికీ, పర్యావరణానికి హాని జరుగుతుందనే ళన ఉంది. అందుకని, మన దేశ ప్రయోజనాలకు అనుగుణమైన లోనే అమెరికాతో వ్యవసాయ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలి. భారతీయ రైతుల ప్రయోజనాలను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇతర దేశాలతో వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అమెరికా భారతదేశానికి ఇప్పటి ముప్పుడిగా వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతే భారతీయ వ్యవసాయ రైతుకు ఉరితాడే మిగులుతుంది. ట్రంపు సుంకాల బాదుడు తప్పించుకోవడం కొంచెం కష్టమైన పని అలాగని అమెరికా వ్యవసాయ సరుకులను ఇక్కడ చౌకగా కుమ్మరించడం వలన మన రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. అమెరికా నుంచి వ్యవసాయ సరుకులు దిగుమతి చేసుకోవడం తప్పనిసరి అయితే సేంద్రియ పంటలను , జీవ వరణానికి హాని చేయని సుస్థిర వ్యవసాయ పద్ధతిలో సాధించిన పంట ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకుంటామని షరతు విధించాలి. కేంద్రీయ పద్ధతిలో పెంచిన పత్తిని మాత్రమే అనుమతించాలి. ఇతర పంటలకు ఇదే విషయాన్ని వర్తింపజేయాలి మన దగ్గర మొక్కజొన్న రైతులు ఏట నష్టాలను బారిన పడుతున్నారు. ఇలాంటి అప్పుడు అమెరికన్ జన్యు మార్పిడి (జీఎంఓ ) మొక్కజొన్న భారీగా భారతీయ మార్కెట్లో ముంచేత్తే ప్రమాదం లేకపోలేదు. అమెరికా నుంచి సేంద్రియ మొక్కజొన్న మాత్రమే దిగుమతి చేసుకుంటామని గట్టిగా పట్టుబట్టాలి. భారతదేశం ప్రస్తుతం వంటనూనెల కొరతను పేర్కొంటుంది అమెరికా దగ్గర భారీగా కనుల సోయా నూనె నిలువలు ఉన్నాయి. అయితే జన్ను మార్పిడి చేయని పంట నువ్వు నెలలు మాత్రమే దిగుమతి చేసుకోవాలి సోయా పశుధానాలను కూడా తనిఖీ చేయాలి. ఏది ఏమైనా సహజ పద్ధతిలో పండించిన పంటలు ఉత్పత్తి చేసిన పాలను మాత్రమే కొనుగోలు చేస్తామని నిక్కచ్చిగా చెప్పడం ద్వారా అమెరికాకు కొంత మేరకైనా అడ్డుకట్ట వేయవచ్చు మన రైతులను దేశ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో ఆచి తూచి అడుగులు వేయాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం



# మంటగలిసిన మానవత్వం

## గాజాలో ఇజ్రాయిల్ యుద్ధ నేరాలు

గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైన్యం దాడులు మానవత్వానికి మచ్చ తెచ్చేలా మారాయి. ఆకలి, దాహం, వైద్య సహాయం లేకుండా పాలస్తీనియన్లను చంపే కుట్రలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధ నేరాలకు బాధ్యులుగా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ యుద్ధం ముగిసే వరకు ఇజ్రాయిల్, అమెరికా ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా బహిష్కరించాలని, ఎగుమతులు నిలిపివేయాలని డిమాండ్‌లు బలపడుతున్నాయి. గాజాలో అమానుష చర్యలు, ప్రపంచ నిరసనలు, మీడియా, మేధావుల అభిప్రాయాలను ఈ వ్యాసం పరిశీలిస్తుంది. ఈ యుద్ధం జాతి నిర్మూలనగా (జెనోసైడ్) గుర్తింపబడుతోంది, తక్షణ పరిష్కారం అవసరం. ఇజ్రాయిల్ వ్యూహాలు పాలస్తీనియన్ల జీవితాలను దుర్భరం చేస్తూ, మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నాయి. ఇజ్రాయిల్ బ్లాకేడ్ వల్ల గాజాలో ఆకలి, దాహం తీవ్రమయ్యాయి. ఐక్యరాజ్యసమితి (యుఎన్) నిపుణులు 2025 జూలై 29న జెనీవాలో ఇజ్రాయిల్ దాహాన్ని ఆయుధంగా ఉపయోగిస్తోందని ఖండించారు, తాగునీరు, ఆహారం, ఔషధాలను అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, 48 గంటల్లో 33 మంది పోషకాహార లోపంతో మరణించారు, వీరిలో 12 మంది పిల్లలు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2025 జూలై 3న ఇజ్రాయిల్ ఆకలిని జెనోసైడ్ ఆయుధంగా ఉపయోగిస్తోందని నివేదిక విడుదల చేసింది. యుఎన్ ప్రకారం, ఆహారం కోసం ప్రయత్నిస్తూ 875 మంది మరణించారు. ఇజ్రాయిల్ సైన్యం సహాయ కేంద్రాల వద్ద నిలిచిన వారిపై కాల్పులు జరిపింది. ఆసుపత్రులు, జర్నలిస్టులపై దాడులు కొనసాగుతున్నాయి. 2025 మే 21న యుఎన్ చైల్డ్ రైట్స్ కమిటీ పిల్లల ఆకలి సంక్షోభాన్ని ఖండించింది. వాషింగ్టన్ పోస్ట్ 2025 ఆగస్టు 7న ఇజ్రాయిల్ మీడియా గాజా ఆకలి సంక్షోభాన్ని కవర్ చేసిందని, సీఎన్ఎన్ 2025 జూలై 27న అంతర్జాతీయ ఖండనలు పెరుగుతున్నాయని నివేదించాయి. అల్ జజీరా 2025 ఆగస్టు 23న 70 మరణాలు, ఆకలి హెచ్చరికలను పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 జూలై 23న గాజాలో కృత్రిమ ఆకలి సంక్షోభమని తెలిపింది. అమ్నెస్టీ 2025 మే 2న బ్లాకేడ్‌లో జెనోసైడ్ ఉద్దేశం ఉందని, అల్ జజీరా 2025 ఆగస్టు 22న ఆకలి సంక్షోభాన్ని ధృవీకరించాయి. ఈ చర్యలు మానవ హక్కులను అతిక్రమిస్తున్నాయి. ప్రపంచ దేశాల నిశ్శబ్దం ఆశ్చర్యకరం. నెతన్యాహు, ట్రంప్ ఈ చర్యలకు మద్దతిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. 2025లో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా సైనిక, ఆర్థిక సహాయం పెరిగింది, యుద్ధాన్ని ప్రోత్సహిస్తోందని విమర్శలు ఉన్నాయి. ఈ సమస్యలు పాలస్తీనియన్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయి. ఇజ్రాయిల్ చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా నిరసనలు తీవ్రమయ్యాయి. ఇజ్రాయిల్‌లో 2025 ఆగస్టు 17న జాతీయ నిరసనలు జరిగాయి, యుద్ధం ఆపాలని, బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే రోజు స్ట్రైక్‌లు, దేశాన్ని షట్‌డౌన్ చేసే ప్రయత్నాలు జరిగాయి. 2025 ఆగస్టు 26న బందీల కుటుంబాలు నాసర్ ఆసుపత్రి దాడిని ఖండించాయి. 2025 ఆగస్టు 27న టెల్ అవీవ్‌లో వేలాది మంది బందీల విడుదల కోసం నిరసన చేశారు. అమెరికాలో 2025 ఆగస్టు 24న దురాంగో, మాంటెరీ, లాంగ్ బీచ్‌లో నిరసనలు జరిగాయి. 2024 ఏప్రిల్ 17 నుంచి యూనివర్సిటీలలో ప్రో-పాలస్తీన్ నిరసనలు మొదలై, 2025లో కొనసాగాయి. యూరప్‌లో 2024 నవంబర్ 7న జర్మనీలో, 2024 జూన్ 22న బెర్లిన్‌లో పోలీసు దాడుల మధ్య నిరసనలు జరిగాయి. 2025 ఏప్రిల్ 13న సెనెగల్‌లోని డాకర్‌లో, 2024 అక్టోబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గాజా, లెబనాన్‌లో సీజ్‌ఫైర్ కోసం నిరసనలు జరిగాయి. 2024 అక్టోబర్ 3న సిడ్నీలో, 2025 మార్చి 19న టొరంటోలో, 2024 ఫిబ్రవరి 24న ఇజ్రాయిల్‌లో హింసాత్మక పోలీసు ప్రతిస్పందనల మధ్య నిరసనలు జరిగాయి. 2024 మే 1న యుఎస్ క్యాంపస్‌ల నుంచి గ్లోబల్ నిరసనలు వ్యాపించాయి. 2024 ఏప్రిల్ 28న పాలస్తీన్ జర్నలిస్ట్ బిసాన్ ఓవ్దా యుఎస్ నిరసనలను ప్రశంసించారు. 2024 ఏప్రిల్ 25న హార్వర్డ్‌లో గాజా సాలిడారిటీ ఎన్‌క్యాంప్‌మెంట్ ప్రారంభమైంది. 2024 మార్చి 16న యూదు సోషలిస్టులు పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించారు. యువత, విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా ఈ నిరసనలను వ్యాప్తి చేస్తున్నారు. ప్రపంచ మీడియా ఇజ్రాయిల్ చర్యలను విమర్శిస్తోంది. సీఎస్ఐఎస్ నిపుణులు 2025 జూలై 28న గాజా ఆకలి సంక్షోభంపై, ఎన్ఆర్సీ 2025 ఆగస్టు 13న సహాయ సంస్థల బహిష్కరణ హెచ్చరికలపై స్పందించారు. 31 మంది ఇజ్రాయిల్ ప్రముఖులు 2025 జూలై 29న సాంక్షన్స్ డిమాండ్ చేశారు. జెనోసైడ్ స్కాలర్ 2025 జూలై 16న, ఇజ్రాయిల్ హిస్టారియన్ 2025 జూలై 23న ఈ చర్యలను జెనోసైడ్‌గా ధృవీకరించారు. అల్ జజీరా 2024 ఫిబ్రవరి 3న జెనోసైడ్ అధ్యయనాల్లో విభేదాలను చర్చించింది. సైన్స్ డైరెక్ట్ 2025 జూలై 2న మీడియా కవరేజ్‌లో సమతుల్యత లోపాన్ని, ఓమర్ బార్టోవ్ 2024 ఆగస్టు 13న గాజా యుద్ధంపై ఆందోళనను వ్యక్తం చేశారు. ఆనడోలు 2025లో 193 అకాడమిక్స్ మరణాలను, బ్రూకింగ్స్ 2024 జూన్ 20న గాజా భవిష్యత్తుపై నిరాశను, న్యూ లైన్స్ మ్యాగజైన్ 2025 జూలై 21న జెనోసైడ్ నిరాకరణ క్షీణతను నివేదించాయి. ఈ చర్యలు జెనోసైడ్‌గా గుర్తించబడుతున్నాయి, ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా పాలస్తీనియన్ల జీవితాలను నాశనం చేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. నెతన్యాహు నాయకత్వంలో బ్లాకేడ్, బాంబింగ్‌లు పిల్లలు, గర్భవతులపై ప్రభావం చూపుతున్నాయి. ట్రంప్ మద్దతు ఈ నేరాలను ప్రోత్సహిస్తోందని విమర్శలు ఉన్నాయి. ప్రపంచ దేశాలు బహిష్కరణలు, సాంక్షన్స్ విధించాలి. ఈ సంక్షోభం మానవ సమాజానికి సవాలు విసురుతోంది. న్యాయం, శాంతి కోసం సమిష్టి చర్యలు అవసరం. గాజాలో అమానుషత్వం ప్రపంచ మనస్సాక్షిని కదిలిస్తోంది. తక్షణ సీజ్‌ఫైర్, సహాయం అందించాలి. మానవ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్, 9849328496.**

### సంవిధాన ధర్మానికి అండగా నిలిచిన న్యాయమూర్తి

# ఉపరాష్ట్రపతి పదవికి దీటైన అభ్యర్థి



2011లో భారత సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం, ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్ర ప్రోత్సాహిత "సల్వా జుడుం" మిలీషియాను అసంవిధానికమని ప్రకటించింది. మావోయిస్టులపై పోరాటంలో నిరుపేద ఆదివాసీలను ఆయుధధారులుగా మార్చి, "స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు"గా నియమించడం మానవ హక్కుల ఉల్లంఘన అని స్పష్టం చేసింది. రాజ్యాంగ ఆర్టికల్ 14 (సమానత్వం), 21 (జీవనాధికారం)లను ఉల్లంఘించే ఈ చర్య, దళిత, ఆదివాసీ వర్గాల పట్ల న్యాయాన్ని కాపాడే లక్ష్యంతో జరిగిన తీర్పు. ప్రభుత్వం నుండి సమీక్ష పిటిషన్ దాఖలైనా, అది కొట్టివేయబడింది. ప్రజాస్వామ్యంలో శాంతి, భద్రతల బాధ్యత ప్రభుత్వానిదేనని, సాయుధ గుంపులకు అధికారాలు అప్పగించడం అనైతికమని ఈ తీర్పు నొక్కిచెప్పింది.

2025 ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున జస్టిస్ రెడ్డి అభ్యర్థిగా నిలవడంతో ఈ తీర్పు మరోసారి చర్చనీయాంశమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఈ తీర్పు "మావోయిస్టులకు బలం చేకూర్చింది" అని వ్యాఖ్యానించడం తీవ్ర వివాదానికి దారితీసింది. బీజేపీ నాయకుడు రవిశంకర్ ప్రసాద్, ఈ తీర్పు వెనుక 'వామపక్ష జెండా' ఉందని విమర్శించారు. అయితే, 18 మంది ప్రముఖ రిటైర్డ్ న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలను "న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని హీనపరిచే చర్య"గా ఖండించారు. మరో 56 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ తీర్పులను రాజకీయంగా వాడుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ వైవిధ్యమైన స్పందనలు న్యాయవ్యవస్థలో రాజకీయ ప్రభావాన్ని సూచిస్తున్నాయి.

సల్వా జుడుం 2005లో మావోయిస్టు వ్యతిరేక ఉద్యమంగా ప్రారంభమై, మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమైంది. గ్రామాల ధ్వంసం, మహిళలపై అత్యాచారాలు, బలవంతపు వలసలు, బాలల నియామకం వంటి అకృత్యాలు బయటపడ్డాయి. 2011 తీర్పు ఈ చర్యలను తీవ్రంగా తప్పుబట్టింది. బస్తర్ ఆదివాసీలలో ఈ తీర్పుపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. కొందరు దీన్ని హక్కుల పరిరక్షణగా భావిస్తే, ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి దీన్ని "భూస్థాయి వాస్తవాలకు దూరమైన నిర్ణయం"గా వర్ణించారు.జస్టిస్ రెడ్డి విశిష్ట న్యాయవాదిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించి, తీర్పుల ద్వారా రాజ్యాంగ విలువలను కాపాడారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆయన నామినేషన్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ సహా విపక్ష ఎంపీలు స్వాగతించారు. ఆయన తనను "రాజకీయ నాయకుడు కాదు, రాజ్యాంగ విలువల పరిరక్షకుడు"గా వ్యక్తీకరించారు, సర్వేపల్లి రాధాకృష్ణన్, కే.ఆర్. నారాయణన్‌లను ఆదర్శంగా భావిస్తున్నారు.


జస్టిస్ రెడ్డిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోవడానికి కారణాలు స్పష్టం. ఆయన రాజ్యాంగ నైతికతకు కట్టుబడి, ఆయుధ బలగాల ద్వారా మానవ హక్కుల ఉల్లంఘనలను వ్యతిరేకించారు. రాజకీయ విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, న్యాయవ్యవస్థ నుండి వచ్చిన మద్దతు ఆయన తీర్పుల విలువను నిరూపిస్తుంది. రాజకీయ అరాచకం కాకుండా, రాజ్యాంగ పటిష్టతకు అండగా నిలబడగల సామర్థ్యం ఆయన సొంతం. ఆయన అనుభవం, స్వచ్ఛత, పారదర్శకత ఉపరాష్ట్రపతి పదవిని నిర్వర్తించడానికి అనువైన నాయకత్వాన్ని సూచిస్తాయి. జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి తీర్పులు వ్యక్తిగత అభిప్రాయాలు కాదు, రాజ్యాంగ విలువల సంరక్షణకు నిదర్శనం. ఒక్క తీర్పుతో మానవ హక్కుల పరిరక్షణకు మార్గం వేసిన ఆయనను ఉపరాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా భారత ప్రజాస్వామ్యం తన నిబద్ధతను చాటగలదు. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి.



**సయ్యద్ రఫీ,**
చిత్ర దర్శకుడు, ఈసీ మెంబెర్,
ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నన్స్

# న్యాయవ్యవస్థపై రాజకీయ దాడి

- జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి తీర్పును తప్పుపట్టిన హోం మంత్రి అమిత్ షా:
- అమిత్ షా వ్యాఖ్యలు.. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి సవాల్



భారతదేశంలో రాజకీయాలు, న్యాయవ్యవస్థ మధ్య సంఘర్షణలు కొత్తవి కావు. కానీ, ఇటీవలి ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఒక కొత్త దుమారాన్ని రేపాయి. విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పై అమిత్ షా చేసిన ఆరోపణలు,"సల్వా జుడుం "తీర్పును 'నక్సలిజం మద్దతుదారు'గా ముద్రవేసి,న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్యాన్ని ప్రశ్నార్థకం చేశాయి. ఈ వివాదం ప్రధాన మీడియాలో, సోషల్ మీడియాలో విస్తృత చర్చను రేపింది.ఈ విషయంపై వ్యాసాలు, వార్తలు, వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. ఇది కేవలం రాజకీయ దాడి మాత్రమే కాకుండా, భారతీయ రాజ్యాంగ విలువలపై దాడిగా పరిగణించాలి.

### "సల్వా జుడుం" అంటే ఏమిటి?

2005లో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల తిరుగుబాటును అణచివేసేందుకు ప్రారంభమైన ఒక సాయుధ సమూహం. గోండీ భాషలో 'శాంతి మార్చ్' అని దీనికి అర్థం. ఇది మొదట్లో ప్రజల స్వచ్ఛంద ఉద్యమంగా ప్రారంభమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్‌పీఓలు)గా మారింది. గిరిజన యువతకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ఆయుధాలు ఇచ్చి, నక్సలైట్లపై పోరాడేలా చేశారు. దీని ఉద్దేశం నక్సల్ ఉద్యమాన్ని బలహీనపరచడం. కానీ వాస్తవంలో "సల్వా జుడుం" దళం పోలీసులు అండతో విచ్చలవిడిగా చెలరేగి పోయారు. సాటి గిరిజనులపై భారీ అక్రమాలకు తెగబడ్డారు. గిరిజన గ్రామాలను తగలబెట్టారు, గిరిజన మహిళలపై అసంఖ్యాక మానభంగాలు చేశారు. బలవంతపు వసూళ్ళు, వలసలు, హత్యలు, వంటి భయంకరమైన అత్యాచారాలు జరిగాయి. ఈ నేపథ్యంలో నందిని, సుందర్ వంటి కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ అక్రమాలు అన్నీ విచారణలో బయటపడ్డాయి. సల్వా జుడుం దళం , పోలీసుల మధ్య గిరిజనులు నలిగిపోయారు. ఈ దళం పోలీసులకు ప్రతిరూపంగా గిరిజనులను రక్షించడం కాదు. వారిని రెండు శక్తుల మధ్య బలిపశువులుగా మార్చింది.

### అసలు ఈ "సల్వాజుడుం " వ్యవస్థ ఎందుకు వచ్చింది?

నక్సల్ ఉద్యమం గిరిజన ప్రాంతాల్లో బలంగా ఉంది. పేదరికం, నిరుద్యోగం, భూసంస్కరణలు లేకపోవడం, వనరుల దోపిడీ వంటి కారణాలతో మావోయిస్టులు బలపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు, సైనిక బలంతో అణచివేయాలని చూసింది, కానీ వైఫల్యం చెందింది. దానికి ప్రధాన కారణం గిరిజన ప్రజల్లో మావోయిస్టులకు బలం, సహకారం ఉండటమే. దానితో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను అణచివేయలేక స్థానికులను గిరిజన యువకులకు పోలీసు ఆఫీసర్లుగా ఉపయోగించి ప్రయివేటు దళాలుగా "సల్వాజుడుం"ను సృష్టించింది. వారికి తుపాకులు ఇచ్చింది. వారు అక్రమాలకు పాల్పడ్డారు. వారికి సరైన శిక్షణ లేకపోవడంతో మావోయిస్టుల చేతిలో సాటి గిరిజన యువకులు (సల్వా జుడుం దళం) మరణించారు. రెండు వైపులా మరణించింది గిరిజన ప్రజలే.

రాష్ట్ర ప్రభుత్వం తన శాంతి భద్రతల బాధ్యతలను ప్రైవేట్ సమూహాలకు అప్పగించినట్టు అయింది. కానీ, ఇది మరిన్ని హింసాత్మక చర్యలకు దారితీసింది. మావోయిస్టులు కూడా అనేక అక్రమాలు చేశారు. కానీ, "సల్వా జుడుం" రాష్ట్ర మద్దతుతో జరిగినది కావడం వల్ల మరింత వివాదాస్పదమైంది.

2011లో సుప్రీంకోర్టు తీర్పు ఈ వ్యవస్థను పూర్తిగా నిషేధించింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్.ఎస్. నిజ్జార్ బెంచ్, నందిని సుందర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఛత్తీస్‌గఢ్ కేసులో రాజ్యాంగ ఆర్టికల్ 14 (సమానత్వం), 21 (జీవనాధికారం) ఉల్లంఘనగా పేర్కొంది. రాష్ట్రం తన బాధ్యతలను అపరిచితులకు అప్పగించకూడదని, ఎస్‌పీఓలను నిషేధించాలని, అక్రమాలపై విచారణ జరపాలని ఆదేశించింది. ఇది మానవ హక్కుల రక్షణకు మైలురాయి. ఈ తీర్పులో న్యాయ మూర్తులు ఎక్కడా నక్సలిజానికి మద్దతు ఇవ్వలేదు. బదులుగా రాష్ట్ర హింసను ఆపాలని మాత్రమే చెప్పింది.

ఇప్పుడు, 2025 ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అభ్యర్థిగా నిలిచిన సందర్భంగా, కేంద్ర ప్రభుత్వ హోం శాఖా మంత్రిగా ఉంటూ అమిత్ షా ఆ తీర్పును చదవకుండానే , అసలు విషయం తెలుసు కోకుండానే బాధ్యతారహితంగా 'నక్సలిజానికి మద్దత్తు'గా ముద్రవేశారు. 'సల్వా జుడుం తీర్పు లేకపోతే నక్సలిజం 2020కే అంతమయ్యేది' అని పార్లమెంట్‌లో అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇది పూర్తిగా విద్వేష పూరిత రాజకీయ దాడిగా మారింది. మాజీ న్యాయమూర్తులు 18 మంది ఈ వ్యాఖ్యలను 'అనుచితం, కోర్టు ధిక్కారం'గా నిరసించారు. ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని, జడ్జిలపై 'చిల్లింగ్ ఎఫెక్ట్' కలిగిస్తుందని వారు హెచ్చరించారు. మరోకవైపు, 56 మంది మాజీ హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిలు ఈ నిరసనను 'రాజకీయ పక్షపాతం'గా విమర్శించారు, రెడ్డి అభ్యర్థిత్వం రాజకీయ స్క్రూటినీకి లోనవుతుందని చెప్పారు.

మీడియా ప్రతిస్పందన:

మీడియా వార్తలు, వ్యాసాలు ఈ వివాదాన్ని విస్తృతంగా చర్చించాయి. ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి పత్రికలు షా వ్యాఖ్యలను న్యాయవ్యవస్థపై దాడిగా చూపాయి, తీర్పు వాస్తవాలను వివరించాయి. వైర్, ఎన్‌డీటీవీలు రిటైర్డ్ జడ్జిల నిరసనలను హైలైట్ చేశాయి. షా మాటలు రాజకీయ ప్రయోజనాలకు న్యాయాన్ని వక్రీకరిస్తున్నాయని విమర్శించాయి. మరోవైపు, బీజేపీ మద్దతు మీడియా (గోదీ మీడియా ) జెస్టిస్.బీ.సుదర్శన్ రెడ్డి తీర్పు నక్సల్ పోరాటాన్ని బలపరిచిందని వాదించింది. ఎక్స్ (ట్విట్టర్)లో వ్యాఖ్యలు రెండు విధాలుగా విభజించబడ్డాయి. కొందరు... అమిత్ షాకు మద్దతిస్తే, మరికొందరు జడ్జిల స్వాతంత్ర్యాన్ని కాపాడాలని కోరుతున్నారు. ఈ వివాదం విమర్శనాత్మకంగా చూస్తే, హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాలకు న్యాయ మూర్తి తీర్పులను వక్రీకరించిన విధానాన్ని ఒక ప్రమాద సంకేతంగా చూడొచ్చు. నిజానికి జస్టిస్.బి. సుదర్శన్ రెడ్డి తీర్పు నక్సలిజానికి మద్దతును ఇవ్వలేదు. బదులుగా రాష్ట్ర హింసను ఆపింది. నక్సలిజం అంతమవడానికి సల్వా జుడుం అవసరమా? ఇది ప్రశ్నార్థకం. మోదీ ప్రభుత్వం నక్సలిజాన్ని అంతమొందించినట్టు చెప్పుకుంటుంది, కానీ 2011 తీర్పు దాన్ని ఆలస్యం చేసిందని ఆరోపించడం అసంబద్ధం. మాజీ జడ్జిల మధ్య విభేదాలు న్యాయవ్యవస్థలో రాజకీయాకరణను సూచిస్తాయి. ఇది జడ్జిల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుంది, భవిష్యత్ తీర్పులపై ఒత్తిడి తెస్తుంది. ఈ ఘటన భారత రాజకీయాల్లో న్యాయవ్యవస్థను రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం ప్రమాదకరమని రుజువు చేస్తుంది. గిరిజన హక్కులు, మానవ హక్కులు రక్షించడం రాజ్యాంగ బాధ్యత. రాజకీయ లాభాలకు వీటిని త్యాగం చేయడం లోపభూయిష్టం. మీడియా ఈ వివాదాన్ని సమతులంగా చర్చించాలి, న్యాయ స్వాతంత్ర్యాన్ని కాపాడాలి. ఇది భారత ప్రజాస్వామ్యానికి పరీక్షా సమయం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి

**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని సహాయక చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అధికారులతో జిల్లాలో భారీ వర్షాలు వరదలపై సమీక్షించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో జరిగిన నష్టాలపై ఫోటో లను తిలకించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆకస్మికంగా సంభవించేవే ప్రకృతి విపత్తులు అని అటువంటి విపత్తుల సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి నష్టం, పంట నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం ఆస్తి నష్టం ప్రాణనష్టాన్ని అంచనాలకు అనుగుణంగా



నష్టపరిహారానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. జిల్లాలో భారీగా వర్షాలు వరదలు ముంచేత్తుతున్న కారణంగా వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ లో భాగంగా వరద నష్టాలను అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జి లు కట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసినప్పుడు ఫోటో క్యాప్చర్ వీడియో క్యాప్చర్ ద్వారా జిల్లాలో జరిగిన సమగ్ర వివరాలను భద్రపరచాలని సూచించారు. వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాల యూరియా కొరత విషయంలో బఫర్ స్టాక్ డిస్ప్లే చేస్తూ ఉన్నామని రైతులు రాబోవు పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని నానో యూరియా పై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులుతో పాటు పౌరసరఫరాల శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి,పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అదనపు కలెక్టర్ నగేష్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల కోర్సులలో ప్రవేశాలు

- ఈ నెల 30వ తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**తాండూరు, ఆగస్టు 28 (జనంసాక్షి) :** యువతకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల కోర్సులలో ప్రవేశాలు పొందాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ యువతకు పిలుపునిచ్చారు.తాండూర్ ప్రాంత యువతకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుతో గొప్ప అవకాశం లభించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి కోర్సులు ప్రారంభమవుతాయని ఇందులో ఇండ స్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్(సంవత్సరం కోర్సు), మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్ (సంవత్సరం కోర్సు), ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్(సంవత్సరం కోర్సు), ఉన్నాయని అదేవిధంగా బీడీవీవీ-పర్చువల్ ఎనాలసిస్, డిజైనర్(రెండేళ్ల కోర్సు), సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండేళ్లకోర్సు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (రెండేళ్లకోర్సు)లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఎస్ఎసీసీ మోమో, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర వివరాలను జతపర్చి ఈనెల 30వ తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## వ్యవసాయ సహకార సంఘం సమావేశం ఉన్నట్లా లేనట్లా ..?

- సమావేశం ఉన్నట్లు సమాచారం ఇచ్చి హాజరు కానీ వైనం
- ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధుల తీరుపై డైరెక్టర్ల అసంతృప్తి




**చేర్యాల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** చేర్యాల మండలంతోపాటు చుట్టుపక్కల మండలలైన మద్దూరు,దుల్మిట్ట,కొమురవెల్లి మండలాల్లో రైతులను యూరియా కొరత వేధిస్తోంది. నిర్దేశించిన కోటా మేరకు పంపిణీ జరగకపోవడంతో అన్నదాతలు ఎరువుల దుకాణాలు, ప్రాథమిక సహకార సంఘాల వద్ద పడిగాపులు కాస్తున్నా ఒకటి, రెండు సంచులు మాత్రమే అందిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో యూరియాను తీసుకెళ్తునట్లు సమాచారం. నాయకులు వారు తీసుకుపోవడమే కాకుండా వారి అనుచరులు,బంధువులకు అధిక మొత్తంలో సరఫరా చేస్తున్నారని, సామాన్య రైతులను మాత్రం ఒకరోజు వ్యవసాయ అధికారుల దగ్గర నిలబడి పేర్లు రాసుకోవడం,మరొక రోజు సహకార సంఘం వద్ద డబ్బులు కట్టి చీటీలు తీసుకోవడం, మరొక రోజు విక్రయ కేంద్రాల వద్ద నిలబడి యూరియా తీసుకోవడం అవి కూడా ఒక్క రైతుకు రెండు బస్తాల కంటే ఎక్కువ ఇవ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్, డైరెక్టర్లు,అధికారులు అందరూ కలిపి మీటింగ్ పెట్టి యూరియాను ఒకే స్థలంలో వ్యవసాయ అధికారులు, పంపిణీదారులు ఒకే స్థలంలో ఉంది పంపిణి చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని మీటింగ్ పెట్టి నిర్ణయం తీసుకోవాలని అందరికీ చరవణి ద్వారా సమాచారం ఇచ్చి చైర్మన్ అందుబాటులో లేకపోవడంతో వచ్చిన డైరెక్టర్లు, అధికారులు రైతుల ఇబ్బందులను చూసి ఏం సమాధానం చెప్పాలో తెలియక వెనుతిరి అసహనంతో వెళ్ళిపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చేర్యాల చుట్టుపక్కల మండలాలలో జరుగుతున్న అవకతవకలను గుర్తించాలని రైతులు వేడుకుంటున్నారు.

# నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన మంత్రులు

**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ అధికారులను ఆదేశించారు. గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు. గత రెండు రోజుల నుండి భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం, రెవిన్యూ, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారన్నారు. ఇద్దరూ వ్యక్తులు గల్లంతయ్యారన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జిల్లా కు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్ల లో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. జిల్లాలోని రామాయంపేట లోని కామారెడ్డి రోడ్ లో ఉన్న బీసీ కాలనీ నీటి మునిగిన ఇండ్లను వరద ఉద్రితిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



హనుమంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావుతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నిజాం పేట మల్క చెరువు , కోనాపూర్ , నందిగామ రోడ్డు లో దెబ్బ తిన్న బ్రిడ్జి , సాయి చెరువు అలుగు లను క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవిన్యూ ,పోలీస్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికి సహకరించాలని మంత్రి ప్రజలకు సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న ఇండ్లు , పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జననష్టం జరగకుండా నష్ట నివారణ చర్యలను చేపడుతున్నామన్నారు .దెబ్బతిన్న రోడ్లను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. పంట నష్టం .ఆస్తి నష్టం అంశాలను రెవిన్యూ యత్రాంగం అంచనా లు రూపొందిస్తున్నారన్నారు. గత 50 ఏళ్ల చరిత్రలో ఇంతటి వర్షం కురవలేదన్నారు. రామాయంపేట, కామారెడ్డి, మెదక్‌లలోని కొన్ని మండలాలలో, ప్రాంతాలలో సుమారు 200 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయింద అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని మంత్రి వెల్లడించారు.

# ఎరువుల కోసం సచివాలయాన్ని ముట్టడిస్తాం

- యూరియా కోసం వర్షంలో బారులు తీసిన రైతులు
- ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన బిఆర్ఎస్ నాయకులు
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** రైతులకు సకాలంలో అందెవ్వకపోతే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ హెచ్చరించారు. గురువారంవికారాబాద్ పట్టణంలోని పిఏసిఎస్ కార్యాలయం దగ్గర ఉదయం నుండి వానలో తడుస్తూ బారులు తీరిన రైతులను వికారాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పరామర్శించారు.లైన్లో వేచి ఉన్న రైతులతో మాట్లాడి యూరియా కోసం వారు పడుతున్న ఇబ్బందులు కనుక్కున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి రైతులతో పాటు క్యూ లైన్ లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎరువుల కోసం సరఫరా కేంద్రాల ముందు బారులు తీరాల్సి వస్తుందని అనుకోలేదని కెసిఆర్ ముందే చెప్పిన గ్రహించలేకపోయామని రైతులు ఆయనతో చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన పాపానికి రైతులకు పండుగలు లేవు పైగా కుటుంబాన్ని, పొలం పనులను వదిలేసి ఉదయం నుండి సాయంత్రం వరకు యూరియా కోసం లైన్లో వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది. తిండి తిప్పలు మాని ఎంతో ఇబ్బంది పడుతూ లైన్లో వేచి ఉన్న సరే ఎరువులు దొరుకుతాయని నమ్మకం లేదని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ కేంద్రం నుండి అందాల్సిన వాటా



అందకపోవడం వల్లే యూరియా కొరత వస్తుందని చెప్తున్నారు, మరోవైపు ముఖ్యమంత్రి రాష్ట్రంలో అసలు యూరియా కొరతే లేదని చెప్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో పది సంవత్సరాలలో ఎప్పుడైనా ఈ పరిస్థితి చూసామా అని ప్రశ్నించారు. కృత్రిమ ఎరువుల కొరత అని కాంగ్రెస్ పార్టీ నాయకులె చెప్తున్నారు. ఈ కృత్రిమ కొరత సృష్టిస్తున్నది ఎవరు..? వారిని గుర్తించారా..? లేక ఇప్పటికి గుర్తించలేకపోయారా..?, ఒకవేళ గుర్తిస్తే ఎందుకని వారికి చట్టపరంగా శిక్ష విధించడం లేదని విమర్శించారు. సీఎం. స్పీకర్ సొంత వికారాబాద్ జిల్లా కేంద్రంలో పరిస్థితి ఈ విధంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు.

# పింఛన్లను వెంటనే పెంచి అందించాలి

**తలకొండపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన 6 గ్యారంటీలను తప్పకుండా అమలు పరుస్తామని హామీ ఇచ్చి,విస్మరించడం ప్రజలను మోసగించడమే అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి విమర్శించారు.గురువారం తలకొండపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్ ఆధ్వర్యంలో వృద్ధాప్య,వితంతు,నూతన పింఛన్ పొందడానికి అర్హులైన లబ్ధిదారుల తో కలిసి సుమారు వెయ్యి మందితో భారీ ఎత్తున స్వామి వివేకానంద విగ్రహం నుంచి బస్టాండ్ మీదుగా మండల రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.పింఛన్ పెంపుకై భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమానికి జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అమలు కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని అన్నారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలైనా కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు,పెంచిన పింఛన్లు ఇవ్వడం లేదని విమర్శించారు.తలకొండపల్లి మండలంలో 6.7 సర్వే నంబర్ల లో 35 ఏండ్లుగా లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు ఇచ్చిన ఇల్లు నిర్మించుకోవడానికి ప్లాట్లు చూపించడం లేదని ఆరోపించారు.గతంలో మూడు దఫాలు ఎమ్మెల్యే గెలిచిన జైపాల్ యాదవ్,రెండు దఫాలు ఎమ్మెల్యే గా గెలిచిన కిష్టరెడ్డి, ఒక దఫా ఎమ్మెల్యేగా పనిచేసిన వంశీచంద్ రెడ్డి,ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాల కాలం గడుస్తున్న ప్లాట్ల సమస్య తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వచ్చే




నెల లోపల పింఛన్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే సిఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులతో కలిసి స్థానిక తహసిల్దార్ కే.రమేష్ కు పింఛన్లను వెంటనే పెంచాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తిరుమణి రవి గౌడ్, జిల్లా నాయకులు పాండు ప్రసాద్, బక్కి కుమార్, నిలకంఠ పాండు, హేమరాజు, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, పద్మ అనిల్, గోరటి నరసింహ, ఎండి ఆరిఫ్, దండు శ్రీను, శేఖర్ రెడ్డి, సుదర్శన్, హరికంత్, డి.కుమార్, శ్రీనివాస్ చారి, యదగిరి, రాజు, శ్రీశైలం యాదవ్, వెంకటేష్, బాలకృష్ణ, రాష్ట్ర జిల్లా మండల బూత్ అద్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, వివిధ గ్రామాలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై పట్టింపేది..?

- ఐదు ఎకరాలలో గ్యాస్ గోదాం నిర్మాణం
- ఫైల్‌కు 40 వేలు వసూలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు
- పుట్టగొడుగుల్లా కమర్షియల్ భవన నిర్మాణాలు
- ప్రజావాణిలో ఫిర్యాదు...ఆగని అక్రమ నిర్మాణం
- అడ్డుకట్ట వేయడంలో డీసీపి వైఫల్యం

**మల్కాజిగిరి, ఆగస్టు 28 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అనుమతులు లేకుండా మల్కాజిగిరి సర్కిల్ లో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాల వెల్లువ కొనసాగుతోంది. ముఖ్యంగా ఇంటి నిర్మాణం కొరకు అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనాల నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా, వాటిని అరికట్టాల్సిన బాధ్యత కలిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏసిపి బాల శ్రీనివాస్ ఈ అక్రమాలను అరికట్టడంలో విఫలమయ్యారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, యాప్రాల్, మౌలాలి, వినాయక నగర్, గౌతమ్ నగర్, ఆనంద్ బాగ్ డివిజన్‌లలో అనుమతులకు మించి భవన యజమానులు కేవలం నివాస భవనాలకు అనుమతులు తీసుకొని, వాటిని



పూర్తిగా కమర్షియల్ భవనాలను నిర్మిస్తున్నారని, మౌలాలి డివిజన్ లో అసలు అనుమతులే లేకుండా ఐదు ఎకరాలలో భారీ గ్యాస్ గోదాంకు షెడ్ నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, మౌలిక వసతులపై భారం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ, వీటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.?అక్రమ నిర్మాణాలపై చర్యల కోసం అధికారులు కేవలం మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి ప్రైవేట్ వ్యక్తితో వసూలు చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సెక్షన్ అధికారులు కొన్ని సందర్భాల్లో నోటీసులు జారీ చేసి, ప్రైవేట్ వ్యక్తితో యజమానుల నుంచి మామూళ్లు వసూలు చేసి ఆ తర్వాత అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారు, అలాగే నిర్మాణ అనుమతుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి నుండి ముక్కు పిండి 40వేలు వస్తువులు చేస్తున్నట్లు బాధితులు చెప్పకనే చెబుతున్నారు.దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందని సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో డిప్యూటీ సిటీ ప్లానర్ బాల శ్రీనివాస్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు, ఏసీబీ అధికారులు దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### డిప్యూటీ సిటీ ప్లానర్ వివరణ కోసం ప్రయత్నం..

ఈ ఆరోపణల గురించి మల్కాజిగిరి డిప్యూటీ సిటీ ప్లానర్ బాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఆయన అందుబాటులో లేరు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి, సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, అనుమతులు జారీచేసిన ఫైళ్లను విచారణ జరిపి ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## యూరియా దుర్వినియోగం కాకుండా చర్యలు

- యూరియా బ్లాక్ మార్కెట్లో విక్రయంపై నిఘా
- నా నో యూరియాపై రైతులకు అవగాహన
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రత్తిక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లాలో యూరియా లభ్యత, నానో యూరియా వాడకం, చెక్ పోస్ట్ ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూరియా బ్లాక్ మార్కెట్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలని, యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలన్నారు. రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు 20124 మెట్రిక్ టన్నుల యురియా సరఫరా చేయడం జరిగిందని, వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 640 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల సొసైటీల్లో 184 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అదేవిధంగా ప్రైవేటు డీలర్ల వద్ద 596 బట్టి టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. మార్క్ ఫెడ్ సొసైటీ లకు 100 మెట్రిక్ కన్నుల యూరియాను తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కుమార్, ఏడిలు సౌభాగ్య లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
29 ఆగస్టు 2025

# ముఖ్యమంత్రికి మూసీపై ఉన్న చిత్తశుద్ధి వరద ప్రాంతాలపై లేదు

- **మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు**



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** జిల్లాలో మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఏర్పడిన వరద ప్రభావిత ప్రాంతాలు అయిన హావేళిఘణపురం మండలంలో బూర్గుపల్లి, వాడి, రాజపేట్ గ్రామాల్లో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి లు గురువారం పర్యటించారు. వరదలో ఆటోలో కొట్టుకపోయి ఇద్దరు మరణించడం బాధాకరం అని ఆయన అన్నారు. గంటల పాటు ఎదురుచూసినా సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇద్దరు గల్లంతు అయి ప్రాణాలు కోల్పోయారని అన్నారు.వరదలో కొట్టుకపోయి చనిపోయిన సత్యనారాయణ మృతుదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని తెలిపి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వరద నివారణ చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫ్లమై పోయింది. వరద నివారణ చర్యలు చేపట్టాక ఇద్దరు యువకులు మరణించడం దురదృష్టకరం. రాజుపేట గ్రామానికి చెందిన సత్యనారాయణ, యాదగౌడ్ ఇద్దరి ఆటోలు మెదక్లో ఉన్న వాళ్ల పిల్లలను తీసుకురావడం తీసుకురావడానికి బయలుదేరారు. మార్గమధ్యలో వరద ఉధృతి ఎక్కువగా కావడంతో వరదలో ఆటో కొట్టుకపోయి ఒక కరెంటు స్తంభానికి ఇద్దరు పట్టుకున్నారు.ఆ కరెంట్ స్తంభం పైనే మూడు నాలుగు గంటల నుండి జిల్లా యంత్రానంగానికి సమాచారం ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. వరద ఉధృతి ఎక్కువ కావడంతో కరెంటు స్తంభం కొట్టుకపోవటంతో వీళ్ళిద్దరూ చనిపోయారు. ఇలాంటి సమయంలో హెలికాప్టర్ ద్వారా గాని ఎస్ డి ఆర్ ఫ్ బృందాల ద్వారా గాని వాళ్ళ ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేయలేకపోవుకోవడంతో వాళ్ళు ప్రాణాలు కోల్పోయారు.నిన్న గవర్నమెంట్ చర్యలు భాగంగా హెలికాప్టర్ తెప్పిస్తే ఇద్దరి ప్రాణాలు కాపాడి అవకాశం ఉండేది. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అని అన్నారు. నిజాంసాగర్ కు వచ్చిన వరద ఉధృతిని గేట్ల ద్వారా ఎత్తి దిగువకు వదిలేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. ఈ బ్యాక్ వాటర్ వలన ఈ గ్రామాలలో పంట నష్టం తీవ్రంగా జరిగింది. వాడి గ్రామం నుండి రాజపేట వరకు మార్గమధ్యలో రోడ్డు ధ్వంసం అయ్యింది,కరెంటు స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రివ్యూ పెట్టి పరిస్థితిని కనుక్కోవాల్సింది పోయి మూసినది సుందరకరణ రివ్యూ పెట్టడం పై మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందన్నారు. రెండు రోజులుగా హవెలి ఘనపూర్ మండలంలో ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా, త్రాగునీటి వసతి కూడా లేదు. ఇలాంటి గ్రామాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని ప్రజలకు తాగడానికి త్రాగునీటిని తినడానికి భోజనం వసతులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి పరిస్థితులలో ఒక హెలికాప్టర్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రులకు బీహార్ ఇతర రాష్ట్రాలు తిరగడానికి హెలికాప్టర్ వస్తుంది కానీ ప్రజల ప్రాణాలు కాపాడడానికి హెలికాప్టర్ రాకపోవడం దురదృష్టకరమన్నారు.ఈ వరదల్లో నష్టం జరిగిన ప్రతి రైతుకు ఎకరాకు 25000 ఆర్థిక సాయం అందించాలని, వరదలో ఇద్దరు చనిపోయిన సత్యనారాయణ, యాదవ్ గౌడ్ కుటుంబానికి చెరో 25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా దూప్సి సింగ్ తండా ప్రజలు రెండు రోజుల్లో వాటర్ లోనే ఉన్నారని త్రాగడానికి త్రాగు నీటిని తినడానికి భోజన సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం ద్వారా దొరకని యాదవ్ గౌడ్ శవాన్ని వెతికి వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోరారు. వీరితోపాటు మాజీ సర్పంచ్ చెన్నా గౌడ్,యామి రెడ్డి ,సాయ గౌడ్ , నాయకులు బిక్షపతి రెడ్డి ,హన్మంత్ రెడ్డి ,సిద్దిరాంరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి , సాప సాయిలు , శ్రీనివాస్ ,మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ. నరేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిజేను సీజ్ చేసిన పేట పోలీసులు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** మతపరమైన ఉత్సవాలలో నారాయణపేట జిల్లా పరిధిలో డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఉత్తర్వుల మేరకు నారాయణపేట పటణంలో పాత బస్టాండ్ వద్ద బుధవారం పోలీసులు డీజే ను సీజ్ చేశారు. డి జే యజమాని బైరం కొండ ఈశ్వర్ డ్రైవర్ నరసింహులు ఎ పి 28 వి 4212 డీసీఎం వాహనంలో డీజే పెట్టడం జరిగింది. గతం వారం 15 రోజుల నుండి డీజేలకు అనుమతి లేదని పలు సమావేశాల్లో ఎస్పీ తెలిపి, డీజె లకు అనుమతి లేదని ఆర్డిఓ జారీ చేసిన ఆర్డర్ కాపీ ఉత్సవ కమిటీలకు ఇచ్చినా నారాయణపేటలో డీజే పెట్టడం వల్ల పోలీసులు డిజెను సీజ్ చేసి డ్రైవర్ ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా నారా యణపేట జిల్లా పరిధిలో డీజేలకు అనుమతి లేదని ఎవరైనా డి జే లు పెడితే సిజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా పరి ధిలో డీజే లను పట్టుకోవ డానికి ప్రత్యేక స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిం దని, అందువలన ప్రజలు సంప్రదాయ బాండ్, డప్పులు వాయిద్యాలు, చిన్న సౌండ్ బాక్సులను ఉపయోగిం చాలని ఎస్పీ తెలిపారు.

## వరద నష్టాన్ని అంచనా మేరకు చర్యలు తీసుకుంటాం



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హవేలీ ఘన్పూర్ మండలం లింసాన్పల్లి తండా వల్లే దారి, తిమ్మాయపల్లి వెళ్లే మార్గంలోని బ్రిడ్జ్ తిమ్మాయపల్లి వెళ్లే మార్గంలోని బ్రిడ్జ్ను బూరుగుపల్లి రోడ్డును మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలు వరదలు జిల్లాను అతలా కుతలం చేశాయని భారీ నష్టం ఏర్పడిందన్నారు వరద నష్టాన్ని అంచనాయవేసి తద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం**



**చిలప్చెడ్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందం అన్నారు. గురువారం నాడు తాహాసిల్దార్ కార్యాలయంలో పత్రిక సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, పాక్షికంగా ఇండ్లు కుర్చి కూలినట్లయితే వెంటనే పంచాయతీ కార్యదర్శి గాని, తాహాసిల్దార్ కు గానీ సమాచారం ఇయాలన్నారు. మండలంలో చిట్కుల్, ఫైజాబాద్, చండూర్ గ్రామాలలో పాక్షికంగా ఇండ్లు కూలిన వారికి గ్రామపంచాయతీ కార్యాలయంలో తరలించమని, చండూరులో దూదేకుల షాహిన్ బేగం, ఫైజాబాద్ లో కమ్మరి రాములు ఇండ్లు పాక్షికంగా వర్షానికి కూలిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో ప్రశాంత్, ఎస్సై నర్సింలు, ఇన్చార్జి ఎంపీఓ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- **రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని వరద సహాయక చర్యలపై ఇప్పటికే కోటి రూపాయలు మంజూరు చేశామని అత్యధిక నిధుల మంజూరుకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ప్రత్యేక అధికారి డాక్టర్ హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర శాఖల జిల్లా అధికారులతో మెదక్ జిల్లా భారీ వర్షాలు వరదలు సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒరిస్సాలో ఏర్పడిన ఉపరితల ద్రోని వలన మెదక్ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయన్నారు 40 సంవత్సరాలలో మెదక్ జిల్లాలో ఇంత మేరకు అత్యధిక భారీ వర్షపాతం చూడలేదన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వరదల వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని తక్షణ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించినట్లు వివరించారు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వరద నీరు చేరి బిల్డింగ్ పైకి చేరుకున్న ప్రజలను హెలికాప్టర్ ద్వారా తరలించాలని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనపల్లి రోహిత్ రావు గారు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని వాతావరణ ప్రతికూల ప్రభావంతో హెలికాప్టర్ వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు నిమగ్నమై వారిని పునరావస్ కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు. ఏ సమయంలోనైనా మెదక్ జిల్లాకు రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జిల్లా అధికారులు సమస్యనైనా తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామని వివరించారు. అనంతరం ఇరిగేషన్ వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల వారీగా వరద నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలోజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రకృతి విపత్కర పరిస్థితిలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జిల్లా పాలన యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. మెదక్ జిల్లా భారీ వర్షాలు వరద ఉధృతిపై హవేలి ఘనపూర్ మండలం జలదిగ్బంధంలో చిక్కుకుందని అత్యధికంగా 300 మిల్లీమీటర్లు మీటర్స్ వర్షపాతం నమోదయిందని తెలిపారు. పాపన్నపేట నిజాంపేట్ శంకరంపేట్, రామాయంపేట మండలాల్లో 200 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది అన్నారు. ఎస్డిఆర్ఎఫ్ (03) బృందాల సిద్ధంగా ఉన్నాయని, 40 మంది ఆర్మీ బెటాలియన్ రంగాల్లో ఉందన్నారు, రామాయంపేటలో వరద ఉధృతి వలన మిషన్ భగీరథ పైప్లైన్ డ్యామేజ్ అవ్వడం జరిగిందని వెంటనే పునరుద్ధరించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ , రోడ్ల భవనాల శాఖ,ఇరిగేషన్ వరద నష్టాలను శాఖలు. తాత్కాలిక మరమ్మత్తులపై దృష్టి సారించారని, వరద ఉధృతి తగ్గిన వెంటనే శాశ్వత మరమ్మత్తులపై చర్యలు చేపడతామన్నారు. ఆర్డీవోలుమండల ప్రత్యేక అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు నిమగ్నమై ఉందన్నారు అనంతరం మంత్రివర్యులు పునరావాస కేంద్రాలలో ప్రజల సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు, హెల్త్ క్యాంపును సందర్శించి ఎటువంటి అనారోగ్య పరిస్థితి తలెత్త కుండా చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- **పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య**




**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 28 (జనం సాక్షి) :** చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యలో కొనసాగుతున్న వివిధ రకాల కార్యక్రమాలపై విషయాల వారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రెగ్యులర్ గా పాఠశాలలను సందర్శించి అక్కడ కొనసాగుతున్న కార్యక్రమాలను స్కూల్ ఎడ్యుకేషన్ మొబైల్ యాప్ నందు విధిగా అప్లోడ్ చేయవలసిందిగా ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలు ప్రత్యేకించి కరెంటు సదుపాయం, మరుగుదొడ్లు, తాగునీరు తదితర విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాలలలో విద్యార్థుల వాస్తవిక నమోదు, డైస్ డాటా మధ్య వ్యత్యాసము ఉండకూడదు అని సూచించడం జరిగింది. విద్యార్థుల ఆధార్ నమోదు మరియు ఆన్లైన్ డేటా ఎంట్రీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపిలో నిర్దేశించిన కార్యక్రమాలను సమయసారిని ప్రకారం పూర్తిచేయాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కృత్రిమ మేధా ఆధారిత విద్యాబోధనను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిల్లలకు అట్టి విషయాలలో సందేహాలను నివృత్తి చేస్తూ అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకునేలా చూడాలన్నారు. 59 పూర్వ ప్రాథమిక పాఠశాలల మంజూరును దృష్టిలో ఉంచుకొని అన్ని పాఠశాలలలో ఆ విద్యార్థులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలలో అందరు విద్యార్థులకు గుడ్డు పంపిణీ చేసేలా ప్రధాన ఉపాధ్యాయులు చూసుకోవాలని ఆదేశించారు. ఇన్స్పైర్ మానక్ నామినేషన్ కు సంబంధించి జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే వారి విద్యార్థులచే నామినేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ హరిత విద్యాలయ పురస్కార్ 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు సెప్టెంబర్ 15 లోగా స్వచ్ఛ హరిత విద్యాలయ పురస్కారానికి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు.. మన జిల్లా నుండి ఎక్కువ పాఠశాలలు రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందేలా ప్రధాన ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలలను నమోదు చేసుకోవాలి.

జిల్లాలోని అన్ని పాఠశాలలలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమావేశాలు ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఎక్కువమంది తల్లిదండ్రులను సమావేశాలలో భాగస్వాములు చేసేలా తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, వారి ప్రగతి ప్రదర్శన జరగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జిల్లా విద్యాధికారి, యస్. వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు బాలయ్య వెంకటేశం తాజుద్దీన్ సుప్రియ, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** హవేలీ ఘన్పూర్ మండలం వాడి గ్రామం నుండి పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తక్షణ చర్యలో భాగంగా బూరుగుపల్లి గ్రామం నుండి ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం సహాయంతో మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రం కు ఆసుపత్రికి తరలించారు. వెంటనే వైద్యులతో మాట్లాడి వైద్య చికిత్సలు అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజలను రక్షించేందుకు ఎస్డిఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉంటుందన్నారు. జిల్లాలో వరద సహాయక చర్యల్లో సేవలు అభినందనీయమన్నారు.

# ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

- **బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి**



**నంగునూర్, ఆగస్ట్ 28 (జనం సాక్షి) :** మండలంలో ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు.గురువారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలంలో పలు కార్యక్రమలలో పాల్గొన్ని బీజేపీ కార్యకర్తలను కలువడం జరిగింది. ఈ సందర్బంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించడం జరిగింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది. నంగునూరు మండలంలోని పలు వినాయక మండపాలను సందర్శించారు అలాగే ఇటివలే మరణించిన ఖానాపూర్ మాజి సర్పంచ్ కేసిరెడ్డి. శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు ఈ కార్యక్రమలలో మండల బీజేపీ అధ్యక్షులు చౌడుచర్ల వెంకట్రాంరెడ్డి సీనియర్ నాయకులు రజినికర్ రెడ్డి రాంచంద్ర రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి పప్పు సురేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి రత్నాకర్ రెడ్డి రజినికర్ నాయకులు సతీష్ రాంరెడ్డి కిషన్ యాదయ్య భాస్కర్, పరమేశ్వర్ కృష్ణ ప్రసాద్, అజయ్ అంబాదాస్,రామ్ ప్రసాద్, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

# పండగపూట సైతం రైతులకు తప్పని యురియా తిప్పలు

- **వర్షాన్ని లెక్కచేయకుండా యూరియా కోసం క్యూ లైన్**
- **ఉదయం నుంచి క్యూ కట్టిన రైతులు**
- **అయినా దొరకని యూరియా బస్తాలు**



**నంగునూరు, ఆగస్టు 28 (జనం సాక్షి) :** పండుగపూట రైతులు యూరియా బస్తాల కోసం నానా యాతనలు పడ్డారు. రాష్ట్రమంతా వినాయక చవితి పర్వదిన వేడుకల్లో ఉంటే సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఎదుట బుధవారం కురుస్తున్న జోరువానను లెక్క చేయకుండా యూరియా బస్తాల కోసం క్యూ కట్టారు. బ్యాంకు తడుస్తూ వరుసలో నిలబడ్డప్పటికీ రతులందరికీ సరిపోయే బస్తాలు దొరకక పోవడంతో రైతుల నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో రైతుల కష్టాలు తీరడం లేదు. ఇందుకు వర్షాన్ని లెక్క చేయకుండా పండుగ పూట యూరియా కోసం రైతులు క్యూ కట్టడమే సజీవ సాక్ష్యం. యూరియా కోసం నంగునూరులో విధవరం రైతులు పడరాని పాట్లు పడ్డారు. రైతులు ఉదయం నుంచే యూరియా బస్తాల కోసం క్యూ కట్టారు. కేవలం 550ల బస్తాలు మాత్రమే అందుబాటులో ఉండడంతో సగం మందికి కూడా యూరియా దక్కలేదు. ఈ సందర్భంగా బస్తాల కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. రాజగోపాల్ పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గంటల తరబడి వేచి చూసిన రైతులు యూరియా దొరకదని తెలిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వంపై ఆవేదనను వెళ్లగక్కారు. యూరియా అందుబాటులో లేక పంటల సాగుకు తాము ఇబ్బందులు పడుతుంటే, కొరత లేదని ప్రభుత్వం చెప్పడంపై రైతులు మండి పడ్డారు. ప్రభుత్వం సరైన ప్రణాళికతో యూరియాను అందుబాటులో ఉంచడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియాను రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. యూరియా లేక తమ పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

### మండల వ్యవసాయ అధికారిని అడ్డుకున్న రైతులు

బుధవారం నంగునూరు లోని ఆగ్రోస్ కేంద్రానికి 554 యూరియా బస్తాలు మాత్రమే వచ్చాయి. క్యూ లైన్లో రైతులు ఎక్కువ మంది ఉండడం, వర్షం కురుస్తుండడంతో రైతులకు టోకెన్లను వ్యవసాయ అధికారులతో పాటు, నంగునూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు అందించారు. ఈ క్రమంలో వచ్చిన బస్తాల కంటే ఎక్కువ టోకెన్లు అందించారు. దీనికి తోడు ఆగ్రోస్ కేంద్రంలో బస్తాలను ఇచ్చేందుకు అవసరమైన ఓటీపీ కోసం రైతుల వద్ద ముందుగానే ఆధార్ కార్డులు తీసుకున్నారు. ఈ క్రమంలో రాసిన టోకెన్ల కంటే ఎక్కువ ఆధార్ కార్డులు తీసుకున్నారు. దీంతో అందరికీ బస్తాలు అందలేదు. ఆగ్రహించిన రైతులు మండల వ్యవసాయ అధికారి బి.గీతను అడ్డుకున్నారు. కదలకుండా కారు చుట్టుముట్టారు. తమకు యూరియా బస్తాలు ఇచ్చే వరకు కదలనిచ్చేది లేదంటూ అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు కదలనివ్వలేదు. విషయం తెలుసుకున్న రాజగోపాలపేట ఎస్సై వివేక్ ఆధ్వర్యంలో పోలీసులు నంగునూరుకు చేరుకుని రైతులకు నచ్చజెప్పి పంపించారు.

# వణుకు పుట్టించిన చినుకు

- ఉరుములు మెరుపులతో భారీ వర్షం
- రాత్రంతా ఏకధాటిగా వర్షం
- ఆదిలాబాద్ టూ హైద్రాబాద్ నిలిచిపోయిన ఆర్టీసి బస్సులు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** బుధవారం జిల్లాలో కురిసిన చినుకు ప్రజలకు మళ్ళీ వణుకు పుట్టించింది. మొన్న కురిసిన భారీ వర్షం దాటి నుంచి తేరుకోకుండానే మళ్ళీ బుదవారం ఓ మారు ఎడా పెడా దంచి కొట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒకటే ఎండ ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. కానీ సాయంత్రం అంతా తారుమారు అయ్యింది. సాయం త్రం ఆరు గంటలకు ఆకాశంలో పూర్తిగా కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఏమీ జరుగుతుందో అర్థం కాకుండా పోయింది. ఒక వైపు భారీ శబ్దాలు చేస్తూ ఉరుములు మెరుపులు ఇంకో వైపు భారీ వర్షం కురుస్తూ ఆతలా కుతలం చేసింది. ఏకధాటిగా రాత్రి మొత్తం వర్షం ఆగకుండా కురియడంతో జిల్లాలోని పలు ప్రాంతాలు జల మయ మయ్యాయి. పలు కాలనీలలో వర్షపు నీరు చేరి రాత్రంతా నీరు నిలిచిపోయింది. రోడ్లపై భారీగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

### నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

రాత్రి సమయంలో ఆదిలాబాద్ నుంచి హైద్రాబాద్‌కు వెళ్ళే బస్సులను ఆర్టీసీ అధికారులు గురువారం ఉదయం వరకు పూర్తిగా నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. భారీగా కురిసిన వర్షం కారణంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చండ్రు పల్లివాగు



**మహదేవపూర్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** రెండు రోజులనుండి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు అన్నారం సరస్వతి బారేజ్ లో గోదావరిలో నీటి ప్రవాహం ఉదృతం గా ప్రవహించడంతో గోదావరి నీటి ప్రవాహం అన్నారం చంద్రుపల్లి వాగు ఉప్పొంగి చుట్టూ గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం జరిగింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లుఎత్తడంతో అన్నారం బ్యారేజీ లోకి నీటి ప్రవాహం ఎక్కువ చేరడంతో గోదావరి నీరు పోటీ ఎత్తడంతో ఈ వాగు నీటి ప్రవాహం ఉదృతంగా ప్రవహిస్తుందని ఈ వంతెన లో లెవెల్ గా ఉన్నందున ప్రతి సంవత్సం వర్షాకాలంలో ఈ వాగు వలన ప్రజల రాకపోవడంతో పాటు అత్యవసర పనులకు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడడం జరుగుతుందని ప్రతి సంవత్సరము వర్షాకాలంలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుందని గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము స్పందించి గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ వాగు కు ఎత్తైన వంతెన నిర్మించాలని గ్రామ ప్రజలు కోరినారు.

# వర్షాలు, వరదలు తగ్గేవరకు అందుబాటులో ఉండాలి

- అధికారులు లోతట్టుప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అన్ని ఏర్పాట్లు చేయాలి
- నీటి ప్రవాహానికి కొట్టుక పోయిన బ్రిడ్జిల వద్ద రవాణా కోసం తాత్కాలిక మరమ్మతులు చేయాలి
- గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 28(జనంసాక్షి) :** జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వర్షాలు, వరదలు తగ్గేవరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లోతట్టు గ్రామప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలం ప్రాజెక్టు నగర్ గ్రామం ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. అనంతరం ఎస్ఎస్ తాడ్వాయి మండలం జాతీయ రహదారి 163 జలగలంచ వద్ద వరద ప్రవాహాన్ని, మొండియాల తోగు వద్ద రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి దెబ్బతిన్న జాతీయ రహదారి 163 ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో గోదావరినది వరదతో అదేవిధంగా జంపన్నవాగు వరదప్రవాహంతో పరిసర ప్రాంతాలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదలశాఖ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రహదారులన్నీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ - అధికారులను ఆదేశించారు. వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా, రహదారుల భద్రత, మరమ్మత్తుల తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లలో గుంతలు ఉన్న చోట తాత్కాలిక మరమ్మత్తులు 48 గంటల్లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని సూచించారు. జిల్లాలోని చెరువులు, వాగులు భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లే పరిస్థితి నెలకొంది, ప్రతి చెరువు కట్టవద్ద ఇంజనీర్లు, క్షేత్ర అధికారులు తనిఖీ చేయాలి. చెరువుల సమీప గ్రామాలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలి. చెరువుల కట్టలు, వాగులవద్ద ఇంజనీర్లు తనిఖీలు నిర్వహించి భద్రత చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి, సత్వర చికిత్సఅందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని ముఖ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు (ఈడిడి - ఎక్సపెక్టెడ్ డేట్ అఫ్ డెలివరీ) నిశితంగా పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు రోజువారీగా తండాలను సందర్శించి, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితుల నివేదికలను సమర్పించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఎటువంటి ప్రమాద పరిస్థితిని ఎదుర్కోకుండా ముందస్తు వైద్య చర్యలు చేపట్టాలని ప్రతి కేసును నిశితంగా పర్యవేక్షించి, తల్లీబిడ్డల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను అన్నారు. మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ ప్రాంతాలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదలడం, దోమల మందు పిచికారి నిర్వహించడం తప్పనిసరి అని ఆదేశించారు. అన్ని లోతట్టు ప్రాంతాలు, మురుగు కాలువలను వెంటనే శు భ్రం చేయాలని తెలిపారు. వాహకాల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి పారిశుధ్య చర్యలను బలోపేతం చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్లలో గుంతలను వెంటనే పూడ్చే చర్యలు చేపట్టాలి. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం డిఈ కుమార స్వామి, తహసిల్దార్ సృజన కుమార్, సురేష్ బాబు, ఎంపిడిఓ మమత, సుమనవాణి, ఎంపిఓ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ పార్కు పేరిట అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకోవద్దు

**తమకు మద్దతుగా నిలవాలని మందకృష్ణను కోరిన దళితులు**



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** టెక్స్‌టైల్ పార్కు పేరిట గతంలో మాదిగలకు ఇచ్చిన అసైన్ భూములను వెనుకకు తీసుకోవద్దని దళిత సంఘ నాయకులు సింగపురం రాజయ్య, చింత శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రా నికి వచ్చిన మహాజన నేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మన దళిత రత్నం, పోరాట యోధులైనటువంటి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిసి దళితులకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను వెనక్కు తీసుకోకుండా అడ్డుకోవాలని కోరుతూ దళితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సింగపురం రాజయ్య, చింత శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు చెందినటువంటి 124 ఎకరాల అసైన్డ్ భూములను టెక్స్‌టైల్ పార్కు పేరిట ప్రభుత్వం వెనుకకు తీసుకుంటుందని, దీని ద్వారా మా కుటుం బాలు రోడ్డు మీద పడి, జీవన పరిస్థితులు చిన్నాభిన్నం అయిపోయే పరిస్థితి ఉంది కాబట్టి, ఇట్టి భూముల పైన ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకో కుండా ఉండే లా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మాకు తగిన న్యాయం చేయాలని మందకృష్ణ మాదిగను కలిసి వివరించారు. దానికి మంద కృష్ణ మాదిగ స్పందిస్తూ 'మీరు గట్టిగా నిలబడండి మీవెనుక నేనున్నాను, మీతో పాటునేను పోరాటంచేస్తాను. ఎంతదూరమైనా పోదాం, మీ భూముల వద్దకు వస్తాను' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింత శ్రీనివాస్, సింగపురం నాగయ్య,రాజ్ కుమార్, తాటికొం డ కుమార్, ఆనందం, రమేష్, క్రాంతి కుమార్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అకౌంట్లకు డబ్బులు జమ, వేరే అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్

- లబ్ధిదారులకు తెలవకుండా తెలంగాణ గ్రామీణబ్యాంకు మేనేజర్ నిర్వాకం
- సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- పై అధికారులు విచారణ చేపట్టి అప్పు ఉన్న రుణం రికవరీ చేయాలని డిమాండ్



**మహాముత్తారం, ఆగస్టు 28 (జనంసాక్షి) :** మహాముత్తారం మండలంలో ప్రజలను మోసం చేస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.గురువారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బాధితురాలు కొప్పుల చంద్రక్కకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూ మేనేజర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొప్పుల చంద్రక్కకు తెలియకుండా తన ఖాతాలోకి ఒక లక్ష 48 వేల రూపాయలు డబ్బులు జమ చేసి మళ్లీ బ్యాంక్ మేనేజరే తమ దగ్గర వ్యక్తికి ట్రాన్స్ఫర్ చేసుకోవడాన్ని ప్రజాసంఘాలు వ్యతిరేకించాయి. మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన మరో మహిళ అకౌంట్ లోకి ఒక లక్ష 50 వేల రూపాయలు కొట్టి మళ్లీ బ్యాంక్ అధికారులే తమ అకౌంట్లోకి డబ్బులు జమ చేసుకుని వాటికి ప్రతి సంవత్సరం బ్యాంకు మేనేజర్ వడ్డీ కట్టుకోవడం మోసపూరితమైన చర్య అని అన్నారు. ఈ విధంగా బ్యాంకులో ఉన్న సొమ్మునంత అమాయక ప్రజల అకౌంట్లోకి కొట్టి మళ్ళీ కొంతమంది బోకర్ల అకౌంట్ లోకి తన అకౌంట్లోకి మార్చుకుంటున్నాడని ఖాతాదారులు వాపోతున్నారు. బ్యాంకులో పనిచేస్తూ ప్రభుత్వ సంపదను దొంగలిస్తున్నాడని ఎన్ని కోట్లు తిన్నాడో ఎవరికి తెలియదని మేనేజర్ పై సిబిఐ విచారణ జరిపించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కంచే చేను మేసిన చందంగా తయారైన బ్యాంకు మేనేజర్ ను వెంటనే సంబంధిత బ్యాంకు పై అధికారులు విచారణ చేపట్టి ప్రభుత్వం సస్పెండ్ చేసి తిన్న డబ్బులను రికవరీ చేసి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలనిబాధితులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాలు బ్యాంకు ఎదుట ధర్నా మరియు నిరసనకార్యక్రమం నిర్వహించారు. బాధితుల పక్షాన పోరాడుతున్న ప్రజా సంఘాల కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్, మహాముత్తారం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు, మాజీ జెడ్పిటిసి సభ్యులు మందల రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వెలమరెడ్డి అనిల్ రెడ్డి, యువ నాయకులు ప్రశాంత్ రెడ్డి, బోడ బాలాజీ, బండి గణేష్, రామటంకి సమ్మయ్య, పున్నమి చంద్, రాజేందర్, తడాన్ల శివ, బంధం శ్రీధర్, కలుగూరి మహేందర్, కలుగూరి సదవలి, కలుగురి లచ్చయ్య, మల్కం సమ్మయ్య, మడ రవి, కంతి రవి, కురుసం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దొరకని యూరియా.. తీరని బాధ

- కుటుంబం మొత్తం యూరియా కోసమే బారులు
- నాటు వేసి నెల దాటింది. యూరియా వేయలేదు..
- పంట రాదని దిగులు పడుతున్న రైతులు




**కాటారం, ఆగస్టు 28 (జనంసాక్షి) :** కాటారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులు నాట్లు వేసి నెలలు దాటింది. కానీ నత్రజని వేయలేదని రైతులు దిగులు పడుతున్నారు. పంట రాదని రాకుంటే పెట్టుబడి నష్టపోతామని, రైతులు కుటుంబం ఆందోళన చెందుతున్నారు. కాటారం సబ్ డివిజన్ ప్రాంతంలో వరి పత్తి సాగు చేస్తుంటారు భూమి సారవంతంగా ఉండి ప్రతి భూమిని వ్యవసాయానికి ఉపయోగించడం వల్ల నత్రజని రైతుకు తప్పనిసరి పరిస్థితుల్లో అవసరం ఏర్పడింది. నాట్లు వేసిన తర్వాత రైతు తన పొలంలో నెల రోజుల్లో తప్పనిసరి పరిస్థితుల్లో నత్రజని వాడుతారు. వాడనట్లయితే పైరు పెరుగుదల ఆగిపోతుంది. రైతు రోజువారిగా కాటారం ప్రాథమిక సహకార సంఘానికి యూరియా వస్తుందని ఆశతో రోజు తన పనిని వదులుకొని, ప్రయాణ ఖర్చులు భరిస్తూ నిత్యం తన కుటుంబాలు లకు చెప్పుకొని వెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. దీని వలన రైతు దిగులు పడుతూ నాన్న ఇబ్బందులకు గురవుతున్నారు. యూరియా కొరత ఎప్పుడు తీరుతుందోనని ఆశపడుతూ కాలాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వ అధికారులు యూరియా కొరత లేదని చెప్తున్నారు. ప్రస్తుత గ్రామాల యూరియా లేక చాలామంది పంటకు వాడక మిగిలి ఉన్నారు. మరి యూరియా ఏమైనట్లు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా రైతుకు కావలసిన యూరియా లభిస్తే రోజు ప్రాథమిక సహకార సంఘం దగ్గర రైతులు ఎందుకు క్యూ కడతామని అడుగుతున్నారు.


## వరద ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు28 (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం పరిశీలించారు. శాంతినగర్ చౌరస్తా, సోఫీనగర్, తిరుమల టాకీస్ పరిసరాల్లో పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, స్థానికులతో మాట్లాడారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. వర్షాల కారణంగా ఇబ్బందులు తలెత్తితే వెంటనే కలెక్టర్ కంట్రోల్ రూమ్ నంబర్ 9100577132కి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ధని గ్రామ వాగు ఉధృతి

**రాకపోకలు అంతరాయం**



**సారంగాపూర్, ఆగస్టు 28(జనం సాక్షి) :** సారంగాపూర్ మండల కేంద్రంలో బుదవారం కురిసిన భారీ వర్షం కారణంగా ధని వాగు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, ఎస్సై శ్రీకాంత్, ఆర్ ఐ వెంకట్ నరసయ్య చేరుకొని ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వంతన దిగువ భాగం తట్టుకున్న చెత్తను తొలగించి వరద ప్రవాహం రోడ్డుపై రాకుండా చేసి వాహనాల రాకపోకలు అంతరాయం లేకుండా చేశారు.

# చదువుకు పేదరికం అడ్డుకాదు

- తల్లిదండ్రుల కలను సహకారం చేయడమే నా లక్ష్యం
- జేఈఈ మెయిన్స్ లో మెరిసిన రాజన్ పల్లి గిరిజన ఆణిముత్యం
- ఎస్టీ కోటాలో గట్టి మౌల్యశ్రీ మూడో ర్యాంక్



**గూడూరు, ఆగస్టు 27 (జనంసాక్షి):** చదువుకు పేదరికం అడ్డుకదాని నిరూపించిన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాజన్ పల్లి గ్రామానికి చెందిన గట్టి వెంకటేశ్వర్లు,పద్మ దంపతుల కుమార్తె గిరిజన ఆణిముత్యం మౌల్య శ్రీ పేదరికానికి చదువుకు అడ్డుకదాని నిరూపించి,తన ప్రతిభను చాటింది. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఎన్టిఆర్ జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదల అయ్యాయి.జేఈఈ మెయిన్స్ లో గట్టి మౌల్య శ్రీ కి 99.87శాతంతో ఎస్టి కోటాలో మూడవ ర్యాంకు సాధించింది. తన తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.తల్లితండ్రుల కష్టాన్ని చూసిన మౌల్యశ్రీ నాకు ఎన్ని ఇబ్బందులు ఉన్న, వాటిని లెక్కచేయకుండా నా కలను నెరవేర్చాలి అనే లక్ష్యంతో చదువుపై మక్కువ పెంచుకొని అనుకున్న లక్ష్యానికి చేరువైంది. కోయ (గిరిజన) కులంలో పుట్టి కోయగూడెంలో పెరిగిన మౌల్య శ్రీ పేదరికాన్ని పట్టించుకోకుండా తను అనుకున్న లక్ష్యం కోసం ఎంతో కష్టపడి అనుకున్న కలను నెరవేర్చి,చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన గిరిజన ఆణిముత్యం మౌల్యశ్రీ ర్యాంక్ సాధించినందుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



# ఇండ్లలోకి చేరిన వరద నీరు

**కడెం, ఆగస్టు 28 (జనంసాక్షి) :** కడెం మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలలోని పలువురి ఇండ్లలోకి నీరు చేరింది. మాసాయిపేట్ గ్రామంలో రాత్రి నుంచి ఎడతెరని కురుస్తున్న భారీ వర్షానికి దాదాపు 20 ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఇళ్లలోకి వరద నీరు చేరిన వారు రాత్రి నుండి పిల్లలతో ఇబ్బంది పడుతూ బయట వేరే వారింట్లో తలదా చుకునే పరిస్థితి ఏర్పడింది. గ్రామ విడిసి చైర్మన్ రత్నాల రాజేష్, ప్రధాన కార్యదర్శి బుర్ర రమేష్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలోని 20 ఇండ్లు నీటిలో మునిగిపోవడం బాధాకరమని, వారు పిల్ల జల్లలతో రాత్రి మొత్తం బయట కాలక్షేపం చేయడం మరింత బాధాకరమని అన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు పట్ల తగు పరిష్కారాలు చూపెట్టాలని కోరారు. వారి వెంట వీడిసి సభ్యులు గ్రామస్తులు తదితరులున్నారు.

## గ్రామాలకు పంచాయతీ కార్యదర్శుల నియామకం

- ఉత్తర్వులను జారీచేసిన జిల్లా కలెక్టర్ సత్య శారద

**చెన్నారావుపేట, ఆగస్టు 28 (జనం సాక్షి):** గ్రామాలకు డిప్యూటేషన్, ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శులను నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్య శారద ఉత్తర్వులను జారీ చేశారు. ఎల్లయ్య గూడెం పంచాయతీ కార్యదర్శి బి అవినాష్ ను జల్లి గ్రామానికి ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శిగా, బోడ మాణిక్యం తండా పంచాయతీ కార్యదర్శి కె రంజిత్ కుమార్ ను చెరువుకొమ్ము తండా ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శిగా, ఖాదర్ పేట పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న ఎన్ వీరన్నను సంగెం మండలం నార్లవాయి పంచాయతీ కార్యదర్శి గా డిప్యూటేషన్, నార్లవాయి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న ఎం రమేష్ ను ఖాదర్ పేట పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలను జారీ చేశారు.

# ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 28(జనం సాక్షి):** కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని అన్నారు. సుదీర్ఘకాలం రవీందర్ రెడ్డి విద్యాశాఖలో సేవలందించి రాష్ట్రస్థాయిలో మహబూబాబాద్ జిల్లాను పదవ తరగతి పరీక్షలలో మొదటి స్థానంలో నిలబెట్టినందుకు ఆయన చేసిన కృషి అమోఘమైందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ కు మారుపేరుగా ఆయన పని చేశారని గుర్తుకు చేశారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ విద్యాశాఖ బలోపేతానికి రవీందర్ రెడ్డి ప్రణాళికా ప్రకారం పని చేశారని క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన తదితరులు రవీందర్ రెడ్డి చేసిన కృషి సేవలపై మాట్లాడారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జెడ్పి సీఈవో పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఏ డిఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, వేముల సురేష్ గ్రౌండ్ వాటర్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, మెప్మా పీడీ విజయ, విద్యాశాఖ సిబ్బంది అప్పారావు, చంద్రశేఖర్ ఆజాద్, శ్రీరాములు, విజయ కుమారి, సతీష్, లచ్చి రాము, బాలాజీ, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



# జంట జలాశయాల గేట్లు ఎత్తివేత



**రాజేంద్రనగర్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాలైన గండిపేట ,హిమాయత్ సాగర్ లకు వరద ప్రభావంతో మరోసారి గేట్లను ఎత్తి నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. గురువారం ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడంతో గండిపేట జలాశయం పూర్తి నీటిమట్టం 1790 అడుగులు కాగా గురువారం సాయంత్రం వరకుచేరింది.జలాశయంలోకి 900 క్యూసెక్కుల ఇన్ఫ్లో వరద వచ్చి చేరడంతో 1789.85 అడుగుల వరకు నీటి ప్రవాహం చేరింది. దీంతో 2704 క్యూసెక్కుల నీటిని 8 గేట్లు 3 అడుగుల మేర పైకెత్తి నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. మరోవైపు హిమాయత్ సాగర్ జలాశయం నీటిమట్టం 1763.50 అడుగులు కాగా, జలాశయం దానికి 2500 క్యూసెక్కుల వరద చేరడంతో 17.63.25 అడుగుల వరకు నీటి ప్రవాహం చేరింది. దీంతో అధికారులు 2 గేట్లు అడుగుల మేర పైకెత్తి, మరో 1 గేటును 1 అడుగు మేర పైకెత్తి నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. జలమండలి అధికారులు, గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర లు జలాశయం వద్ద ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని పరిశీలించి దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

# చేవెళ్ల మున్సిపాల్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్




**చేవెళ్ల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆకస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపాలిటీ వార్డులలో వర్షాకాలం సందర్భంగా శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. అదేవిధంగా 100మీటర్లకు ఒక పువ్వుల మొక్కలు పెట్టాలని ఆయన తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలవకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు అధికారులకు మున్సిపాలిటీ పై పలు సూచనలు చేశారు. వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపరచి పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. అదనంగా రాబోయే వినాయక నిమజ్జనం సందర్భంగా సరైన ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా చెరువులు, శివారు ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధి, ప్రజా అవసరాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాడూరు వాగు వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో..?



**చేర్యాల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని తాడూర్ గ్రామంలోని వాగుపై వంతెన లేకపోవడంతో చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, బందారం, అంకిరెడ్డిపల్లి మొదలైన అవాస గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు, స్కూల్, కాలేజీల విద్యార్థులు, వ్యాపారులు వర్షాలు పడుతున్న సమయంలో వాగు ఉప్పొంగుతుండడంతో రాకపోకులకు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేండ్లుగా అనేక మార్లు ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలని నాయకులకు అధికారులకు ఎన్నో అర్జీలు పెట్టుకున్న కనికరించే వారు లేకపోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు.

# ఖాళీ భూముల్లో కూరగాయ, వాణిజ్య పంటలు సాగు చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



**బూర్గంపహాడ్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** అదనపు ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచడం కోసం మోడల్ డెమో ఫాం రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జింకలగూడెం గ్రామం వద్ద అధికారులకు మోడల్ డెమో ఫాం గురించి వివరించి కెనాల్ సమీపంలోని నీటిపారుదలశాఖ భూమిలో ఈ మోడల్ డెమో ఫాం నూతనంగా ఏర్పాటు చేయడానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మోడల్ డెమో ఫాంలో కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు, వాక్కాయ కంచె, క్వాయిల్ యూనిట్ షెడ్, సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచేలా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మోడల్ డెమో ఫాం రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించడం, సరికొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయడం చేయడం ద్వారా అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సొరకాయ, దోసకాయ, బీరకాయ, కాకరకాయ, మునగతో పాటు వాణిజ్య పంటలైన పట్టుపరిశ్రమ, మలబార్ వేప, వెదురు తదితర పంటలకు కావాల్సిన సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని, ఈ భూములను ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే ఆర్ కె ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఎంపీవో బాలయ్య, ఆర్ ఐ లు నర్సింహారావు, వీర్రాజు, ఐకేపీ ఏపీఎం హేమంతిని, సెక్రటరీ భవానీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 28 (జనంసాక్షి) :** అన్ని శాఖల సమన్వయంతో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం కలెక్టరేట్ లో ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీఓలు, ఏపీవోలు, ఫారెస్ట్ ఆఫీసర్లతో వనమహోత్సవంపై వెబ్ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి శాఖ నిర్దేశించిన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలని, సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖలు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలలో, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలలో ఎంపీడీవోల సమన్వయంతో పూల మొక్కలను, డెకరేషన్ మొక్కలను నాటించాలని అన్నారు. పరిశ్రమల శాఖకు సంబంధించి సిమెంటు పరిశ్రమలలో డీఎఫ్ఓతో కలిసి సిమెంటు ఫ్యాక్టరీ వారితో సమన్వయం చేసుకుని పెద్దగా పెరిగే మొక్కలు నాటించాలన్నారు.మైనారిటీ శాఖ సంబంధిత ప్రదేశాలలో జానపహాడ్ దర్గా వంటి దర్శనీయ స్థలాలలోమొక్కలు నాటించడం లేదా ప్లాంటేషన్ చేయించాలని పేర్కొన్నారు.పోలీస్ శాఖ పోలీస్ స్టేషన్ లలో ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలని, సూర్యాపేట మున్సిపాలిటీలో ఆర్డీవో




సమన్వయంతో వారి పరిధిలో కొత్త , పాత రహదారుల్లో మొక్కలు లేనిచోట గుర్తించి మొక్కలు నాటాలన్నారు.కేసారం, గాంధీనగర్ లలో మొక్కలు నాటించాలని, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో గల ఖాళీ ప్రదేశాలలో రహదారులకిరువైపుల మొక్కలు నాటించాలని, నీటిపారుదల శాఖ ఎంపీడీవోలతో సమన్వయం చేసుకుని నీటిపారుదల కాలువ గట్ల మీద, చిన్న చిన్న కెనాల్స్ వద్ద, వాటర్ ట్యాంకుల వద్ద మొక్కలు నాటించాలని చెప్పారు.ఎంఈఓలు తమ తమ పరిధిలో గల హైస్కూల్, ప్రైమరీ స్కూల్స్ లో ఖాళీగా ఉన్న ప్రదేశాలలో మొక్కలు నాటించాలని, ఎక్సైజ్ శాఖ తమ పరిధిలో ఉన్న ఎక్సయిజ్ స్టేషన్ ల ఆవరణలో మొక్కలు నాటించాలని అన్నారు. దీనికి ప్రతి శాఖ కృషి చేసి వనమహోత్సవాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు.జిల్లాలో త్వరలో జరగబోవు గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు.వర్షాలు కురుస్తున్నందువల్ల గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, స్ప్రే ద్వారా శానిటేషన్ చేయించాలని డిపిఓను ఆదేశించారు.జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులు గ్రౌండింగ్ పూర్తి చేసే విధంగా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్స్ పూర్తి చేయించాలని ముందుగానే సగం డబ్బులు ఇవ్వడం జరిగిందని, మిగతా డబ్బులు పూర్తి అయిన వెంటనే చెల్లించడం జరుగుతుందని తెలిపారు.అందువల్ల త్వరగా పూర్తి చేయించాలని సంబంధిత ఐసిడిఎస్ అధికారిని ఆదేశించారు.జిల్లాలో పీఎంఈవై సర్వే జరిపించి యాప్ లో అప్ డేట్ చేయాలని అన్నారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్,ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానందరాణి, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**చింతకాని, ఆగస్టు 28 (జనం సాక్షి) :** జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చింతకాని మండలం రామకృష్ణాపురం చెరువు అలుగు పారి, ఉధృతితో ప్రవహిస్తున్న ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారి లోని ధంసలాపురం వద్ద గురువారం వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల రాకపోకలు, ప్రజలు బ్రిడ్జ్ దాటకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మట్లాడుతూ అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అధికారులు పూర్తి సంసిద్ధతతో స్థానికంగా ఉంటూ పని చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో వర్షం, వరదను అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్లు 1077, వాట్సాప్ సెల్ నెంబర్ 9063211298 లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో స్థానికంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు అలుగులు పారే అవకాశం ఉందని, ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలని



సూచించారు. వర్షాల సమయం కాబట్టి రోడ్డు పైకి ప్రజలు అనవసరంగా రావద్దని. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఉధృతంగా ప్రవహించే వాగులు చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని, దీనికి సంబంధించి తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిస్థితులను సైతం తట్టుకునేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, చింతకాని తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది ఆర్ ఐ లు జగదీష్, ఏకవీర పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు తదితరులు ఉన్నారు.

# జిల్లా ప్రజలు అధైర్యపడొద్దు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారుల నుంచి వర్షాల తీవ్రత, వరద ఉధృతి, నష్టపరిస్థితులపై పూర్తి వివరాలు సేకరించిన మంత్రి సీతక్క, వర్షం తగ్గుముఖం పట్టినా అప్రమత్తతలో ఎలాంటి లోపం జరగకూడదని స్పష్టం చేశారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యక్ష పర్యటనలు నిర్వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లను పరిశీలించి ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ముంపు నీటిని బయటికి పంపే చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, వ్యవసాయ, మంచినీటి, పంచాయతీరాజ్ శాఖలు వెంటనే నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులను వేగవంతం చేసి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలకు అప్రమత్తం కల్పించాలన్నారు. వాతావరణం అనుకూలించగానే జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తాను. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# మెతుకు సీమ వణికింది..

- భయం గుప్పిట్లో జన జీవనం



**పాపన్నపేట, ఆగస్టు 28 (జనంసాక్షి) :** వరుణుడి ప్రతాపంతో మెతుకు సీమ వణికింది. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో ఎటు చుసిన వరద నీరు కనిపించింది. మంగళవారం రాత్రి నుండి బుధవారం సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షానికి మెదక్,పాపన్నపేట మండల ప్రజల జన జీవనం భయం గుప్పిట్లో కోనసాగింది. పలు గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. ఎల్లాపూర్ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని బుధవారం తహసీల్దార్ సతీష్ కుమార్,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. వంతెన పై నీరు ప్రవహించడంతో మెదక్ – పాపన్నపేట కు బుధవారం రాత్రి నుండి రాకపోకలు బంద్ అయ్యాయి. బారాకానాల వద్ద నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో పాపన్నపేటలో సైతం పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సింగూరు ప్రాజెక్ట్ నుండి మళ్ళీ నీటిని విడుదల చేశారు. ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ముందు నుండి వరద ప్రవాహం కొనసాగుతుంది. మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పాపన్నపేట లోని సాలం చెరువు,పాత చెరువు,ఆయా గ్రామాల లోని చెరువులు నిండి రహదారుల పై నుండి నీరు ప్రవహిస్తుంది. పాపన్నపేట – మిన్పూర్, కుర్తివాడ – యూసుఫ్ పేట రహదారిలో నీటి ప్రవాహం,పాపన్నపేట నుండి మల్లంపేట వెళ్లే దారిలో సాలం చెరువు నిండి రహదారి పై నీరు,అర్కేల వద్ద రహదారి కోతకు గురైంది. గిరిజన తండా లకు రాకపోకలకు అంతరాయం కలిగింది.నారు వేసిన వరి పంట పొలాలు మునిగి పోయాయి. పంట పొలాలు నది చెరువుల వలే తలపించాయి. అన్నదాత కు ఈ వర్షం నిరాశను మిగిల్చింది. ఆయా గ్రామాలలో సుమారు 20 ఇండ్లు కూలిపోయాయి. బుధవారం వినాయక చవితి వేడుక సాదాసీదా గా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పాలన యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టింది.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



**శామీర్‌పేట్, ఆగస్టు 28 (జనం సాక్షి) :** వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని తుంకుంట మున్సిపల్ కమీషనర్ జ్యోతి అన్నారు. గురువారం రోజు శామీర్ పేట పెద్ద చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించడానికి మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి, ఏసీపీ బాల గంగి రెడ్డి మరియు అన్ని విభాగాల అధికారులు వినాయక నిమ్మజ్జనం ఏర్పాట్లను సందర్శించారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి పేట బషీరాబాద్ ఏసీపీ బాలా గంగిరెడ్డి ,మున్సిపల్ కమిషనర్ ఎం ఎన్ ఆర్ .జ్యోతి,శామీర్ పేట సీఐ శ్రీనాథ్ ,పోలీసు అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నూనెముంతల రవీందర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** జిల్లాలో రానున్న 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. పట్టణాలు, గ్రామాలు, తండాలలో ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, ఎక్కడ కూడా ఏ చిన్న అవాంచనీయ సంఘటన చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తో కలిసి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఉదయం నుండి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నెలకొని ఉన్న పరిస్థితులను సమీక్షించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల ఎక్కడెక్కడ చెరువులు, కుంటలు, వాగులు తెగిపోయాయి, ముంపునకు గురైన నివాస ప్రాంతాలు, దెబ్బతిన్న రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, కొట్టుకుపోయిన ట్రాన్స్ఫార్మర్లు తదితర వివరాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ, క్షేత్రస్థాయి అధికారులకు తక్షణ సహాయక చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వరద ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉన్న గ్రామాలు, తండాల ప్రజలను హుటాహుటిన పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.



వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలను కూడా మైకుల ద్వారా అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన గ్రామాలలో తక్షణమే విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడితే వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలన్నారు. రానున్న 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అత్యవసరం అయితేనే ప్రజలు ఇళ్ళ నుండి బయటకు రావాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ మేరకు అన్ని నివాస ప్రాంతాలలో టాంటాం, మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చేపల వేట, ఈత కోసం చెరువులు, కాలువలు, రిజర్వాయర్లలోకి దిగకుండా కట్టడి చేయాలని, అవసరమైన చోట పోలీసు బందోబస్తు, పికెటింగ్ లను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. అవసరమైన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా జేసీబీలు, ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్లను, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి, ప్రజలకు వరద పరిస్థితిపై సమాచారం తెలియజేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. తెగిన విద్యుత్ వైర్ ల సమీపంలోకి ప్రజలు వెళ్ళకుండా చూడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ళలో ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ, భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని 70 గొర్రెలు మృతి

- రూ.7 లక్షల విలువ ఉంటుందని అంచనా
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలి
- యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్



**బొంరాస్ పేట, ఆగస్టు 28 (జనం సాక్షి):** మండల పరిధిలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారిపై ఘోరం జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొంరాస్ పేట మండలం నాందార్ పూర్ గ్రామానికి చెందిన చెందిన గిర్ని మల్కప్ప,రాయికంటి ఎల్లప్ప తుంకీమెట్ల చివరలో రెండు మూడు రోజుల నుండి గొర్రెలను మేపుతూ అక్కడే మందను ఒకచోట నిలిపి రాత్రి బస చేసి పడుకున్నారు.జోరుగా వర్షం కురుస్తున్న తరుణంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గొర్రెలు మందలో నుండి రోడ్డుపైకి పెద్ద చెరువు సమీపంలోకి వెళ్ళగానే గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో 70 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయని బాధితులు తెలిపారు.గొర్రెల విలువ రూ.7 లక్షల విలువ ఉంటుందని గొర్రెలే జీవనాధారంగా బతుకుతున్నామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రభుత్వం గొల్ల కురుమలను ఆదుకోవాలి**

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 70 వరకు గొర్రెల మృతి చెందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆదుకోవాలని కోడంగల్ నియోజకవర్గం గొల్ల కురుమల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ డిమాండ్ చేశారు.

## పదేళ్ల తర్వాత పేదల సొంతింటి కల సాకారం చేశాం

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలందరికీ సంక్షేమం
- నూతన ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశం
- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి ఆగష్టు 28(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుతుందని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామం పరిధిలోని రామకృష్ణాపురంలో నూతన ఇందిరమ్మ ఇల్లును నిర్మించిన లబ్ధి దారులు అండాలమ్మ ఇంటిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశం,రిబ్బన్ కట్ చేసి పూజలు నిర్వహించారు.ఈ సందర్భ ంగా ఆండాలమ్మ,ను శాలువాతో సన్మానం ఎమ్మెల్యే సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..గత ప్రభుత్వం 10 ఏళ్లు అధికారంలో ఉండి ఒక్క పక్కా ఇల్లు కూడా పేదలకు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన 20 నెలలోనే పేదల సొంతింటి కల నెరవేర్చిందని తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ పథకంతో రూ,5 లక్షలతో సొంతింటిని నిర్మించి పేదల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరగా ఇండ్లను పూర్తిచేసు కుని సంతోషంగా సొంత ఇంటిలో ఆత్మగౌరవంతో జీవించాలని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.తదనంతరం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,కుటుంబ సభ్యుల సహకారంతో పడకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులందరికీ షూస్,లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి,శతాబ్ది టౌన్షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మార్వో కే.రమేష్, ఎంపీడీవో శ్రీకాంత్,ఆమనగల్ మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,యాట నరసింహ,శ్రీనివాస్ గౌడ్,ఏఎంసి డైరెక్టర్లు, శ్యామ్ సుందర్ రెడ్డి,అంజయ్య గుప్తా,ఆవాంచ నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, యాదగిరి, రబ్బాని, మల్లేష్, రాజురెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

### వరద ముంచెత్తడంతో గ్రామాలు ఖాళీ

**సురక్షిత ప్రాంతాలకు తరలిన ప్రజలు**

**కామారెడ్డి:** భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను వరద ముంచెత్తు తోంది. ఈక్రమంలో డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్ టాక్లి, పెద్దటాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్‌పూర్) ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటు-ంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటుంబాల వారు తమ ఇళ్లకు తాళాలు వేశారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. నియోజక వర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని అధికారులను కోరారు.

## ఉమ్మడి జిల్లాలో భారీ వర్షంతో జలమయం

- రెండ్రోజులు పాటు విద్యాసంస్థలకు సెలవులు
- అసవరమైతే తప్ప బయటకు రావద్దన్న కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 28(జనం సాక్షి) :** అల్ప పీడన ప్రభావం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను భారీ వర్షం అతలాకుతలం చేసింది. రెండు రోజుల పాటు ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ క్రమంల పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. రెండు రోజుల పాలు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కామారెడ్డి పట్టణం నీట మునిగింది. లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరింది. దీంతో జిల్లా జలదిగ్బంధనంలో ఉంది. అలాగే నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులన్నీ జలమయ మయ్యాయి. ఉరుములు, మెరుపులతో మొదలైన వర్షం క్రమంగా భారీ వర్షంగా మారింది. దీంతో నగరం దాదాపు జలమయం అయింది. దీంతో భారీగా వరద నీరు చేరి రోడ్లు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు- పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకురావొద్దని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే ఉమ్మడి జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అదేవిధంగా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదావేశారు. శుక్రవారం జరగాల్సిన పరీక్షలను యథాతథంగా నిర్వహిస్తామని వెల్లడించారు. శ్రీరామ్ సాగర్ కు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు లోతట్లు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ జగదీష్ హెచ్చరికలు జారీ చేశారు.

### ర్యాపర్ ఫ్రెంచ్ మోంటానాతో

## దుబాయ్ యువరాణి షేకా మహ్రా నిశ్చితార్థం



దుబాయ్ యువరాణి షేకా మహ్రా బిన్ మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్, గత ఏడాది ఇన్స్టాగ్రామ్‌లో భర్తకు విడాకులు ప్రకటించి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రముఖ మొరాకో-అమెరికన్ ర్యాపర్ ఫ్రెంచ్ మోంటానాతో షేకా మహ్రాకు నిశ్చితార్థం జరిగినట్లు ర్యాపర్ అధికార ప్రతినిధి ధ్రువీకరించారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 31 ఏళ్ల షేకా మహ్రా, దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె. బ్రిటన్‌లో అంతర్జాతీయ వ్యవహారాల్లో ఉన్నత విద్యను అభ్యసించి, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారు. 2023 మే 27న దుబాయ్ వ్యాపారవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌తో ఆమెకు వివాహం జరిగింది. అయితే, బిడ్డకు జన్మనిచ్చిన కొన్ని నెలల తర్వాత, 2024లో 'ఐ డివోర్స్ యూ' అంటూ ఇన్స్టాగ్రామ్‌లో విడాకులు ప్రకటించి సంచలనం రేపారు. ఆ తర్వాత 'డివోర్స్' పేరుతో పర్ఫ్యూమ్ బ్రాండ్‌ను ప్రారంభించారు. షేకా మహ్రా, 40 ఏళ్ల ఫ్రెంచ్ మోంటానాతో గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. విడాకుల తర్వాత దుబాయ్ వీధుల్లో వీరిద్దరూ కలిసి కనిపించారు. 2025 జూన్‌లో పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఒకే వేదికపై కనిపించి, అప్పుడే నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. వీరి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫ్రెంచ్ మోంటానా, 'అన్ఫర్గెటబుల్', 'నో స్టైలిస్ట్' వంటి ఆల్బమ్‌లతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. గతంలో వ్యాపారవేత్త నదీన్‌ను వివాహం చేసుకొని విడిపోయిన ఆయనకు 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. షేకా మహ్రా, మోంటానా జంట ఎంగేజ్‌మెంట్ వార్తలు ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తున్నాయి.



# ఉమ్మడి జిల్లాలో కుండపోత

**కామారెడ్డి జిల్లా అతలాకుతలం... నిజామాబాద్ జిల్లా అప్రమత్తం**



**కామారెడ్డి జిల్లా బ్యూరో ఆగస్టు 28 (జనం సాక్షి) :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి నుండి ఏకాధాటిగా రెండు రోజులుగా కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. ఈ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లా అతలాకూతలం కాగా, నిజామాబాద్ జిల్లాను అధికారులు అప్రమత్తం చేశారు.

**శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు జలకళ :**

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి 25 గేట్లను ఎత్తడంతో లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 50 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ద్వారా నీరు వస్తుండగా వివిధ మార్గాల ద్వారా 1,30,392 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

**భారీ వర్షానికి కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అతలాకుతలం :**

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్లు స్తంభించాయి. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి కి వెళ్లే రహదారి దారిలో వరదనీరు దాటికి రోడ్డు కుంగిపోవడంతో అందు లో పడి ఓ కారు ఇరుక్కుపోయింది. మరోవైపు రాజాం పేట్ మండ లం కొండాపూర్, అరగొండ, ఎల్లాపూర్ తండా, ఎల్లారెడ్డిపల్లి, గుడి తండా చుట్టుపక్క తండాలలో భారీ వర్షంతో వరద దాటికి తాండా లలో నివాసం ఉంటున్న ప్రజలు, వరద నీటితో ఆ తాండాలు పూర్తిగా జలదిగ్బంధంలో ఉన్నాయి. వెంటనె ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి తక్షణమే హెలికాప్టర్ సహాయంతో వరద నీటిలో కొట్టుకుపోతున్న బాధితులను కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.

మరోవైపు బిక్కనూరు - తలమడ్ల మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్ వరద ప్రవాహంతో కొట్టుకపోయింది. కామారెడ్డి జిల్లాలో ఏకధాటిగా కురిసిన నాలుగు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి వరద నీరు జాతీయ రహదారిపై వచ్చి చేరడంతో రహదారి కాస్త చెరువును తలపిస్తుంది. ఈ వరద నీటికి కొన్ని కార్లు వరదలో చిక్కుకోగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు లారీలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడే గంటల తరబడిగా నిలిపివేశారు. కేవలం నాలుగు గంటలు కురిసిన భారీ వర్షానికి 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు బిక్కనూరు ప్రాంతంలో రైల్వే పట్టాలపై నుంచి కూడా వరద నీరు పొంగిపొర్లుతోంది. దీంతో అటువైపు వెళుతున్న వాహనదారులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**వరదలో చిక్కుకున్న వలస కూలీలు :**

భారీ వర్షాల కారణంగా జుక్కల్ నియోజకవర్గం అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి పారుతున్నాయి. కళ్యాణి ప్రాజెక్టులో భారీగా వరద వచ్చి చేరుతోంది. మంజీర నది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతం నుంచి విపరీతంగా వస్తున్న వరదల కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్లను వదిలి 1,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న గ్రామాలు పూర్తిగా జలమయమయ్యాయి.


నిజాంసాగర్ మండల కేంద్రంలోని చిన్నాపూర్ వంతెనను ఆనుకొని వదర ప్రవహిస్తోంది. గత 35 ఏళ్లలో ఇలా వంతెనను తాకుతూ వరద పారడాన్ని మొదటిసారి చేస్తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిదంగా నిజాంసాగర్, సుల్తాన్పూర్ గ్రామాల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. ఎగువన ఉన్న లింగంపేటలో చెరువులు తెగిపోవడంతో భారీ వరద ఈ రెండు గ్రామాలను చుట్టుముట్టింది. మునుపెన్నడూ లేనివిధంగా నిజాంసాగర్ మండలంలోని బొగ్గ గుడిసె పూర్తిగా నీటమునిగింది. లింగంపేటలో చెరువులు కొట్టుకుపోగా వరద అంతా కళ్యాణి ప్రాజెక్టులోకి వస్తోంది. దీంతో ప్రజలంతా ముందస్తుగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. బొగ్గగుడిసె సమీపంలో జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. అయితే వరద ఒక్కసారిగా ముంచెత్తడంతో పనుల్లో భాగంగా అక్కడ ఉన్న 8మంది బిహారీ కూలీలు వరదలో చిక్కుకున్నారు. అక్కడ ఉన్న వాటర్యాంకర్ పైకి ఎక్కి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే గొన్కల్ గ్రామంలోని కోళ్ల ఫారంలో ఉంటున్న ముగ్గురు వ్యక్తులు వరదలో చిక్కుకున్నారు. ముగ్గురిలో ఒక బాలుడు ఉన్నట్లు తెలిసింది. బొగ్గగుడిసె వద్ద వరదలో చిక్కుకున్న కూలీల కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మొదట హెలీక్యాప్టర్ సాయంతో కూలీలను కాపాడాలని సూచించినట్లు తెలిసింది. అయితే ముందుగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేసి వారిని రక్షించారు. అదేవిదంగా భారీ వర్షాల నేపథ్యంలో రామారెడ్డి మండల పోసానిపేట్ బండి వాగు నీటి ప్రవాహంలో చిక్కుకున్న మహిళను అదే గ్రామానికి చెందిన యువకులు రక్షించి ఒడ్డుకు చేర్చారు.

**పరిస్థితిని పర్యవేక్షించిన సబ్ కలెక్టర్ :**

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం భారీ వర్షాల నేపథ్యంలో జరిగిన పరిసితిని బుదవారం పర్యవేకణ చేశారు.అంతా చక్కదిద్దేవరకు అధికారులను పరిస్థితులపై అప్రమత్తం చేశారు.

**జిల్లా కేంద్రాలకు రాకపోకలు బంద్ :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల నుండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బాన్సువాడ డివిజన్ లోని బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుండి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో బొగ్గ గుడిసె వద్ద జరిగిన బ్రిడ్జి అంతరాయం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిదంగా బోధన్ డివిజన్ లోని వర్ని మండలం శ్రీనగర్, వకీల్ ఫాం వద్ద వాగు వంతెన పై నుండి నీరు ప్రవహించడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు బంద్ అయ్యాయి.







## పేలిన ఎఫ్-35 ఫైటర్ జెట్



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆరంభంలో అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధ విమానం నేలకూలిన విషయం తెలిసిందే. అది కూలిన సమయంలో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. అలస్కాలో రన్‌వేపై అది కూలింది. ఎలిసన్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో కూలి, పేలిన ఆ ఘటనకు చెందిన వీడియో రిలీజైంది. అయితే ఆ ప్రమాదానికి చెందిన రిపోర్టను తాజాగా రిలీజ్ చేశారు. జనవరి 28వ తేదీన ఆ దుర్ఘటన జరిగింది. ఆ ప్రమాదానికి ముందు.. ఫైటర్ జెట్ కూలకుండా ఉండేందుకు దాని పైలట్ తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలుస్తోంది. లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ ఇంజినీర్లతో ఆ సమయంలో అతను మాట్లాడాడు. సుమారు 50 నిమిషాల పాటు ఆ ఫైటర్‌ను సరి చేసేందుకు పైలట్ ట్రై చేశాడు. చివరకు సుడులు తిరుగుకుంటూ ఆ విమానం పేలుతూ కూలింది. కానీ ఈ ప్రమాదం నుంచి పైలట్ తృటిలో తప్పించుకున్నాడు. పారాచూట్ సాయంతో అతను సురక్షితంగా బయటపడ్డాడు.

టేకాఫ్ తీసుకున్న తర్వాత ల్యాండింగ్ గేర్‌ను సరిచేయడంలో ఆ పైలట్ ఇబ్బందిపడ్డాడు. కానీ తన ప్రయత్నంలో విఫలం అయ్యాడు. ముక్కు భాగంలో ఉన్న హైడ్రాలిక్ లైన్స్ లో ఐస్ చిక్కుకుపోవడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు పైలట్.. లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీకి చెందిన అయిదుగురు ఇంజినీర్లతో మాట్లాడారు. వారితో మాట్లాడుతూనే ఫైటర్ జెట్‌ను సురక్షితంగా ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించాడు.

రెండుసార్లు ల్యాండింగ్ కోసం ట్రై చేశాడు. ముక్కు భాగంలో ఐస్ జామ కావడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ల్యాండింగ్ గేర్లు మొత్తం ఫ్రీజ్ కావడంతో ఆ యుద్ధ విమానం అనుకున్నట్లు దిగలేకపోయిందని రిపోర్టులో తెలిపారు. విమానం నేలమీదే ఉన్నట్లు జెట్ సెన్సార్లు పేర్కొన్నాయని, దీంతో ఆ యుద్ధ విమానాన్ని కంట్రోల్ చేయడం రాలేదని, ఫలితంగా పైలట్ బలవంతంగా ఎజెక్ట్ కావాల్సి వచ్చినట్లు రిపోర్టులో రాశారు. వారం రోజుల తర్వాత ఇదే బేస్‌కు చెందిన మరో యుద్ధ విమానంలోనూ హైడ్రాలిక్ ఐసింగ్ సమస్యలు వచ్చాయి. కానీ ఆ విమానం సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. అయితే జనవరి 28వ తేదీన ఎఫ్-35 కూలిన రోజు మైనస్ 18 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం వల్ల సుమారు 200 మిలియన్ల ఫైటర్ జెట్ ధ్వంసమైంది. హైడ్రాలిక్స్ సర్వీసింగ్‌లో సమస్యల వల్లే ప్రమాదం జరిగినట్లు ఎయిర్‌ఫోర్స్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డు పేర్కొన్నది.

## కార్యకర్తల కోరిక మేరకే బిఆర్ఎస్ పార్టీలోకి..

**గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్**



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28(జనం సాక్షి) :** కార్యకర్తల కోరిక మేరకే కాంగ్రెస్ వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరి సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి ఎస్ కేశవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ లో పని చేస్తే కార్యకర్తలకు ఎలాంటి గుర్తింపు ఉండదని, అందులో తాము కూడా బీసీలమేని మా వెంట ఉన్న మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఎక్కువగా బీసీలే ఉన్నామని కాంగ్రెస్ పార్టీలో తమకు గుర్తించడం లేదని ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీ వీడి బి ఆర్ ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన అన్నారు. వచ్చే నెల ఆరు లేదా 10వ తేదీలలో గద్వాలలో కేటీఆర్ సమక్షంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు.

### విజయనగరం ఐసిస్ ఉగ్రకుట్ర కేసులో

## ఎన్ఐఏ మరోకరి అరెస్టు చేసింది

**న్యూఢిల్లీ:** విజయనగరం ఐసిస్ ఉగ్రకుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు మరో కీలక సూత్రధారిని అరెస్టు చేశారు. బిహార్‌కు చెందిన ఆరిఫ్ హుస్సేన్ అలియాస్ అబూ తలిబ్‌ను ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుకున్నారు. విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, అధికారులు వెంబడి అతన్ని అదుపులోకి తీసుకున్నారని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఈ అరెస్టు ఐసిస్ ఉగ్రవాద కుట్రలకు సంబంధించిన దర్యాప్తును మరింత బలోపేతం చేస్తుందని అధికారులు తెలిపారు. ఆరిఫ్ హుస్సేన్ ఈ కేసులో ముఖ్య పాత్ర పోషించాడని, అతని అరెస్టుతో మరిన్ని వివరాలు వెలుగులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఎన్ఐఏ ఈ కేసులో ఇప్పటికే పలు అరెస్టులు చేసిన సందర్భంగా, ఈ అరెస్టు ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడంలో ముఖ్యమైన అడుగుగా పరిగణించబడుతోంది. మరిన్ని వివరాలు దర్యాప్తులో భాగంగా త్వరలో వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
29 ఆగష్టు 2025

# పోచారం ప్రాజెక్టుకు తప్పిన పెనుప్రమాదం

### స్తంభించిన రాకపోకలు

**నాగిరెడ్డిపేట్,ఆగస్టు 28 (జనంసాక్షి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట్ మండలాల వరప్రదాయిని అయినటువంటి పోచారం ప్రాజెక్టు భయంకరంగా పొంగిపొర్లుతుంది.35 సంవత్సరాల అనంతరం ప్రాజెక్టు భయంకరంగా మళ్లీ పొంగిపొర్లడంతో ఆయకట్టు రైతులు భయాందోళనకు గురవుతున్నారు.సుమారు పోచారం ప్రాజెక్టులోనికి రెండు లక్షల ఏడువేల,,58 క్యూసెక్కుల వరద ప్రభావం లింగంపేట్ గుండారం ప్రధాన వాగుల ద్వారా వస్తుంది.దానితో పోచారం ప్రాజెక్టు తట్టుకోలేక ఒకవైపు గండిపడి మరింత భయంకరంగా ప్రవహిస్తుంది.ఇరిగేషన్ అధికారులు పరివేక్షణ చేసినప్పటికీ ఇంత పెద్ద వరద వస్తుందని ఊహించలేకపోయారు.పోచారం ప్రాజెక్టుకు గండి పడటంతో అనుక్షణం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు,మండల కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.ఆయకట్టు రైతులు మాత్రం ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని భయం భయంతో ఉన్నారు. ఎల్లారెడ్డి,నాగిరెడ్డిపేట్ మండలాల వరప్రదాయిని అయినా పోచారం ప్రాజెక్టు 103 సంవత్సరాల క్రితందాని ఏం జరుగుతుందో ఏమోనని రెండు మండలాలకు ప్రధానమైన ప్రాజెక్టు పరిస్థితి ఏమిటని ప్రతి ఒక్కరు ఆందోళన అయోమయంలో పడ్డారు.దాంతోపాటు ఎల్లారెడ్డి హైదరాబాదు వెళ్లే పోచారం ప్రధాన బ్రిడ్జిపై నుండి పెద్ద ఎత్తున వరద ప్రవహించి ఇరువైపులా రోడ్డు పూర్తిగా దెబ్బతింది.నాగిరెడ్డిపేట్ మండలం చుట్టూ గ్రామాలు పోచారం, వదల్పర్తి, మాల్తు మ్మెద, చినూర్, వాడి,గోలి లింగాల ,బంజారా, నాగిరెడ్డి పేట గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి.ఎటు చూసినా కనుచూపు మేరలో సముద్రం మాదిరిగా అలల రూపంలో నీటి ప్రవాహం పరుగులు తీసింది.మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రాకపోకలు స్తంభించాయి. సుమారు వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి.గురువారం కొంతమేర పోచారం ప్రాజెక్టులోనికి నీటి ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టుకు గండిపడిన వైపు నుండి నీటి ప్రవాహం తగ్గడంతో మండల ప్రజలు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అంత పెద్ద గండిపడి సామర్థ్యాన్ని మించి నీటి ప్రభావం ప్రవహించినప్పటికీ పోచారం ప్రా జెక్టు చెక్కుచెదరకుండా ప్రతిష్టంగా ఉండడంతో మండల రైతులు,నాయకులు ఆచార్యానికిలోనయ్యారు.



పోచారం ప్రాజెక్టు లోపటి నుండి నిర్మించిన టువంటి పునాదులను చూసి ఆచార్యపోయారు. పోచారం ప్రాజెక్టు ఇంత చరిత్ర ఇంత ప్రతిష్టత్మకంగా ఉండడంతో ఎంతో గొప్ప విషయం అన్నారు.కానీ ప్రాజెక్టు ఎత్తు గురించి స్థానిక నాయకులు రైతులు పలు పలుసార్లు ప్రభుత్వాల సృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరు స్పందించలేరని బాధపడ్డారు.ఎన్నో ప్రభుత్వాలు మారాయి కానీ ప్రాజెక్టు ఎత్తును పెంచలేకపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ప్రాజెక్టు ఎత్తును ఐదు ఫీట్లకు పెంచాలని స్థానిక నాయకులు రైతులు కోరుతున్నారు.గతంలో ప్రాజెక్టును ఎత్తు ఐదు ఫీట్లు పెంచుంటే ఇలాంటి ప్రభావం రాకుండేదని అంటున్నారు.

# డిజాస్టర్ అధికారులు అప్రమత్తం

- కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో భారీ వర్షాలపై సమీక్ష




**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** కురుస్తున్న భారీ వర్షాల పట్ల నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్, డిజాస్టర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కురుస్తున్న భారీ వర్షాల పై సుదీర్ఘంగా చర్చించి నగర వ్యాప్తంగా ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డీఆర్ఎఫ్ బృందాలు తగిన పరికరాలతో సిద్ధంగా ఉండి షిఫ్టుల వారిగా సహాయక విధులు నిర్వర్తించాలని అన్నారు. ఇంజనీరింగ్, సానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీజాస్టర్ అధికారులు అలర్ట్‌గా ఉండి విధుల్లో నిమగ్నం కావాలని, ఇంజనీరింగ్ విభాగం అధికారులు జేసిబి యంత్రాలతో పాటు ఇతర వాహానాలను సిద్ధం చేసోవాలని అన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని అన్నారు. మెప్మా అధికార సిబ్బంది సమన్వయంతో నగర వాప్తంగా రోడ్ల పై ఉండే నిరాశ్రయులను గుర్తించిని నైట్ షెల్టర్‌కు తరలించేలా చూడాలన్నారు. ప్రధాన డ్రైనేజీ చాంబర్స్ వద్ద బ్లాకేజీలు లేకుండ చూడాలని డ్రైనేజీ కనెక్టివిటీ ఉన్న చోట చెత పేరుకోకుండా చూడాలని అన్నారు.

## వరదలో చిక్కుకున్న గర్భవతిని జెసిబితో రక్షించిన రామాజీపేట యువత!



**రాయికల్ ఆగస్టు 28(జనంసాక్షి):** రాయికల్ మండలం మంఖ్యా నాయక్ తండా ఒడ్డె లింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ కల్యాణికి పురిటి నొప్పులు రాగా అత్యవసర వైద్యం కోసం హాస్పిటల్ కి తరలిస్తుండగా రాయికల్ వచ్చే మార్గంలో రామాజీపేట శివారులో బ్రిడ్జి పై నుండి వరద అధికంగా ఉండటం తో దాటలేని పరిస్థితులలో రామాజీపేట యువత ఆలోచనతో జెసిబి తెప్పించి వారిని బ్రిడ్జి దాటించారు. అక్కడి నుండి అంబులెన్స్‌లో అంబులెన్సు ద్వారా హాస్పిటల్‌కి తరలించారు.కాగా స్థానిక యువత చూపిన చిత్తశుద్ధి, సమయస్ఫూర్తి చూసి స్థానికులు, గ్రామస్థులు వారిని ప్రశంశించారు.

## పవిత్ర మదీనాలో ఉమ్రా యాత్రికుల పర్యటన శుభ సూచకం

**ఖమ్మం ఆగస్టు 28 (జనంసాక్షి):** ప్రపంచ మానవాళి ఆఖరి ప్రవక్త మహమ్మద్ (స) పుట్టినరోజు సెప్టెంబర్ 5 తేదీ మన దేశంలో కాగా సౌదీ అరేబియా దేశంలో ఒకరోజు ముందుకు నాలుగవ తేదీ.. ఆయన పుట్టిన రోజు, నేడు హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్పోర్ట్ ద్వారా బయలుదేరిన ఉమ్రా యాత్రికుల బృందం.. ప్రవక్త పుట్టినరోజు నాడే పవిత్ర నగరం మదీనాలో పర్యటించనుండటం శుభసూచకమని వైకె టూర్స్ అండ్ ట్రావెల్స్ స్పెషలిస్ట్ ఉమ్రా అండ్ హజ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్. అబ్దుల్లా అన్నారు. శంషాబాద్ ఎయిర్పోర్టు నుండి మి లా దుల్ నబీ (మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు) సెప్టెంబర్ 4వ తేదీ కాగా అదే రోజు ఈ ఉమ్రా యాత్రకు బృందం ఆయన పుట్టిన పవిత్ర ప్రదేశం మదీనాలో పర్యటించనుండటం శుభసూచకం, ఈ సందర్భంగా చెప్పిన విధివిధానాలను యాత్రికులు తప్పనిసరిగా అనుసరించాలని ఆకాంక్షించారు. మక్కా మదీనాలో యాత్రికులు ఆయా ప్రదేశాల పవిత్రతను కాపాడుతూ,, విధానాలను అనుస రిస్తూ..



మన దేశం ,మన రాష్ట్రం, ప్రపంచ మానవాళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. 25 సంవత్సరాల తమ సర్వీసెస్ యాత్రికుల పర్యటనకు సేవా దృక్పథంతో తక్కువ ధరలో ఏర్పాట్లు చేస్తుంద న్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ సర్వీసెస్ ఉమ్రా, హజ్ యాత్రలకు ప్రత్యేక శ్రద్ధతో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తవాఫ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ నుండి మరో బృందం ఉమ్రా యాత్రకు బయలుదేరింది. ఈ సందర్భంగా నిర్వాహకులు హఫీజ్ మొహమ్మద్ జవ్వాద్ అహ్మద్ పాల్గొని యాత్రికులకు శుభాకాంక్షలు ప్రకటించారు.

## కామారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లాలో వరద పరిస్థితులపై జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, కలెక్టర్, ఎస్పీతో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు జిల్లాలోని వర్షాల తీవ్రత, వరద ఉధృతి, నష్టపరిస్థి తులపై మంత్రికి వివరాలు అందించారు. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, ఎలాంటి అప్రమత్తత లోపం జరగకుండా చూడాల ని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగిం చాలని ఆదేశాలు జారీ చేశారు.



విద్యుత్, వ్యవసాయ, మంచినీటిసరఫరా,పంచాయతీరా0జ్ శాఖలు తక్షణం నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలి. వాతావరణం అనుకూలించగానే స్వయంగా జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

## బ్రిడ్జీల ప్రాంతాల్లో మంత్రి అడ్లూరి పర్యటన



**జగిత్యాల బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలో నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.అధికారులు ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు సత్వరమే స్పందించాలని ఆదేశించారు. ఎలాంటి ఆస్తి ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వస్తున్న భారీ వరద దృష్ట్యా గురువారం ధర్మపురి గోదావరి నది, ధర్మపురి మండలం నేరెళ్లలో జగిత్యాల మండలం అనంతారం బ్రిడ్జి రాయికల్ మండలం రామోజీపేట బ్రిడ్జి ఇటిక్యాలలో లెవెల్ బ్రిడ్జిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.

ఈ కార్యక్ర మంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, నీటిపారుదల శాఖ అధికారులు మున్సిపల్ కమిషనర్ ఎంపీడీవో తహసీల్దారులు, పోలీస్ సిబ్బంది సిఐఎస్ఐ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు ఉచితంగా ఎలక్ట్రిక్ ఆటోలు అందజేసిన కేంద్ర మంత్రి బండి

### 2 నెలలు ప్రత్యేక శిక్షణనిచ్చి డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) :** మహిళలు ఏ రంగంలోనూ తక్కువ కాదని, అవకాశమిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఏ ఇంట్లోనైతే మహిళలకు ఇంటి తాళం చెవి అప్పగిస్తారో ఆ ఇల్లు బాగుపడుతుందని మన ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ 50 లక్షల 65 వేల కోట్ల రూపాయల దేశ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతిలో పెట్టడంవల్లే ఆర్థిక ప్రగతిలో మన దేశం పరుగులు పెడుతోందని 11వ స్థానం నుండి 4వ స్థానానికి చేరుకుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. బుధవారం రోజు మధ్యాహ్నం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద 15 మంది నిరుపేద మహిళలకు కాలుష్యరహితమైన ఎలక్ట్రిక్ ఆటోలను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కో ఆటో విలువ రూ.3.5 లక్షలు. ఈ ఆటో అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీతో తయారు చేశారు. స్టీల్ రూఫ్ తో తయారు చేసిన ఆటో డబుల్ స్పీకర్ ఎఫ్ఎం వంటి ఫీచర్లు ఉన్నాయని, పెట్రోల్/డీజిల్



ఆటోల ఖర్చుతో పోలి స్తే 70 నుండి 80 శాతం తక్కువ ఖర్చు ఆదా అవుతుందన్నారు. మెయింటెనెన్స్ చాలా తక్కువ, కార్పొరేట్ రెస్పాన్స్ బిలిటీ ఫండ్ (సీఆర్ఎఫ్) నిధులతో ఈ ఆటో లను కొనుగోలు చేసిన మంత్రి బండి సంజయ్ కుమార్ వాటిని నిరుపేద మహి ళలకు అందజేయడం గమనార్హం. 15 మంది మహిళల్లో 10 మందికిపైగా పీజీ, బీటెక్ విద్యను పూర్తి చేసిన వారే కావడం విశేషం. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో 15 మంది మహిళలకు 2 నెలలపాటు ఉచితంగా వ్వడంతోపాటు డ్రైవింగ్ లైసెన్సులు అందించిన అనంతరం బుద వారం ఆ మహిళలకు కలెక్టర్ పమేలా సత్పతి, మాజీ మేయర్ సునీల్ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బండి సంజయ్ ఆటోలను పంపిణీ చేశారు. కొద్ది సేపు బండి సంజయ్, ప్రయాణించారు.

## దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక క్యాంపు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జనంసాక్షి):** దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక క్యాంపు ఈ నెల 30న సిరిసిల్లలో, సెప్టెంబర్ 1న వేములవాడ మండల వనరుల కేంద్రం భవితా కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల కోసం ఆ లింకు సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కావలసిన పరి కరాల కోసం అసెస్మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారులు సదానందం, కిషన్ ప్రకటనలో తెలిపారు. వేములవాడ భవిత కేంద్రంలో ఐదు మండలాల దివ్యాంగ విద్యార్థులకు ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి వచ్చే దివ్యాంగ విద్యార్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదా య, కుల ధృవీకరణ,సదరం ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. జిల్లాలో ఆలింకో క్యాంపు రెండు రోజులు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ నెల 30న సిరిసిల్ల, తంగళ్ళ పల్లి, ముసాబాద్, గంభీరావుపేట ఇల్లంతకుంట, కోనరావు పేట, ఎల్లా రెడ్డి పేట, వీర్నపల్లి మండలాలకి సిరి సిల్ల భవిత కేంద్రంలో, సెప్టెంబర్ 1న వేములవాడ, వేములవాడ అర్బన్,రూరల్, బోయిన్పల్లి ,రుద్రంగి మండలాలకి వేములవాడ భవిత కేంద్రంలో క్యాంపు నిర్వహిం చనున్నారు. పూర్తివివరాలకు జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులను,భవిత కేంద్రాలను సంప్రదించగలరన్నారు.

# వరద ముప్పు తప్పించిన హైడ్రా

- ఊపిరి పీల్చుకున్న ఓయూ కాలనీ వాసులు
- హైడ్రా కమిషనర్‌కు స్థానికుల అభినందనలు

**హైదరాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి):** షేక్‌పేట డివిజన్‌లోని ఓయూ కాలనీలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పర్యటించారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన కాలనీలో.. వరద ముప్పును నివారిస్తూ చేపట్టిన కాలువల అనుసంధాన పనులను పర్యవేక్షించారు. ఓయూ కాలనీలోని ఆదిత్యా నగర్, రాహుల్‌నగర్, బృందావన్, సూర్యనగర్ కాలనీల మీదుగా సాగే వరద కాలువను మణికొండ మున్సిపాలిటీలోని ఆంబియన్స్ కోర్టు యార్డు గేటెడ్ కమ్యూనిటీ ముందు నుంచి వెళ్లే లైనుకు అనుసంధానం చేస్తూ చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రత్యేకంగా పైపు లైను వేసిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. షేక్‌పేట కొత్త చెరువు నుంచి ఆదిత్యనగర్ మీదుగా శాతం చెరువును అనుసంధానిస్తూ సాగే వరద నీటి కాలువ కబ్జాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని.. అవసరమైన చోట నాలా వాస్తవ వెడల్పు ఉండేలా చూడాలని సూచించారు. ఓయూ కాలనీలో వరద ముప్పును నివారించినందుకు గాను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను షేక్‌పేట కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ శాలువతో సన్మానించారు. అలాగే స్థానికులు కూడా



కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. హైడ్రా కమిషనర్ చొరవతో ఈ అనుసంధానం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. దీంతో తమకు వరద ముప్పు తప్పిందని పలువురు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 19 లో నాలాను ఆక్రమించినట్టు వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఇక్కడ నాలాను ఆక్రమించడమే కాకుండా. సెల్లార్ కోసం గుంత తవ్వి వెంటనే నిర్మాణ పనులు చేయకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లకు ఇబ్బందిగా పరిణమించిందన్న ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. నాలా ఆక్రమణను ఉపేక్షించేది లేదని. . ఇతరులకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతి న పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## గ్రేటర్ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు



**హైదరాబాద్, ఆగస్టు28 (జనంసాక్షి):** గణేష్ ప్రతి మల నిమజ్జన కార్యక్రమం సాఫీగా, వేగంగా జరిగేలా చూసేందుకు జీహెచ్ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి నిమజ్జన పాండ్ వద్ద ఒక ఇంచార్జీ అధికారి సర్కిల్‌కు నోడల్ అధికారితో పాటు ఓవరాల్ ఇంచార్జీగా సంబంధిత డిప్యూటీ కమీషనర్, శాని టేషన్ సిబ్బంది సరిపోను క్రేన్లు, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, ఎప్పటి కప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందితో పాటుగా వాహనాలను ఏర్పా టు చేసి సాఫీగా నిమజ్జనం జరి గేలా సిబ్బంది మూడు షిఫ్ట్ లలో పని చేస్తారు నిరంతర విద్యుత్ సరఫరా త్రాగునీటి వసతి ఏర్పాటు చేయనున్నారు. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు సహా 20 ప్రధాన చెరువులతో పాటు ఈ 74 కృత్రి మ కుంటలలో నిమజ్జనం జరుగనుంది. తద్వారా ప్రధాన చెరువులపై ఒత్తిడి తగ్గించడమే కాకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీ పంలో గణేష్ విగ్రహాల నిమ జ్జనకు ప్రజల సౌకర్యం కోసం విస్తృతంగా కృత్రిమ నిమజ్జన పాండ్ లను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసింది.

## మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 28 (జనంసాక్షి):** మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలకు కోటీశ్వరులు చేయాలనే దృఢ సంకల్పంతో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగా స్వయం సహాయక మహిళ సంఘాల వారి వివిధ రకాల ఉత్పత్తులను ప్రోత్సహించుటకు గాను మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. వరంగల్ పరిధి కి సంబంధించి కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం లో గ్రౌండ్ ఫ్లోర్ లో గల 5 గదులను పునరుద్ధరించి, నవికరించి మహిళ మార్ట్ త్వరిత గతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపిలు ఖలీల్ ప్రశాంత్ ఇంచార్జి ఈఈ సంతోష్ బాబు, సూపరిండెంట్ హబీబ్, ఆర్ఓ షెహజాది బేగం,టిపిఎస్‌లు అనిల్ శ్రీకాంత్, ఏ ఈ హబీబ్ పాల్గొన్నారు.

## ముంపు గ్రామాలను అన్ని విధాలా ఆదుకుంటాం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 28 (జనంసాక్షి) :** జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన గ్రామాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం సందర్శించారు. వరద నీటి ఉధృతి వల్ల ముత్యాల చెరువు తెగిపోవడంతో ధర్పల్లి మండలం వాడి గ్రామంతో పాటు నడిమి తండా, బీరప్ప తండాలు ముంపునకు గురయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే సహాయక చర్యలకు ఆదేశించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సీ.పీతో కలిసి వాడి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో వరద తాకిడికి గురైన ప్రాంతాలలో ఎమ్మెల్యేతో కలిసి పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ముంపు బాధిత కుటుంబాలకు ఆశ్రయం కల్పించిన ఒన్నాజి పేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ముంపు బాధితులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఎలాంటి భయాందోళ నలకు గురి కావద్దని, ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ఆదుకుం టామని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే, కలెక్టర్ భరోసా కల్పించారు. రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, రక్షిత మంచి నీరు అందుబాటులో ఉంచామని అన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) :** విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు గొప్ప అనుభూతినిస్తాయని భక్తి పారవశ్యాన్ని పెంపొందిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసినటువంటి గణపతి మండపాలలో మట్టి గణపతులను ప్రతిష్ఠించి మొదటి రోజు పూజలో పాల్గొన్నారు. వినాయకుని పూజ చేయడం వలన సకల శుభాలతో పాటు అడ్డంకులు తొలగిపోతాయని, విజయాలను అందజేస్తుందని వారు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు మన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం చాలా ఉత్సాహంగా కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల నడుమ జరుపుకోవడం గొప్ప విషయమని తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం పర్యావరణ హితంగా, పర్యావరణానికి మేలు కలిగించే విధంగా మట్టి గణపతులను ప్రతిష్టించడం జరిగినదని వారు గుర్తు చేస్తూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా మెదిలి వనరుల సంరక్షణకు



ముందంజలో ఉండాలని కోరారు. మొదటి రోజు పూజలో భాగంగా నవగ్రహ పూజ, కలశ స్థాపన, గౌరీ పూజ, సకల దేవత ఆరాధన చేసి స్వామి వారి నవరాత్రుల శోభయమానంగా ఘనంగా ప్రారంభించారు. ఈ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు వివిధ రకాల పూజలతో స్వామివారిని కొలవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొంబాయిగూడెం వాగులో చిక్కుకున్న అధికారులు

**మంగపేట ఆగస్ట్ 28(జనంసాక్షి):** ఇందిర సౌర గిరిజల పథకంలో భాగంగా గిరిజనుల ఆర్ఓఎస్ఆర్ పట్టా భూముల్లో బోర్లు వేసేందుకు సర్వేకు వెళ్లిన అధికారులు కొత్తూరు మోట్లగూడెం, బొంబాయిగూడెం గ్రామాల మధ్యనున్న గౌరారం వాగు ఎగువన కురిసిన భారీ వర్షాలకు సైతం బుధవారం ఒక్కసారి ఉదృతంగా రావడంతో సాయంత్రం తిరుగు ప్రయాణంలో వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని 42మంది గిరిజన రైతులకు ప్రభుత్వం ఐటీడీఏ ఏటూరు నాగారం నుంచి ఇందిర సౌర గిరిజల పథకంలో ఒక్కో రైతుకు హెక్టారు భూమిలో బోరు వేయ డానికి నిధులు మంజూరు చేసింది.



ఈ క్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు కావేరి, సౌజన్య, పవన్, సెక్షన్ అధికారి సుజాత, పంచాయతీ సెక్రటరీ సాహెబ్ పాషా బొమ్మాయి గూడెం లోని ఆర్ఓఎఫ్ఆర్ భూములను సర్వేకు బుధవారం కొత్తూరు మొట్లగూ డెం బొమ్మాయిగూడెం మధ్య ఉన్న గౌరారం వాగు దాటి వెళ్లారు. సర్వే చేస్తున్న క్రమంలో భారీ వర్షం కురిసింది. అక్కడి గిరిజన గ్రామస్తులు గౌరారం లోకి దిగి ప్రవాహంలో కొట్టుకు పోతు న్న అధికారులను పట్టుకొని దాటించారు.

## సింగరేణిలో సీఎంపిఎఫ్, పెన్షన్ సేవలు మరింత సులభం


**భూపాలపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):** సింగరేణిలో జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులకు త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ అన్నారు. భూపాలపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎంపిఎఫ్, పెన్షన్‌కి సంబంధించిన లావాదేవిలు అన్నీ సి – కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయి.బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్‌గా సీఎంపిఎఫ్, పెన్షన్ కి సంబండిచిన క్లైమ్స్‌ను సెటిల్ చేస్తున్నాం . ఈ సమావేశంలో ఏజిఎం సివిల్ రవికుమార్, పాల్గొన్నారు.

## నీటమునిగిన నిర్మల్



**నిర్మల్ టౌన్,ఆగస్టు 28 (జనంసాక్షి):** నిర్మల్ పట్టణంలో బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు.భారీ వర్షాల కారణంగా పట్టణంలో ముంపుకు గురైన పలు ప్రాంతాల్లో పర్యటించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.పట్టణంలోని సోఫీ నగర్,శివాజీ చౌక్,బోయవాడ, మంజులాపూర్ కాలనీల్లో పర్యటించారు. అధికారులకు ఆదేశించి పట్టణంలోని వరద నీటి సమస్యలపై పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా, ఆపట్టణ, మండల బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సన్నాహాలు





## సెప్టెంబర్ మొదటి వారంలో స్థానిక ఎన్నికల షెడ్యూల్!

### ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ.. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు

*తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది! సెప్టెంబర్ మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటనతో, గ్రామీణ ప్రజల ఆశలు మరింత బలపడుతున్నాయి. ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలతో గ్రామాల్లో నూతన నాయకత్వం ఆవిర్భవించనుంది. ఈ ఎన్నికలు కేవలం ఓట్ల లెక్కలు మాత్రమే కాదుబీ ప్రజల ఆకాంక్షలు, గ్రామీణ అభివృద్ధి కలలకు ఊపిరి పోసే అవకాశం. బీసీలకు 42% రిజర్వేషన్ల నిర్ణయం సామాజిక న్యాయానికి నిదర్శనం, అయితే న్యాయపరమైన సవాళ్ల భయం ఉన్నప్పటికీ, ప్రభుత్వం సంకల్పం అచంచలం. సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితా ప్రకటనతో, రాష్ట్ర ఎన్నికల సంఘం వేగంగా అడుగులు వేస్తోంది. గత ఏడాదిన్నరగా నిలిచిన రూ.2,600 కోట్ల నిధులు, పాలకవర్గాల లేకపోవడంతో గ్రామాలు ఎదుర్కొన్న ఇబ్బందులుఇవన్నీ ఈ ఎన్నికలతో ముగియనున్నాయి. ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి, గ్రామీణ ఆత్మగౌరవానికి కొత్త దిశను చూపనుంది!*

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించనున్నారు.ఆ తదుపరి సర్పంచ్ ఎన్నికల నిర్వహించే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. బిసిరిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో ఇవ్వాలని భావిస్తున్న ప్రభుత్వం దానిపై ఎవరైనా కోర్టుకు వెళ్తే ఎన్నికలు ఆగిపోతే, పార్టీ పరంగా ఇవ్వాలని నిర్ణయం చేసినట్టు సమాచారం.ఎన్నికల ప్రక్రియను స్పీడప్ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబ ర్ 2న ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలను వచ్చే నెలలోనే నిర్వహిం చేందు కు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం సెప్టెంబర్ మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. కేబినెట్ సమావేశం లో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రభుత్వం నుంచి అందిన సంకేతాలతో గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాల సవరణ, తుది జాబితా ప్రచురణకు సంబం ధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు.స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఏడాదిన్నర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తూవచ్చింది. కానీ, అసెంబ్లీలో ఆమోదించి పంపిన బీసీ బిల్లులు. పం చాయతీరాజ్ చట్టం 2018 కి చేసిన సవరణ ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో పడింది.బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ కు సుప్రీంకోర్టు విధించిన గడువు కేసు విచారణకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వం తన అభి ప్రాయాన్ని వెల్లడించింది. కానీ, ఆ కేసు ఎప్పటి వరకు కొన సాగుతుందో తెలియదు.సేప్టెంబర్ 30 లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతున్నది.

**పాలకవర్గాలు లేక గ్రామాల్లో ఇబ్బందులు..**
పంచాయతీల్లో పాలక వర్గాలు లేక పోవడంతో పలు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ఏడాదిన్నర నుంచి ఫైనాన్స్ కమిషన్ నుంచి గ్రామాలకు రావాల్సిన రూ.2,600కోట్లకు పైగా నిధులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చివరి ప్రయత్నంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో ఇవ్వాలని ఆలోచనలో ఉంది.ఒకవేళ దానిపై ఎవరైనా కోర్టుకు వెళ్తే అది ఆగిపోతే, అధికార పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి, మిగతా పార్టీలు కూడా అమలు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో అప్పీల్ చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే బీజేపీ కూడా పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది.

**వారం వ్యవధిలో..**
స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఆ తర్వాత వారం వ్యవధిలోనే సర్పంచ్ ఎన్నికలు జరిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కనీసం 30 నుంచి 35 రోజుల సమయం పడుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వర్గాలు వెల్లడించాయి.సెప్టెంబర్ చివరి వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఆ తర్వాత అక్టోబర్ మొదటి వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. సిబ్బందికి ఇప్పటికే ఎన్నికల శిక్షణ పూర్తయింది. మహారాష్ట్ర, గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులు రాష్ట్రానికి చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి ఆ జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇస్తే దాని ప్రకారం షెడ్యూల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

**సెప్టెంబర్ 2న ఓటరు తుది జాబితా...**
రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎప్పుడు ప్రకటన వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం రెడీ అయింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాల సవరణ, ప్రచురణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాలు, ఎంపీటీసీల పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మున్సిపాల్టీలను ప్రకటించడంతో 71 పంచాయతీలు మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థల్లో విలీనమయ్యాయి. దీంతో పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాలో మార్పులు చోటుచేకున్నాయి. దీనికితోడు 18 ఏండ్లు నిండినవారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడంతో ఓటర్ల సంఖ్యలో కూడా తేడాలు వచ్చాయి. చనిపోయినవారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించారు.తాజాగా ఓటరు జాబితా,పోలింగ్ స్టేషన్ల వివరాలను రూపొందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నెల 28 న వార్డుల వారీగా ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. 29న జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు, 30న మండల స్థాయి ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. గ్రామీణ,అసెంబ్లీ ఓటర్లను వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలోకి సర్దుబాటు చేయడంపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 నుంచి 30 వరకు స్వీకరిస్తారు. ఈ అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఈ నెల 31 లోపు పరిష్కరిస్తారు.సెప్టెంబర్ 2 ఓటరు తుది జాబితా ప్రకటిస్తారు.

**12,760 పంచాయతీలు, 5,763 ఎంపీటీసీలకు..**
రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీలు, జడ్పీల లెక్క తేలింది. ప్రస్తుతం 12,760 పంచాయతీలు ఉండగా 1,12,534 వార్డులున్నాయి.5,763 ఎంపీటీసీ స్థానాలుండగా 565 ఎంపీపీ, జెడ్పీటీసీలు, 31 జడ్పీలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు జరగనున్నాయి. 2019లో 12,848 పంచాయతీలకు ఎన్నికలు జరగగా ప్రస్తుతం వాటి సంఖ్య 12,760కు చేరింది.2019లో గ్రామాల వార్డులు 1,13,136 ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 1,12,534 కు చేరింది. 2019 ఎన్నికల్లో ఎంపీటీసీ స్థానాలు 5,817 ఉండగా ప్రస్తుతం 5,763కు చేరింది. గతం కంటే 54 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఎంపీపీలు, జడ్పీటీసీలు 539 ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 565 కు చేరింది.గతం కంటే 26 వరకు ఎంపీపీలు, జడ్పీటీసీలు స్థానాలు పెరిగాయి.

# వరద వలయంలో టాక్లీ గ్రామం

### విపత్కర పరిస్థితుల్లో గ్రామ ప్రజలు

- గర్భిణినీ ఆసుపత్రికి తరలించడానికి వచ్చిన 108 అంబులెన్స్ వాహనం సహితం వరద ధాటికి గ్రామంలోనే



**బాసర, ఆగస్టు 28 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర మండలం లోని టాక్లి గ్రామం వరద వలయంలో చిక్కుకుంది. బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం టాక్లి గ్రామం చుట్టూ వరద నీరు ప్రవహించడంతో గ్రామ ప్రజలు విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి దంచి కొడుతున్న వానలకు గ్రామం చుట్టూ వరద ప్రమాదం పొంచి ఉంది. గ్రామంలోని శివాలయం, హనుమాన్ మందిర్ లో ఇప్పటికే వరద నీరు చేరింది. గ్రామ ప్రధాన వీధుల్లో వరద నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టికున్నట్టు భయాందోళన గురవుతున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలు ఇంటిలో నుంచి బయటికి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఎరకమైన సహాయ సహకారులకు నోచుకోకపోవడం చాలా బాధాకరం అని గ్రామ ప్రజలు అంటున్నారు.ఈరోజు ఉదయం గర్భిణీ స్త్రీని ఆసుపత్రికి తరలించడానికి 108 అంబులెన్స్ వాహనం టాక్లి గ్రామానికి వచ్చిన కొద్దిసేపటికి మార్గమధ్యంలో ఉన్న వరద ప్రభావం ఉధృతంగా ఉండడంతో ఏమీ తోచని అంబులెన్స్ సిబ్బంది వాహనంలోనే చికిత్సలు నిర్వహించి మహిళను సురక్షితంగా ఇంటికి చేర్చారు. కానీ వరద ప్రభావం ఎక్కువ ఉండడంతో వాహనం గ్రామంలోనే నిలిచిపోవడం చాలా బాధాకరమనీ గ్రామస్తులు అంటున్నారు. ఏదేమైనప్పటికీ సమయానికి 108 అంబులెన్స్ వాహనం వచ్చి మహిళను ఆసుపత్రికి చేర్చలేని పరిస్థితిలో గ్రామంలో అంబులెన్స్ వాహనంలోనే చికిత్స నిర్వహించడంతో పైలట్ శేఖర్, ఈఎంటి మాధవ్ ను గ్రామ ప్రజలు అభినందించారు. అయినప్పటికీ అంబులెన్స్ సిబ్బంది మాట్లాడుతూ 24 గంటలు ప్రజల సేవలో ఉందామనుకున్న సమయంలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో వాహనం గ్రామం నుంచి కదిలే పరిస్థితిలో లేనందున ఇతర గ్రామానికి వెళ్లి సహాయం చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని వారు బాధను వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు టాక్లి గ్రామం ప్రజల పట్ల ఇప్పుడున్న పరిస్థితుల్లో సహకరించాలని ఎప్పటికప్పుడు వరద ఉధృతిని తెలియజేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. గ్రామానికి చెందిన సంబంధిత అధికారులు గ్రామంలో లేనందున గ్రామ ప్రజలకు ఎలాంటి సమాచారం అందలేకపోతుందని అంటున్నారు. ఈపాటికి గ్రామం సముద్రంలో ఉన్న ఒక దీవిలా కనిపించడంతో గ్రామ ప్రజలు ఏ క్షణాన ఏం జరుగుతుందో అన్న భయాందోళనలో ఉన్నామని అంటున్నారు. ఆరోగ్య పరిస్థితులు సహకరించాలని ఆ భగవంతుడిని కోరడం తప్ప మాకు ఎలాంటి సహకారం దొరకదని అంటున్నారు. గత కొన్ని రోజుల క్రితం కురిసిన వానలకు రోడ్లు చెడిపోయి గ్రామం నుంచి బయటకు వెళ్లడానికి కూడా సరియైన రోడ్డు పనులు చేయకపోవడంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. ఇటీవలే గ్రామస్తులు రోడ్డు పనుల విషయమై ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి కూడా తీసుకెళ్లామని అన్నారు. ఇప్పటికైనా గ్రామానికి ఉన్న ఒకే ఒక మార్గములో వాగు పై ఉన్న వంతెన చిన్న చిన్న వర్షాలకే వంతెన పై నుంచి నీరు ప్రవహించడంతో ప్రమాదకరంగా మారిందని ఇప్పటికైనా దీన్ని పునర్నిర్మించి గ్రామ ప్రజలకు రోడ్డు సమస్యల వలయం నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



## కూలిన బురుజు... తప్పిన ప్రమాదం

**పెద్ద కొడప్గల్ ఆగస్టు 28 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని వడ్లం గ్రామంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాజుల కాలంలో నిర్మించిన శిథిలావస్థకు చేరుకున్న బురుజు గోడలు కూలి పోయాయి. కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణం నష్టం తప్పింది. బురుజు కూలి రోడ్డుపై పడడంతో అటుగా వెళ్లే కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# దగ్గరుండి పర్యవేక్షించి.. క్షేమంగా తరలించి

## కలెక్టర్, ఎస్పీ గ్రేట్ ఆఫీసర్స్..

### కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**గంభీరావుపేట ఆగస్టు 28 (జనం సాక్షి):**
గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారిని దగ్గరుండి పర్యవేక్షించి.. క్షేమంగా తరలించారు. ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారిని క్షేమంగా ఇంటికి తరలించే వరకు విశేష సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే గ్రేట్ ఆఫీసర్స్ అని కొనియాడి, వారికి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.
ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారి పరిస్థితి పై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు ఆరా తీశారు. వారికి సహాయం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ఉదయమే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేరుకొని క్షేమంగా చేరుకున్న వారిని పరామర్శించారు.ప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయి ఇబ్బంది పడుతున్నారనే విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే అక్కడికి చేరుకున్నారు.



బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు అక్కడే ఉన్నారు. లింగన్నపేట లో వాగులో చిక్కుకుపోయిన ప్రవీణ్ ను క్షేమంగా ఒడ్డుకు చేర్చే వరకు కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షించి.. ఎన్డీఆర్ ఎఫ్ బృందానికి సలహాలు సూచనలు అందించారు. గురువారం ఉదయమే మళ్లీ ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్దకు కలెక్టర్, ఎస్పీ చేరుకొని పరిస్థితిని ఎప్పటిక ప్పుడు గమనించారు. ప్రాజెక్టులో నీటి మట్టం, ఎగువ నుంచి ఎంత వస్తుందని ఆరా తీస్తూ.. ప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయిన వారికి మనోధైర్యం కల్పించారు. ఏడుగురు క్షేమంగా గమ్యం చేరుకోవడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన విషయం తెలిసి దగ్గరుండి అందరిని క్షేమంగా తరలించడంలో విశేష కృషి చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే గ్రేట్ ఆఫీసర్స్ అని, వారికి అధికార యంత్రాంగాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.

## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 40 వేలు చెల్లించాలి



**సదాశివనగర్ (జనంసాక్షి):** మల్లుపేట గ్రామం వద్ద మల్లుపేట వాగును పరిశీలిం చిన మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావు. గాంధారి బారాస అధ్యక్షుడు శివాజీ రావు. మండలం లోని పలుగ్రామాలు పరిశీలిస్తూ మల్లుపేట వాగు బాధిత రైతులతో కలిసి వారు పంటపొలాలను పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లా రైతాంగం అతలాకుతలమైంది. మునుపెన్నడూ లేని విధంగా అతివృష్టి కుంభవృష్టి వర్షం వల్ల చెరువులు కుంటలు పొంగిపొర్లి వేలాది ఎకరాలలో వరి పంట నీట మునిగింది. రైతులకు ఎకరానికి 40,000 పంట నష్టపరిహారం చెల్లించాలని ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న వారికి తాత్కాలికంగా నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కిష్టయ్య,గంగారెడ్డి, నరసయ్య హరీష్,గోవర్ధన్, లింగం కుండల నరసయ్య లక్ష్మీనారాయణ, ఆశయ్య హనుమాన్లు సాయిలు పాల్గొన్నారు.

*ఖైరతాబాద్ మహా గణనాయకుడి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అక్కడ తొలిపూజ చేశారు.*


## ఆగస్టు 29న రాష్ట్రపతి నిలయంలోకి ఉచిత ప్రవేశం

**బొల్లారం:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులు, క్రీడా ఔత్సాహికులకు రాష్ట్రపతి నిలయంలోకి శుక్రవారం ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారి రజినీ ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ప్రభుత్వం జారీచేసిన, జాతీయ, అంతర్జాతీయ కార్డును ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని వెల్లడించారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు తమ కుటుంబంతో సందర్శించేందుకు ఉచితప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మొబైల్ హియరింగ్ క్లినిక్ ఆవిష్కరణ



**హైదరాబాద్ :** సమగ్ర ఆరోగ్య సంరక్షణ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా, వికలాంగులను సాధికారత చేయడంలో కృషి చేస్తున్న అశ్రయ ఆకృతి అనే స్వచ్ఛంద సంస్థ, ఆప్టమ్ ఇండియాతో భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తూ అశ్రయ ఆకృతి మొబైల్ హియరింగ్ క్లినిక్‌ను ఆవిష్కరించింది. పూర్తిగా సకల సదుపాయాలతో సిద్ధమైన ఈ మొబైల్ యూనిట్, హైదరాబాద్‌లోని వెనుకబడిన వర్గాలకు నేరుగా చేరుకొని సమగ్ర చెవి-ముక్కు-గొంతు ఆరోగ్య సేవలను అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక వైద్య పరికరాలు, శ్రవణ పరీక్షలు, తొందరగా గుర్తింపు, సకాలంలో చికిత్సలు లాంటి కీలక సేవలు అందుబాటులోకి వస్తాయి. వెనుకబడిన సమాజాల గడప వద్దకే ఆరోగ్య సేవలను తీసుకెళ్లడం ద్వారా, ఈ మొబైల్ క్లినిక్ ఆరోగ్య లోటుపాట్లను పూడ్చి వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారి జీవిత నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మొబైల్ హియరింగ్ క్లినిక్ను అశ్రయ ఆకృతి వ్యవస్థాపకుడు డి.పి.కే. బాబు, ఆప్టమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఉమా రత్నం కృష్ణన్ కలిసి ఆప్టమ్ హైదరాబాద్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రారంభోత్సవం తోపాటు పలు కమ్యూనిటీ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించబడతాయి. వీటిలో లబ్ధిదారులు ఉచిత పరీక్షలు, నిపుణులైన ఈఎన్‌టి వైద్యుల సలహాలు పొందవచ్చు.





# జలాశయాలకు జలకళ

### ఉప్పొంగిన ఎగువ మానేరు

- మిడ్ మానేరుకు పోటెత్తిన వరద
- ఎల్ఎండికి 23280 క్యూసెక్కుల నీటి విడుదల

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జనంసాక్షి) :**
ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు రాజన్న సిరిసిల్లబీజిల్లాలోని జలాశయాలు జలకళను సంతరించుకొన్నాయి. గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువ మానేరు ప్రాజెక్టుకు మెదక్ జిల్లాలోని కూడేలి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు నుంచి వరద నీరు బారీగా వచ్చి చేరింది. ఎగువ మానేరు కు 77457 క్యూసెక్కుల నీరు రావడంతో సుమారు ఆరు ఫీట్లు మీదుగా నీరు మానేరు వాగు లోకి ఉరకాలేసింది. మిడ్ మానేరు ప్రాజెక్టు లోకి అటు ఎస్సారెస్పీ నుంచి వరుద కాలువ ద్వారా 16635 క్యూసెక్కులు, ఎల్లంపల్లి నుంచి 2360 క్యూసెక్కుల వరద కాలువ ద్వారా నీరు వస్తుంది. దీనికి తోడు ఎగువ మానేరు నుంచి 75375 క్యూసెక్కుల బారీగా వరద నీరు వస్తుంది.

ఈ క్రమంలో మిడ్ మానేర్ ప్రాజెక్టు 18 గేట్లను ఎత్తి దిగువన ఎల్ఎండి జలాశయానికి 23280 క్యూసెక్కులు వదులుతున్నారు. ఇదే సమయంలో అన్నపూర్ణ జలాశయానికి 9600 క్యూసెక్కులు తరలిస్తున్నారు. ఎడమ కాలువకు 5 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా పూర్తి సామర్థ్యం నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 27.55 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.26 టీఎంసీల నీరు నిలువ ఉంది .



# భారీ వర్షంలో... గర్భవతిని గట్టెక్కించారు


**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 28 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా బాన్సువాడ సమీపంలో గల కృష్ణ నగర్ తండా దగ్గరలోని కెనాల్ రోడ్ లో మూడు కిలోమీటర్ల దూరం లోపల ఉన్న కన్నయ్య తండా కి చెందిన పాల్వంత (రెండవ కాన్పు) ఉండగా తీవ్రమైన పురిటి నొప్పులు రావడంతో 108 కి కాల్ చేయగా, వెంటనే 108 సిబ్బంది కెనాల్ వరకు వెళ్లి, వర్షాబావ పరిస్థితి ఉన్నందున చాలా జాగ్రత్తగా కెనాల్ పై నుండి మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న కన్నయ్య తాండకు వెళ్లి పాల్వంతను దగ్గరలో ఉన్న బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ మాత శిశుసంరక్షణ ఆసుపత్రికి తరలించారు. అతి భారీ వర్షంలో ధైర్య సాహసంతో మా తాండకు వచ్చినందుకు, కుటుంబ సభ్యులు 108 సిబ్బంది ఈఎంటి ప్రసాద్ మరియు పైలెట్ శ్రీకాంత్‌లను అభినందించారు. అనంతరం ఈఎంటి ప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి భారీ వర్షాభావ పరిస్థితులు ఉన్నా 108కి కాల్ చేసి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
29 ఆగస్టు 2025

# తెలుగు రాష్ట్ర పార్టీల దారెటూ..?



## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటెందుకు వేయరు..!!



- తెలుగువాడంటూ వెంకయ్యనాయుడికి మద్దతిచ్చిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ, బీఆర్ఎస్.. జస్టిస్ బిఎస్ రెడ్డి విషయంలో ఏమంటారు?
- రాజకీయ పార్టీల వైఖరిని నిశితంగా పరిశీలిస్తున్న పౌర సమాజం
- అభ్యర్థి రాజకీయ పార్టీ సభ్యుడు కాకపోయినా అభ్యంతరమెందుకు..?
- యూరియా బస్తాలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అసలు లింకుందా..?
- భవిష్యత్తులో ఇక తెలుగువాడి ఆత్మగౌరవ నినాదం వాడబోరా..?

" ఆయన దేశం గర్వించదగ్గ న్యాయ శాస్త్రవేత్త.. సమాజానికి ఎన్నో వెలుగుదారులు చూపిన మార్గదర్శి.. రాజకీయాలు, పార్టీలకతీతంగా రాజ్యాంగపు విలువలూ, హక్కులను ప్రజలందరికీ పారదర్శకంగా అందించేందుకు ఐదు దశాబ్దాలపైగా సేవలందించిన నిపుణుడు. తెలుగు గడ్డ గర్వించదగినవారిలో ఒకరు..! అటువంటి నిఖార్సయిన తెలంగాణ తెలుగు బిడ్డను ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోవాల్సిన చారిత్రక సందర్భం గొప్ప అవకాశం. ఇప్పటికే దేశంలోని విద్యావంతులు, మేధావులు ఆయన అభ్యర్థిత్వాన్ని స్వాగతించడం ముదావహం. దరిమిలా నాడు పీవీ నరసింహారావు విషయంలో ఎన్టీఆర్ చూపిన వారసత్వానికీ.. మొన్న వెంకయ్యనాయుడి విషయంలో తెలుగు బిడ్డ అనే స్ఫూర్తికీ కట్టుబడిన పార్టీలు, ఇప్పుడు తెలంగాణ తెలుగు బిడ్డకు దక్కిన అవకాశానికి మద్దతు పలకాలనే అభిప్రాయం బలంగా వినబడుతోంది. ప్రత్యర్థితో పోలిస్తే రాజ్యాంగంపై అవగాహనలోనైనా, ఉపరాష్ట్రపతి పదవికి తీసుకొచ్చే హుందాతనం విషయంలోనైనా ఇండియా కూటమి అభ్యర్థి, తెలుగు బిడ్డ, జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి అన్ని అర్హతలున్నవారు. ఏ రాజకీయ పార్టీతోనూ, ఎలాంటి రాజకీయాలతోనూ సంబంధం లేని ఆయన తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక..!

**జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి, ఆగస్ట్ 28 :**

ఓట్ చోరీ ఉదంతాలు బహిర్గతమైన తరుణంలో జరుగుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక దేశవ్యాప్తంగా ఆసక్తిగా మారింది. ఇదొక భావజాల యుద్ధంగా అభివర్ణిస్తున్న నేపథ్యంలో తెలుగు గడ్డ నుంచి జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో నిలవడం తెలుగు ప్రజల ఆత్మగౌరవమనే భావన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో రాజకీయాలకతీతమైన వ్యక్తిగా ఆయనను బలపరచాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఏకగ్రీవ అంగీకారం తెలపగా.. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ నుంచి పలు పార్టీల ఎంపీలందరూ తెలంగాణ తెలుగు బిడ్డకు మద్దతు పలకాల్సిన అవసరం ఏర్పడింది. తెలుగువాడి ఆత్మగౌరవంతో పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు 'తెలుగు' సూత్రానికి కట్టుబడ్డారు. 1991లో కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా నంద్యాల నుంచి పోటీచేసిన పీవీ నరసింహారావుపై పోటీగా నిలబెట్టడం లేదని ప్రకటించి తెలుగువాడి ఆత్మగౌరవమే ముఖ్యమని చాటారు. దేశంలో అత్యున్నత రెండో పదవి ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంలోనూ అడుగడుగునా తెలంగాణను రాజ్యసభలో అడ్డుకున్న వెంకయ్య నాయుడికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపి తెలుగు గడ్డ ఔన్నత్యాన్ని నిలబెట్టారు. పెప్పర్ స్ప్రే ఘాటును భరించి లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ తెలంగాణ బిల్లును ఆమోదించగా.. తదనంతరం ఆమెపైనే ఎన్డీయే అభ్యర్థి వెంకయ్య నాయుడు పోటీలో ఉన్నప్పటికీ తెలుగు బిడ్డని బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. మరిప్పుడు జస్టిస్ సుదర్శన్ రెడ్డి విషయంలోనూ ఈ 'తెలుగు' స్ఫూర్తి వర్తించదా.. తెలుగు అంటే ఒక్క ఆంధ్రాకే చెల్లుతుందా అనే ప్రశ్నలు మొదలయ్యాయి.

### తెలుగువాళ్లు ఏకమవ్వాల్సిన తరుణం

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థితో పోలిస్తే ఏ రకంగానూ ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తక్కువకాదు. పైగా రాజ్యాంగంపై అవగాహన కలిగి వ్యక్తి. ఈ అత్యున్నత విలువల వారసత్వాన్ని కొనసాగించేందుకు అన్నివిధాలా సమర్థుడైన అర్హుడు. ఈ నేపథ్యంలో తెలుగు గడ్డపై ఉన్న అన్ని పార్టీలు మద్దతు తెలపాలని మేధావులు భావిస్తున్నారు. ఎన్డీయే అభ్యర్థి తమిళ బిడ్డ, తమిళ ఎంపీలందరూ మద్దతు తెలపాలంటూ బీజేపీ పెద్దలే అభ్యర్థిస్తున్నప్పుడు.. తెలుగు ఎంపీలందరూ ఒక్కతాటిపై ఉండి గత వారసత్వాన్ని పునరావృతం చేయాల్సిన బాధ్యత ఉంది. ఏపీ సీఎం చంద్రబాబు సైతం తెలుగు ప్రజల ఖ్యాతిని పెంచడమే లక్ష్యంగా ప్రకటించుకున్నట్టుగా.. తెలుగు ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతివ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ధర్మపోరాట దీక్ష చేసిన ఆయన.. ఈ ఎన్నికల్లో తన చిత్తశుద్ధిని చాటుకోవాలని తెలుగు రాష్ట్రాల పౌరసమాజం ఆశిస్తోంది. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం.. యూరియా ఇచ్చేవారికే మద్దతిస్తామని ప్రకటించడం గమనార్హం. రాజకీయాలుంటాయ్.. మారుతాయ్.. కానీ తెలుగు బిడ్డ బి సుదర్శన్ రెడ్డికి మద్దతు చరిత్రలో మిగిలిపోయే అంశం. రెండు రాష్ట్రాల్లోని అరవై మంది ఎంపీలు బీఎస్ రెడ్డికి మద్దతిచ్చి ప్రజాస్వామ్యాన్ని బతికించాలని ఇప్పటికే సీఎం రేవంత్ పిలుపునివ్వడం ముదావహం. ఇక బీఆర్ఎస్ దారెటో కూడా సమయస్ఫూర్తితో ఆలోచించుకోవాల్సిన తరుణమిదే..!

## వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన ఆర్మీ



**కరీంనగర్, ఆగస్ట్ 28 (జనంసాక్షి) :** సిరిసిల్ల జిల్లాలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని ఆర్మీ సిబ్బంది రక్షించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టుకు అవతలివైపు పశువులను మేపేందుకు బుధవారం ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. ఒక్కసారిగా వరద రావడంతో వారంతా అక్కడే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి రెండు హెలికాప్టర్లను తెప్పించారు. ఈక్రమంలో వరదలో చిక్కుకున్న వారిని గురువారం ఆర్మీ అధికారులు రెండు హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. సహాయక చర్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.

## ఎన్‌హెచ్ 44పై రాకపోకలపై ఆంక్షలు

- భారీ వర్షలతో పలుచోట్ల కొట్టుకుపోయిన రోడ్డు
- వాహనాలను దారి మళ్లించినట్లు ట్రాఫిక్ డిసిపి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల 44వ నంబర్ జాతీయ రహదారి దెబ్బతింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44 వైపు వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద మళ్లిస్తున్నట్లు- పేర్కొన్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలని గజరావ్ భూపాల్ సూచించారు. పోలీసులకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మళ్లింపు మార్గాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ప్రయాణికులకు సహాయం కోసం ట్రాఫిక్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారి ధ్వంసమైందని.. దీంతో 25 శాతం రాకపోకలు మాత్రమే జరుగుతున్నట్లు- ఆ జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు మేడ్చల్-రామాయంపేట్-కామారెడ్డి-డిచ్‌పల్లి మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. భారీ వాహనాలను మేడ్చల్ వద్ద.. సాధారణ వాహనాలను రామాయంపేట వద్ద మళ్లిస్తున్నట్లు- తెలిపారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులకు నిర్మల్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపునకు తిరిగి డైవర్షన్ మార్చుకుని వెళ్లాలని సూచించారు. కొండాపూర్ నుంచి మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

## వినాయక చవితి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రేవంత్ దంపతులు



**హైదరాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** వినాయక చవితి పర్వదినం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. వర్షాల కారణంగా మంటపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినా ప్రజలు ఉత్సాహంగా పూజల్లో పాల్గొన్నారు. ఎక్కడ చూసినా సందడి కనిపించింది. ఈ సందర్భంగా... జూబ్లీహిల్స్ నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితి సందర్భంగా సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు పూజలు నిర్వహించారు.. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ, విఘ్నేశ్వరునీ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించనన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వలన చెరువులు, జల వనరులు కలుషితం అవుతాయని, వాటిని కాపాడేందుకు మట్టి వినాయకులను నిమజ్జనం చేయాలి అని ఆయన సూచించారు. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో అందరు భక్తి శ్రద్ధలతో పాల్గోని ఘణంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు సంపూర్ణ మద్దతు

- తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- సెప్టెంబర్ 1న నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పాత పెన్షన్ స్కీమ్ సాధనే లక్ష్యంగా తెలంగాణ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. పాత పెన్షన్ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఒకే గొడుగు కిందకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మంగళవారం లకడికపూల్ లో లచ్చిరెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం 37 ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ పెన్షన్ అంతమే జేఏసీ పంతం అని అన్నారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరపున, జేఏసీ అనుబంధ సంఘాల తరపున ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాత పెన్షన్ స్థానంలో సీపీఎస్ పెన్షన్ తీసుకువచ్చిన ప్రభుత్వం, తాజాగా యూపీఎస్ పెన్షన్ స్కీమ్ ను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అంటే ప్రభుత్వం పరోక్షంగా సీపీఎస్ పెన్షన్ స్కీమ్ లో లోపాలు ఉన్నాయని ఒప్పుకుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులందరం గట్టిగా పోరాడితే మళ్ళీ పాత పెన్షన్ విధానం అమలులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎవ్వరు ప్రయత్నం చేసినా జేఏసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు వేల సంఖ్యలో ఉద్యోగులు తరలి రావాలని లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, భద్రత ప్రభుత్వం బాధ్యత అని తెలంగాణ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు దర్శన్ గౌడ్ అన్నారు. రాత్రి పగలు అనకుండా ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. సీపీఎస్ రద్దు కోసం వి. లచ్చిరెడ్డి సారథ్యంలోని తెలంగాణ ఉద్యోగుల జేఏసీతో కలిసి ఓపీఎస్ పెన్షన్ సాధనే లక్ష్యంగా సైనికులుగా పోరాడుతామన్నారు.

## శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

- దిగువకు 8.1 లక్షల క్యూసెక్కుల వరద నీరు
- పరవళ్లు తొక్కుతున్న గోదావరి
- మునిగిన పుష్కర ఘాట్లు, శివుని ఆలయం
- మాతా శిశు ఆస్పత్రి రోగులను ప్రభుత్వాసుపత్రికి తరలింపు
- జిల్లాలో వర్షం లేకపోవడం, మంచిర్యాల పట్టణానికి తప్పిన వరద ముంపు



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 28 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మంచిర్యాల జిల్లా లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండు కుండల మారింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి పైనుండి వరద నీరు భారీగా రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ అధికారులు పైనుంచి వచ్చిన వరద ఆధారంగా అదే అదే మొత్తంలో వరద నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ సామర్థ్యం 20.123 టీఎంసీలకు గాను16 టీఎంసీల నీటి నిల్వ చేస్తూ పైనుండి వచ్చిన 7.5 లక్షల క్యూసెక్కుల నీటికి గాను 62 గేట్లలో 40 గేట్లు ఎత్తి 8.1 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలడంతో గోదావరి నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. మంచిర్యాల సీఐ ప్రమోద్ కుమార్ కాలేజీ రోడ్డులోని గోదావరి నది దగ్గర నదిలోకి ప్రజలు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశాడు. గోదావరి నది దగ్గర గతంలో ఏర్పాటు చేసిన పుష్కరఘాట్ల అలాగే పుష్కర ఘాట్ల పక్కనే ఉన్న శివాలయం పూర్తిగా ముంపుకు గురైంది. ఒడ్డున ఉన్న గౌతమేశ్వరస్వామి ఆలయం వరకు వరద నీరు వచ్చింది. గోదావరి నది సమీపంలో ఉన్న పత్తి కూడా ముంపుకు గురైంది. గోదావరి ఒడ్డున ఉన్న మాత శిశు సంక్షేమ ఆస్పత్రి లో ఉన్న రోగులను మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎగువ ప్రాంతంలో భారీగా వర్షం కురిసినట్లయితే మరిన్ని గేట్లు ఎత్తితే మాతాశిశు ఆస్పత్రి మునిగే అవకాశాలున్నాయని, ముందస్తు చర్యల్లో భాగంగా మాతాశిశు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులను ముందస్తుగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### జిల్లాలో వర్షం లేక మంచిర్యాల పట్టణానికి తప్పిన వరద ముంపు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడుండి ఎస్సారెస్పీ ద్వారా 3.5 లక్షల క్యూసెక్కుల నీరు, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడం మూలంగా లక్ష క్యూసెక్కుల నీరు పైన క్యాచ్ మెంట్ ఏరియా నుండి మరో 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లోకి రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ అధికారులు 8.1 లక్షల క్యూసెక్కుల వరద నీటిని కిందికి వదలడంతో గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా నేడు వర్షం లేకపోవడం చాలా మంచిదైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో భారీ వర్షం కురిసినట్లయితే రాళ్లవాగు ఉప్పొంగి గోదావరిలో కలిసే క్రమంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో గోదావరిలోకి రాళ్లవాగు వరదనీరు రాకుండా వరద నీరు మొత్తం రివర్స్ అయి బ్యాక్‌వాటర్ కాస్త ఎన్టీఆర్ నగర్ రామ్ నగర్ ప్రాంతాలలోకి వరద నీరు వచ్చేదని ఇవాళ మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వర్షం లేకపోవడం మూలంగా వరద ముప్పు తప్పి మంచిర్యాల పట్టణానికి మంచి జరిగిందని స్థానికంగా చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా మంచిర్యాల పట్టణానికి వరద నీరు రాకుండా ఉండాలంటే కరకట్ట యొక్క ఆవశ్యకత అత్యవసరమని స్థానికులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే వరద నీటి ముంపు నుండి ప్రజలను విముక్తి చేయడానికి కరకట్ట నిర్మిస్తానని హామీ ఇచ్చి కరకట్ట నిర్మాణానికి సుమారు 240 కోట్ల నిధులను తీసుకువచ్చి పనులు ప్రారంభించారు. రాబోయే వర్షాకాలంలోపు కరకట్ట నిర్మాణం పనులు పూర్తయితే మంచిర్యాల పట్టణ ప్రజలు ప్రశాంతంగా వరద ముంపు భయం నుండి బయట పడతారు.ఎమ్మెల్యే కరకట్ట పనులు అతి తొందరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



## ఒకరినొకరు పలకరించుకున్న బండి సంజయ్, కేటీఆర్

- సిరిసిల్ల వరద బాధితుల పరామర్శ సందర్భంగా ఇద్దరినీ కలిపిన అరుదైన దృశ్యం

**గంభీరావుపేట ఆగస్టు 28 (జనం సాక్షి):** తెలంగాణ రాజకీయాల్లో అరుదైనదృశ్యం కనిపించింది. నిత్యం ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకునే కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేప థ్యంలో ఇవాళ ఇరువురు నేతలు సిరిసిల్ల జిల్లాలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు వద్ద చిక్కుకుపోయిన ఐదుగురు రైతులను హెలికాప్టర్ సాయంతో రెస్క్యూ చేశారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించేందుకు బండి సంజయ్ వచ్చారు. అదే సమయంలో అప్పర్ మానేరు జలాశయం వద్దకు కేటీఆర్ చేరుకున్నారు. ఈ క్రమంలో ఒకరినొకరు ఎదురుపడ్డారు. పరస్పరం షేక్ హ్యాండ్ స్వయంగా పలకరించుకున్నారు. కాసేపు ముచ్చటించుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా సందడి వాతావరణం ఏర్పడింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370